


మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక

GSTIN 37AMRPM5719R1ZX

జాతీయ తెలుగు దిన పత్రిక

RNI-APTEL/2023/88162

ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | సంచిక : 116 | ఆదివారం 26 - 04 -2026 | పేజీలు : 12 | వెల-3


## పులివెందుల పోలీస్ స్టేషన్‌లో సజ్జల భార్గవరెడ్డి విచారణ



# సంస్కరణలకు ముందు.. తరవాత దేశాన్ని అధ్యయనం చేశా



సంస్కరణలకు అనుగుణంగానే విజన్-2020 అమలు

టెక్నాలజీని అందుపుచ్చుకోవడంతోనే ఫలితాలు

పేదరికం నుంచి బయటపడేసేందుకు పీ4 తీసుకొచ్చాం

ప్రధాని మోదీ రిఫార్మర్, పెర్ఫార్మర్, విన్నర్

టైమ్స్ బిజినెస్ రిఫార్మర్ అవార్డు అందుకోవడం ఆనందం

దీంతో ఎపికి మరిన్ని పెట్టుబడులు వచ్చే అవకాశం

ఎకనమిక్ టైమ్స్ బిజినెస్ అవార్డు కార్యక్రమంలో చంద్రబాబు





ఆర్థిక సంస్కరణలకు ముందు.. తర్వాత దేశాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేశానని, సంస్కరణలకు అనుగుణంగానే విజన్ 2020 అమలు చేశామని ఆంధ్రప్రదేశ్ సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. ఇప్పుడు హైదరాబాద్ చూస్తున్న అభివృద్ధి ఫలాలు అవేనని అన్నారు. టెక్నాలజీని అందిపుచ్చుకుని అభివృద్ధి దిశగా ముందుకెళ్లాలని చంద్రబాబు అన్నారు. ప్రముఖ మీడియా సంస్థ ఎకనమిక్ టైమ్స్ అందించే ప్రతిష్ఠాత్మక ఎక్సలెన్స్ అవార్డుల కార్యక్రమానికి ఏపీ సీఎం చంద్రబాబు హాజరయ్యారు. 'బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్' అవార్డును చంద్రబాబుకు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడారు. 'పేదరికం నుంచి బయటపడేసేందుకు పీ4 తీసుకొచ్చాం. ఈ పథకం ఓ గేమ్ ఛేంజర్. లక్షమంది మార్గదర్శులు.. 10 లక్షల మందిని దత్తత తీసుకున్నారు. సమాజంలో లింగ సమానత్వం, మహిళా సాధికారత చాలా ముఖ్యం. అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో భారత్ అగ్రస్థాయి దేశంగా మారుతుందని చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ప్రధాని మోదీ రిఫార్మర్, పెర్ఫార్మర్,



# మే 5నుంచి బెంగాల్లో మహిళలకు స్వేచ్ఛ

## రాత్రి ఒంటిగంట తరవాత కూడా స్వేచ్ఛగా రావచ్చు

## ఎన్నికల ప్రచారంలో కేంద్రహోంమంత్రి అమిత్ షా

ప్రస్తుతం బెంగాలీ మహిళలు భయంతో జీవిస్తున్నారని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా అన్నారు. మహిళలు సాయంత్రం ఏడు తర్వాత బయటికి రావొద్దంటూ మమతా బెనర్జీ గతంలో చేసిన వ్యాఖ్యలను అమిత్ షా విమర్శించారు. మే ఐదో తేదీ తర్వాతి నుంచి పశ్చిమ బెంగాల్ మహిళలు రాత్రి ఒంటిగంట తర్వాత కూడా భయం లేకుండా రోడ్లపై తిరగొచ్చని అమిత్ షా పేర్కొన్నారు.

## లిక్కర్ కేసులో సిట్ ముమ్మర దర్యాప్తు

### హైదరాబాద్‌లో మాజీమంత్రి కారుమూరి విచారణ

వైసీపీ నేత, మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరావును సిట్ అధికారులు శనివారం హైదరాబాద్‌లో విచారించారు. నాలుగు గంటల పాటు కారుమూరిని విచారించి స్టేట్‌మెంట్ రికార్డ్ చేశారు. కారుమూరిని ఎస్పీ, ఇద్దరు డీఎస్పీలు విచారించారు. మద్యం రవాణా టెండర్ల జారీలో కారుమూరి పాత్రపై సిట్ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా

## కవితవి పిట్టల దొరసాని మాటలు..

### బీజేపీనే ఆమెకు రాజకీయ సమాధి కట్టింది



కొత్త పార్టీ పెట్టినా కవితకు ఒరిగేది ఏమీ లేదని అర్వింద్ వ్యాఖ్య

బీజేపీ మద్దతు లేకుండానే తెలంగాణ వచ్చిందా అని ప్రశ్న

బీఆర్ఎస్ పాలనలో సామాజిక తెలంగాణ రాలేదన్న అర్వింద్

## పశ్చిమ బెంగాల్‌లో రాహుల్ గాంధీ..

### వివాదం తర్వాత నేడు ఎన్నికల ప్రచారం



కోల్‌కతా, సెరంపూర్‌లలో రెండు ఎన్నికల సభలు

మొదట అనుమతి నిరాకరించడంతో వాయిదా పడిన ర్యాలీలు

మమత పాలన వైఫల్యం వల్లే బీజేపీ ఎదిగిందన్న రాహుల్

రాష్ట్రంలో కొనసాగుతున్న అసెంబ్లీ ఎన్నికల పోలింగ్

పశ్చిమ బెంగాల్‌లో కాంగ్రెస్ నేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. పోలీసుల అనుమతి నిరాకరణతో వాయిదా పడిన ఆయన సభలకు తాజాగా మార్గం సుగమమైంది. ఈ రోజు కోల్‌కతా, సెరంపూర్‌లలో రాహుల్

# మరో 47మంది అజ్ఞాత మావోల లొంగుబాటు

### గణపతి తదితరులు ఇంకా అజ్ఞాతంలోనే ఉన్నారు

### తెలంగాణ డిజిపి శివధర్ రెడ్డి వెల్లడి



# మే9న ప్రధాని మోడీ పర్యటన

### రాష్ట్రంలో పలు ప్రాజక్టులకు ప్రారంభోత్సవాలు



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలంగాణలో వచ్చే నెల 9వ తేదీన పర్యటించనున్నారు. ప్రధాని పర్యటనలో భాగంగా సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించే అవకాశం ఉంది. ఈ పర్యటనలో ప్రధానంగా రాష్ట్రంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రధాని శంకుస్థాపన చేయనున్నారని తెలుస్తోంది. అలాగే ఇప్పటికే పూర్తయిన కొన్ని ప్రాజెక్టులను జాతికి అంకితం చేసే కార్యక్రమాలు కూడా ఉండే అవకాశముంది. ముఖ్యంగా ఎంఎంటిఎస్ 2ను జాతికి అంకితం చేసే అంశం ఈ పర్యటనలో ప్రధానంగా ఉండొచ్చని సమాచారం. హైదరాబాద్ నగర రవాణా వ్యవస్థను మెరుగుపరిచే ఈ ప్రాజెక్ట్ ప్రజా ప్రయాణానికి కీలకంగా మారనుంది. అలాగే ఎయిమ్స్ బీబీనగర్ ఆస్పత్రిని కూడా జాతికి అంకితం చేసే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ ఆస్పత్రి తెలంగాణతో పాటు సమీప రాష్ట్రాల ప్రజలకు కూడా వైద్యసేవల్లో పెద్ద మార్పు తీసుకురానుంది. ఇవే కాకుండా రాష్ట్రంలో పలు జాతీయ రహదారుల అభివృద్ధి ప్రాజెక్టులకు

## కవిత 'టీఆర్ఎస్' పార్టీపై కాంగ్రెస్ విమర్శలు



బీఆర్ఎస్ కు టీఆర్ఎస్ తోకపార్టీ అన్న రామ్మోహన్ రెడ్డి

బీఆర్ఎస్ లో అంతర్భాగమే టీఆర్ఎస్ అని వ్యాఖ్య

అంతా 'గ్యాస్' అంటూ కాంగ్రెస్ నేత సెటైర్

# 'మీటింగ్'కు ముందే 'ఎగ్జిట్'..

## కేజ్రీవాల్‌ను బోల్తా కొట్టించిన ఎంపీలు!



ఏడుగురు 'ఆప్' రాజ్యసభ ఎంపీల రాజీనామా

రాఘవ్ చద్దా, హర్భజన్ సింగ్ సహా కీలక ఎంపీలు బీజేపీలో చేరిక

పార్టీ సిద్ధాంతాలకు దూరమైందంటూ రాఘవ్ చద్దా ఆరోపణ

ఎంపీలను బుజ్జగించేందుకు కేజ్రీవాల్ చేసిన చివరి ప్రయత్నం విఫలం

ఇది బీజేపీ 'ఆపరేషన్ లోటస్' కుట్ర అని ఆప్ ఎదురుదాడి

## ఎమ్మెల్సీలుగా కోదండరాం, అజారుద్దీన్..



# కవిత 'టీఆర్ఎస్' పార్టీపై కాంగ్రెస్ విమర్శలు

కల్వకుంట్ల కవిత 'తెలంగాణ రాష్ట్ర సేన' (౦=నా)ను ప్రకటించిన కొద్దిసేపటికే రాష్ట్ర రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. ముఖ్యంగా ఆమె తన తండ్రి కేసీఆర్ ను 'మరమనిషి' అని సంబోధించడం, రేవంత్ రెడ్డిని పాలనను 'హిట్లర్ పాలన'తో పోల్చడం సంచలనంగా మారింది. కవిత టీఆర్ఎస్ పార్టీపై టీపీసీసీ మీడియా కమిటీ చైర్మన్ సామ రామ్మోహన్ రెడ్డి ఎక్స్ వేదికగా ఎద్దేవా చేశారు. కవిత పెట్టిన 'తెలంగాణ రాష్ట్ర సేన' స్వతంత్రమైనది కాదని, అది బీఆర్ఎస్ పార్టీకి ఒక 'తోక పార్టీ' మాత్రమేనని రామ్మోహన్ రెడ్డి అన్నారు. తండ్రి కేసీఆర్, తనయ కవిత ఇద్దరూ ఒక్కటేనని.. బాపు నడిపే బీఆర్ఎస్ లో అంతర్భాగమే ఈ కొత్త టీఆర్ఎస్ అని ఎద్దేవా చేశారు. "తలా తోక ఎప్పటికీ ఒక్కటే... బాపు బీఆర్ఎస్ అంతర్భాగమే తనయ టీఆర్ఎస్.. అంతా గ్యాస్ " అని సెటైర్ వేశారు.

# పశ్చిమ బెంగాల్‌లో రాహుల్ గాంధీ..

గాంధీ బహిరంగ సభల్లో పాల్గొని ప్రసంగించనున్నారు. వాస్తవానికి ఈ నెల 23న కోల్‌కతా, సెరంపూర్‌లలో రాహుల్ గాంధీ ర్యాలీలు జరగాల్సి ఉంది. అయితే, చివరి నిమిషంలో పోలీసులు అనుమతి నిరాకరించడంతో అవి రద్దయ్యాయి. అధికార తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ప్రభుత్వ ఒత్తిడి వల్లే తమ సభలకు అనుమతి ఇవ్వలేదని కాంగ్రెస్ పార్టీ తీవ్ర ఆరోపణలు చేసింది. ఈ పరిణామంతో ఇరు పార్టీల మధ్య ఉద్రిక్తత పెరిగింది.అయితే, ఈ వివాదం కొద్దిసేపటికే సద్దుమణిగింది. ఏప్రిల్ 22న అధికారులు తాజాగా అనుమతులు మంజూరు చేయడంతో వాయిదా పడిన సభలను ఏప్రిల్ 25న నిర్వహించాలని నిర్ణయించారు. దీని ప్రకారం, ఈ రోజు మధ్యాహ్నం 2:30 గంటలకు కోల్‌కతాలోని చారిత్రక షహీద్ మినార్ మైదానంలో, ఆ తర్వాత హుగ్లీ జిల్లాలోని సెరంపూర్‌లో జరిగే బహిరంగ సభలో రాహుల్ ప్రసంగిస్తారు. ఇటీవల తృణమూల్, బీజేపీలపై రాహుల్ గాంధీ విమర్శల దాడి పెంచారు. "మమతా బెనర్జీ స్వచ్ఛమైన పాలన అందించి, బెంగాల్‌ను విభజించకుండా ఉండుంటే, బీజేపీ ఇక్కడికి వచ్చేందుకు ఆస్కారమే ఉండేది కాదు" అని ఆయన వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ఏప్రిల్ 23న తొలి విడత పోలింగ్ ముగియగా, ఏప్రిల్ 29న రెండో విడత పోలింగ్ జరగనుంది.

# 'మీటింగ్'కు ముందే 'ఎగ్జిట్'..

అసమ్మతి ఎంపీలను బుజ్జగించేందుకు ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అధినేత అరవింద్ కేజ్రీవాల్ సిద్ధమవుతుండగానే, ఆయనకు ఊహించని రీతిలో భారీ షాక్ తగిలింది. పార్టీపై గుర్రుగా ఉన్న ఎంపీలతో సమావేశమై, వారిని శాంతింపజేయాలని ఆయన వేసిన ప్రణాళిక కార్యరూపం దాల్చక ముందే, ఏడుగురు కీలక రాజ్యసభ సభ్యులు పార్టీకి మూకుమ్మడిగా రాజీనామా చేసి భారతీయ జనతా పార్టీ (బీజేపీ) తీర్థం పుచ్చుకున్నారు. ఈ నాటకీయ పరిణామం జాతీయ రాజకీయాల్లో తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తోంది.

**ఆయన పిలిచేలోపే.. వారు వెళ్లిపోయారు!** విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం పార్టీలో అసమ్మతి పెరుగుతోందని గ్రహించిన కేజ్రీవాల్.. శుక్రవారం సాయంత్రం తన నివాసంలో కీలక ఎంపీలతో సమావేశం కావాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో వారిని బుజ్జగించి, అవసరమైతే ప్రస్తుతానికి రాజీనామా చేయాలని, తదుపరి టర్మ్‌లో మళ్లీ అవకాశమిస్తానని హామీ ఇచ్చేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. అయితే, కేజ్రీవాల్ వ్యూహాన్ని పసిగట్టిన అసమ్మతి వర్గం ఆయనకు ఆ అవకాశం ఇవ్వలేదు. గురువారమే పార్టీని వీడాలని రహస్యంగా నిర్ణయించుకుని, శుక్రవారం ఉదయమే బీజేపీ అగ్రనేతలతో మంతనాలు జరిపి, కేజ్రీవాల్ సమావేశానికి కొన్ని గంటల ముందే తమ రాజీనామా నిర్ణయాన్ని బహిరంగపరిచారు. ఈ పరిణామంతో ఆప్ నాయకత్వం పూర్తిగా దిగ్భ్రాంతికి గురైంది.

**సిద్ధాంతాలు మరిచారంటూ చద్దా విమర్శ** బీజేపీలో చేరిన అనంతరం రాఘవ్ చద్దా మీడియాతో మాట్లాడుతూ ఆప్ నాయకత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. "ఒకప్పుడు మేమంతా రక్తమాంసాలు ధారపోసి నిర్మించుకున్న పార్టీ ఇది. కానీ, నేడు ఆప్ తన మూల సిద్ధాంతాలను, విలువలను పూర్తిగా విస్మరించింది. అందుకే మేం ఈ కఠిన నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కింద అనర్హత వేటు పడకుండా ఉండేందుకే రాజ్యాంగంలోని నిబంధనల ప్రకారం మూడింట రెండొంతుల మంది సభ్యులుగా (10 మందిలో 7) తాము విలీన నిర్ణయం తీసుకున్నామని, దీనికి సంబంధించిన పత్రాలను రాజ్యసభ చైర్మన్‌కు అందజేశామని చద్దా స్పష్టం చేశారు. రాఘవ్ చద్దా, హర్భజన్ సింగ్, స్వాతి మలివాల్, సందీప్ పాఠక్ వంటి ప్రముఖులు పార్టీ వీడిన వారిలో ఉన్నారు.

**'ఆపరేషన్ లోటస్' అని ఆప్ ఎదురుదాడి** ఈ అనూహ్య పరిణామంపై ఆమ్ ఆద్మీ పార్టీ తీవ్రంగా స్పందించింది. ఇది బీజేపీ కుట్రపూరితంగా అమలు చేసిన "ఆపరేషన్ లోటస్" అని ఆ పార్టీ సీనియర్ నేత సంజయ్ సింగ్ ఆరోపించారు. "పంజాబ్‌లో మా ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను చూసి ఓర్వలేకే బీజేపీ ఈ నీచ రాజకీయాలకు పాల్పడుతోంది. మా ఎమ్మెల్యేలను, ఎంపీలను కొనుగోలు చేసి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోంది," అని ఆయన మండిపడ్డారు. మొత్తం 10 మంది రాజ్యసభ సభ్యుల్లో ఏకంగా ఏడుగురు పార్టీని వీడటంతో, 14 ఏళ్ల ఆప్ చరిత్రలోనే ఇది అతిపెద్ద సంక్షోభంగా రాజకీయ విశ్లేషకులు అభివర్ణిస్తున్నారు. ఈ పరిణామం పంజాబ్ ప్రభుత్వంపైనా, పార్టీ భవిష్యత్తుపైనా తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది.

# ఎమ్మెల్సీలుగా కోదండరాం, అజారుద్దీన్..

### కోదండరాం, అజారుద్దీన్ ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాలకు గవర్నర్ ఆమోదం

### తనకు మంత్రి పదవిపై ఆశ లేదన్న కోదండరాం

### ప్రజా ప్రయోజనాలే తనకు ముఖ్యమని వ్యాఖ్య

గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థులుగా ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రొఫెసర్ కోదండరాం, టీమిండియా మాజీ కెప్టెన్ మహ్మద్ అజారుద్దీన్‌ల అభ్యర్థిత్వాలను రాష్ట్ర గవర్నర్ ఆమోదించారు. దీనికి సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్ కూడా మరికొద్ది సేపట్లో విడుదల కానుంది. ఎమ్మెల్సీగా నియామకం ఖరారైన అనంతరం కోదండరాం మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. తనకు మంత్రి పదవిపై ఎలాంటి ఆశ లేదని, ప్రజా సమస్యలపై గొంతు వినిపించేందుకే ఎమ్మెల్సీ బాధ్యతను స్వీకరిస్తున్నట్లు స్పష్టం చేశారు. వ్యక్తిగత లాభం కంటే ప్రజా ప్రయోజనాలే తనకు ముఖ్యమని స్పష్టం చేశారు. మరోవైపు, ఇప్పటికే మంత్రిగా కొనసాగుతున్న అజారుద్దీన్‌కు ఎమ్మెల్సీ సీటు ఖరారు కావడంతో పెద్ద ఊరట లభించింది. అన్ని చిక్కులు తొలగిపోవడంతో ప్రభుత్వం కూడా ఊపిరి పీల్చుకుంది. గెజిట్ విడుదలైన తర్వాత వీరిద్దరూ ఎమ్మెల్సీలుగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

# అమెరికాతో ప్రత్యక్ష చర్చలు లేవు.. పాక్ ద్వారానే మా వైఖరి చెబుతాం: ఇరాన్

అమెరికా, ఇరాన్ మధ్య నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతలను తగ్గించి, నిలిచిపోయిన శాంతి చర్చలను పునరుద్ధరించేందుకు దౌత్య ప్రయత్నాలు మళ్లీ ఊపందుకున్నాయి. ఈసారి కూడా పాకిస్థాన్ మధ్యవర్తిగా కీలక పాత్ర పోషిస్తోంది. ఇందులో భాగంగా ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి నేతృత్వంలోని ఉన్నతస్థాయి ప్రతినిధుల బృందం శుక్రవారం ఇస్లామాబాద్ చేరుకుంది. అయితే, ఈ పర్యటనలో అమెరికాతో ఎలాంటి ప్రత్యక్ష చర్చలు ఉండబోవని ఇరాన్ ముందుగానే స్పష్టం చేసింది. పాకిస్థాన్ ద్వారా తమ ఆందోళనలను, వైఖరిని పరోక్షంగా వాషింగ్టన్‌కు తెలియజేస్తామని పేర్కొంది.ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఖాయీ మాట్లాడుతూ.. అమెరికా ప్రారంభించిన దురాక్రమణ యుద్ధానికి ముగింపు పలికి, ప్రాంతంలో శాంతిని పునరుద్ధరించే లక్ష్యంతో పాకిస్థాన్ చేస్తున్న మధ్యవర్తిత్వ ప్రయత్నాలలో భాగంగా తాము ఇస్లామాబాద్‌లో పర్యటిస్తున్నామని తెలిపారు. ఇరాన్ ప్రతినిధుల బృందం పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, ఆర్మీ చీఫ్ జనరల్ అసిమ్ మునీర్‌తో సమావేశం కానుంది. మరోవైపు ఈ చర్చల్లో పాల్గొనేందుకు అమెరికా ప్రత్యేక ప్రతినిధులు స్టీవ్ విట్కాఫ్, జారెడ్ కుష్నర్ కూడా ఇస్లామాబాద్ రానున్నారు. పాకిస్థాన్ ఈ చర్చలకు వేదికగా నిలుస్తోందని వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ ధృవీకరించారు. ఇరాన్ ఆఫర్‌పై ట్రంప్ వ్యాఖ్యలు ఈ పరిణామాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందిస్తూ, తమ డిమాండ్లను నెరవేర్చేందుకు ఇరాన్ ఒక ప్రతిపాదనను సిద్ధం చేస్తోందని అన్నారు. "వారు ఒక ఆఫర్ ఇస్తున్నారు, దానిని మనం చూడాలి" అని రాయిటర్స్‌తో మాట్లాడుతూ ట్రంప్ వ్యాఖ్యానించారు.

# బిఆర్ఎస్ ఉండి అవినీతిలో భాగస్వామ్యం

### ఇప్పుడు నీతి పలుకులు పలికితే ప్రజలు నమ్మరు

### సిఎం రేవంత్‌ను విమర్శిస్తే ఓట్లు రాలవు

### కవిత పార్టీపై ఎంపి చామల విమర్శలు

బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడే కవిత బయటకు వచ్చి పార్టీ పెట్టి ఉంటే ప్రజల్లో మంచి ఆదరణ వచ్చేదని కాంగ్రెస్ భువనగిరి లోక్‌సభ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి చెప్పుకొచ్చారు. అధికారంలో ఉండగా అవినీతిలో భాగస్వామ్యం అయిన కవిత ఇప్పుడు పార్టీ పెట్టి ప్రజలను ఎలా నమ్మిస్తామని అనుకుంటున్నారని ప్రశ్నించారు. కల్వకుంట్ల కవిత కొత్త పార్టీపై ఎంపి కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ రాష్ట్ర సేన పార్టీ పెట్టినందుకు ఆమెకు ధన్యవాదాలు తెలిపారు. అమ్మగా జేబులు చూసి కాదని.. కడుపు చూసి పాలిస్తానని కవిత చెప్పారని ప్రస్తావించారు. శనివారం హైదరాబాద్ లో కిరణ్ కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు జేబులు చూసి పరిపాలించారని కవిత చెప్పారని అన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో గతంలో టీఆర్ఎస్‌ను ఏర్పాటు చేశారని ప్రస్తావించారు. నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో తెలంగాణను కేసీఆర్ హయాంలో దోపిడీ చేశారని ఎంపీ చామల ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ హయాంలోని పదేళ్లు కవిత ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. పంచుకునే వాటాల్లో తేడాలు వచ్చి ఆమె బయటకు వచ్చారని తెలంగాణ ప్రజలు భావిస్తున్నారని అన్నారు. కవిత ఇప్పుడు బయటకు వచ్చి సీఎం, సీఎం అని నినాదాలు చేయించుకుంటున్నారని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డిని కర్కోటకుడు, హిట్లర్ అంటే కవితకు మార్కులు పడవని ఆక్షేపించారు. రేవంత్‌రెడ్డి రైతు రుణమాఫీ, ఫ్యూచర్ సిటీ, ఉద్యోగాలు, మూసీ ప్రక్షాళన చేస్తున్నందుకు కర్కోటకుడు అయ్యారా...? అని ఫైర్ అయ్యారు. కవిత పార్టీ పెట్టుకోవచ్చని, పోరాటం చేయొచ్చని, ప్రజల్లోకి వెళ్లవచ్చని తెలిపారు. తెలంగాణను దోచుకోవడానికే ఆమె సీఎం కావాలని అంటున్నారా..? అని నిలదీశారు. కవిత నిర్మాణాత్మక రాజకీయాలు చేస్తే స్వాగతిస్తామని తెలిపారు. ఆమె తెల్లకాగితం కాదని.. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఎంపీగా, ఎమ్మెల్సీగా పని చేశారని గుర్తు చేశారు. తెలంగాణ ప్రజలను కవిత తప్పుదోవ పట్టిస్తున్నారని.. తెలంగాణ ప్రజలు ఆమెను నమ్మరని కిరణ్ కుమార్ రెడ్డి విమర్శించారు.

# తొలి ప్రైవేటు ఆర్బిటల్ రాకెట్ విక్రమ్-1

### జెండా ఊపి ప్రారంభించిన సిఎం రేవంత్



హైదరాబాద్ స్కైరూట్ ఏరోస్పేస్ వేదికగా దేశపు తొలి ప్రైవేటు ఆర్బిటల్ రాకెట్ విక్రమ్-1 ప్రయాణం మొదలు కానుంది. ఇందులో భాగంగా మ్యాక్స్-క్యూ క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు, పలువురు అధికారులు హాజరయ్యారు. శ్రీహరి కోటకు పంపనున్న రాకెట్ విక్రమ్-1ను సీఎం జెండా ఊపి ప్రారంభించారు. ప్రీ ఫైలట్ పరీక్షలన్నింటినీ పూర్తి చేసుకొని తదుపరి ప్రయోగం కోసం.. సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్‌కు ఇది చేరుకోనుంది. ఇండియాలోనే తొలి ప్రైవేట్ రాకెట్ గా రికార్డుకెక్కిన విక్రమ 1 రాకెట్ ను ఫ్లాగ్ ఆఫ్ చేసి శ్రీహరి కోటకు పంపారు సీఎం రేవంత్ రెడ్డి. 2026 ఏప్రిల్ 25న శంషాబాద్ ఏరోస్పేస్ పార్క్‌లోని స్కైరూట్ సంస్థను సందర్శించారు సీఎం. ఆ సంస్థ తయారు చేసిన భారత తొలి ప్రైవేట్ కమర్షియల్ రాకెట్ విక్రమ్-1 గురించి తెలుసుకున్నారు. స్కైరూట్ సంస్థలో రాకెట్ తయారీ, టెక్నాలజీ తదితర అంశాల గురించి చర్చించారు. తొలి ప్రైవేట్ రాకెట్ తయారు చేసిన సంస్థ యాజమాన్యాన్ని అభినందించారు. రాకెట్ ను శ్రీహరికోట లోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి లాంచ్ చేయనున్నారు. దీంతో సీఎం రేవంత్ జెండా ఊపి శ్రీహరి కోటకు పంపారు. హైదరాబాద్‌కు చెందిన స్పేస్‌టెక్ స్టార్టప్ స్కైరూట్ ఏరోస్పేస్ అభివృద్ధి చేసిన విక్రమ్-1 భారతదేశపు మొట్టమొదటి ప్రైవేట్ కమర్షియల్ ఆర్బిటల్ రాకెట్. 2025 నవంబర్‌లో ఈ రాకెట్ ను ఆవిష్కరించారు. 480 కిలోల బరువున్న ఉపగ్రహాలను తక్కువ భూ కక్ష్యలోకి తీసుకెళ్లగలదు దీనిని పూర్తిగా కార్బన్ ఫైబర్‌తో నిర్మించడం విశేషం. ఇది 3ఆ ప్రింటెడ్ ఇంజన్‌లను కలిగి ఉండి.. పూర్తిగా కార్బన్-÷బైర్ బాడీ రాకెట్. కార్బన్ ÷బైర్ వాడటం వలన ఇది తేలికగా, బలంగా ఉంటుంది. సుమారు 300 - 480 కిలోల బరువున్న ఉపగ్రహాలను 500 కిలోమీటర్ల లో ఎర్త్ ఆర్బిట్ లోకి ప్రవేశపెట్టగలదు. 2026 లో త్వరలో అంతరిక్షంలోకి వెళ్లనుంది. భారత అంతరిక్ష పితామహుడు విక్రమ్ సారాభాయ్ పేరు మీద ఈ రాకెట్‌కు 'విక్రమ్-1' అని పేరు పెట్టారు. ఇది పూర్తి స్వదేశీ సాంకేతికత తో, 100శాతం భారతదేశంలోనే తయారైంది.

# అజారుద్దీన్, కోదండ రామ్‌లకు ఊరట

### గవర్నర్ కోటా ఎమ్మెల్సీలకు గ్రీన్ సిగ్నల్

గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకానికి సంబంధించి రాష్ట్ర మంత్రివర్గం ప్రతిపాదించిన అజారుద్దీన్, కోదండరాం అభ్యర్థిత్వాలకు లైన్ క్లియర్ అయ్యింది. వారిద్దరి అభ్యర్థిత్వాలను ఆమోదిస్తూ గవర్నర్ శివప్రతాప్ శుక్లా సంతకం చేశారు. దీనిపై త్వరలో గెజిట్ నోటిఫికేషన్ విడుదల కానుంది. గవర్నర్ కోటా ఎమ్మెల్సీలపై గత మూడేళ్లుగా వివాదం కొనసాగుతోంది. ఈ నెల 30 లోగా ఎమ్మెల్సీ కాకపోతే అజారుద్దీన్ మంత్రి పదవి కోల్పోనున్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాలను త్వరగా పరిశీలించాలని గవర్నర్‌ను ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. ఈ నేపథ్యంలో రాష్ట్రమంత్రి వర్గం ప్రతిపాదించిన పేర్లను ఆమోదిస్తూ గవర్నర్ తాజాగా సంతకాలు చేశారు. దీంతో ఈ ఇద్దరు ఇక ఎమ్మెల్సీలుగా కొనసాగనున్నారు.

# మండుతున్న ఎండలు.. క్విక్ కామర్స్‌లో వీటిని తెగ ఆర్డర్ చేస్తున్నారట!

భారతదేశ వ్యాప్తంగా భానుడు భగభగమంటున్నాడు. రికార్డు స్థాయిలో నమోదవుతున్న ఉష్ణోగ్రతలతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఈ తీవ్రమైన వేడి నుంచి ఉపశమనం పొందేందుకు నగరవాసులు క్విక్ కామర్స్ ప్లాట్‌ఫారమ్‌లపై ఆధారపడుతున్నారు. దీంతో స్విగ్గీ ఇన్‌స్టామార్ట్, జెప్టో, ఫ్లిప్‌కార్ట్ మినిట్స్ వంటి సంస్థల్లో కూలింగ్, హైడ్రేషన్ ఉత్పత్తుల అమ్మకాలు అమాంతం పెరిగిపోయాయి.ప్రముఖ క్విక్ కామర్స్ సంస్థ స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ అమ్మకాల్లో భారీ పెరుగుదలను గమనించింది. మార్చి చివరి వారంతో పోలిస్తే, సీజనల్ ఉత్పత్తుల అమ్మకాలు ఏకంగా నాలుగు రెట్లు పెరిగాయని సంస్థ తెలిపింది. ముఖ్యంగా కోల్డ్ కాఫీ, మామిడి పళ్ల అమ్మకాలు 10 రెట్లు పెరగడం విశేషం. ఐస్‌క్రీమ్, శీతలపానీయాలు, పుచ్చకాయలు, మామిడి పళ్లతో పాటు పెరుగుకు కూడా విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. దేశవ్యాప్త ఐస్‌క్రీమ్ అమ్మకాల్లో ఒక్క బెంగళూరు నగరమే 14 శాతం వాటాను కలిగి ఉండగా, మామిడి పళ్ల ఆర్డర్లలో మూడింట ఒక వంతు వాటాతో అగ్రస్థానంలో నిలిచింది. బెంగళూరు తర్వాత చెన్నై, హైదరాబాద్ నగరాలు ఉన్నాయి. జీరా మసాలా సోడా వంటి ఉత్పత్తుల అమ్మకాలు కూడా 10 రెట్లు పెరిగాయని స్విగ్గీ వెల్లడించింది.మరోవైపు జెప్టో ప్లాట్‌ఫారమ్‌లో ఐస్‌క్రీమ్‌లు, సన్‌స్క్రీన్, ఇన్‌స్టంట్ డ్రింక్ మిక్స్‌లు, టాల్కమ్ పౌడర్ వంటి వాటికి బలమైన డిమాండ్ కనిపిస్తోంది. వేడి నుంచి రక్షణ కోసం ఫ్యాన్లు, గొడుగులు కూడా నిత్యావసరాలుగా మారాయని సంస్థ పేర్కొంది. ఫ్లిప్‌కార్ట్ మినిట్స్ కూడా ఇదే తరహా ట్రెండ్‌ను నివేదించింది. ఏప్రిల్ 2025 నుంచి చేతి విసనకర్రల (హ్యాండ్ ఫ్యాన్లు) అమ్మకాలు 44 రెట్లు పెరిగాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. దీంతోపాటు హైడ్రేషన్ డ్రింక్స్ 12 రెట్లు, స్విమ్‌వేర్ 8 రెట్లు, ఏరేటెడ్ డ్రింక్స్ 2.5 రెట్లు, కీటక నివారిణులు (ఇన్‌సెక్ట్ రిపెల్లెంట్) రెట్టింపునకు పైగా అమ్ముడయ్యాయి. అమెజాన్ నౌ, టాటా గ్రూప్‌కు చెందిన బిగ్‌బాస్కెట్ కూడా ఇదే బాటలో పయనిస్తున్నాయి. బిగ్‌బాస్కెట్‌లో ఐస్‌క్రీమ్‌ల అమ్మకాలు గతేడాదితో పోలిస్తే 100 శాతం వృద్ధిని సాధించాయి. మజ్జిగ, లస్సీ, సాఫ్ట్ డ్రింక్స్, ఫ్యాన్లు, కొబ్బరి నీళ్లు, మామిడి పళ్లు డబుల్ డిజిట్ వృద్ధిని చూశాయి. దేశంలోని చాలా ప్రాంతాల్లో హీట్ వేవ్ రోజుల సంఖ్య గణనీయంగా పెరుగుతుందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరించడం ఈ డిమాండ్‌కు ప్రధాన కారణంగా నిలుస్తోంది. రాత్రి ఉష్ణోగ్రతలు కూడా తగ్గకపోవడంతో ప్రజలు ఉపశమనం కోసం 24 గంటలూ చల్లదనాన్ని అందించే ఉత్పత్తుల వైపుమొగ్గుచూపుతున్నారు. మొత్తం మీద, పెరుగుతున్న వేసవి తాపం భారతీయుల షాపింగ్ అలవాట్లను మార్చేస్తోంది. తక్షణ ఉపశమనం కోసం, కేవలం 10-20 నిమిషాల్లో డెలివరీ చేసే క్విక్ కామర్స్ సంస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయి.

# మరో 47మంది అజ్ఞాత మావోల లొంగుబాటు

తెలంగాణలో మావోయిస్టు ఉద్యమం అంతిమదశకు చేరుకోవడంతో మిగిలిన వారు కూడా లొంగుబాట పట్టారు. రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మొత్తం 47 మంది అజ్ఞాత మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయి జనజీవన స్రవంతిలో చేరారు. లొంగిపోయిన వారిలో దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యులు, అలాగే దక్షిణ బస్తర్ డివిజనల్ కమిటీకి చెందిన కీలక నేతలు ఉన్నారు. ముఖ్యంగా హేమ్లా ఇతు (అలియాస్ విజ్జా), పోడియం లచ్చు (అలియాస్ మనోజ్) వంటి నాయకులు ఈ జాబితాలో ఉన్నారని డీజీపీ తెలిపారు. లొంగుబాటు సందర్భంగా మావోయిస్టులు భారీగా ఆయుధాలు కూడా అప్పగించారు. మొత్తం 32 ఆయుధాలు, అలాగే 515 తూటాలు పోలీసులకు సమర్పించినట్లు డీజీపీ వెల్లడించారు. వీటిలో ఎకె-47, పలు రకాల రైఫిల్స్‌తో పాటు పిస్టల్స్, రివాల్వర్, మస్కెట్ గన్స్ వంటి వివిధ రకాల ఆయుధాలు ఉన్నాయి.తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న పునరావాస విధానం కారణంగా ఈ మావోయిస్టు కేడర్లు లొంగుబాటుకు ముందుకొచ్చారని చెప్పారు. దక్షిణ బస్తర్ డివిజన్ ప్రస్తుతం పూర్తిగా నిర్వీర్య స్థితికి చేరిందని కూడా డీజీపీ వ్యాఖ్యానించారు. లొంగిపోయిన వారిలో ఖఒఉం బెటాలియన్‌కు చెందిన 4 మంది, ఆఐ÷ూజిఅకు చెందిన 28 మంది, అలాగే 9వ, 30వ ప్లాటూన్‌లకు చెందిన 15 మంది ఉన్నారని వివరించారు. ఇక తెలంగాణకు చెందిన కొంతమంది కీలక మావోయిస్టు నాయకులు ఇంకా అజ్ఞాతంలో ఉన్నారని డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. వారిలో లక్ష్మణరావు (గణపతి), పసునూరి నరహరి (సంతోషం), జాడి రత్నాభాయ్ (సుజాత), వార్త శేఖర్ (మంగు) ఉన్నారని పేర్కొన్నారు. వీరిని కూడా లొంగిపోవాలని డీజీపీ విజ్ఞప్తి చేశారు. మావోయిస్టు ఉద్యమంపై తెలంగాణలో భద్రతా బలగాల చర్యలు మరింత ప్రభావం చూపుతున్నాయని డీజీపీ తెలిపారు. నజీవన స్రవంతిలో చేరి తెలంగాణ ప్రభుత్వ లొంగుబాటు, పునరావాస విధానం ద్వారా లభించే అన్ని ప్రయోజనాలను పొందాలని డీజీపీ విజ్ఞప్తి చేశారు. గత రెండేళ్లలో తెలంగాణ పోలీసుల సమర్థవంతమైన పనితీరు వల్ల మొత్తం 818 మంది మావోయిస్టులు లొంగిపోగా, వారి నుంచి 334 ఆయుధాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం కల్పిస్తున్న మెరుగైన పునరావాస ప్యాకేజీలు, పోలీసులు సాగిస్తున్న అవగాహన కార్యక్రమాల వల్ల అడవి బాట పట్టిన వారు తిరిగి ఇంటికి చేరుకుంటున్నారని చెప్పుకొచ్చారు. ఈ భారీ లొంగుబాటుతో రాష్ట్రంలో మావోయిస్టు ప్రభావం మరింత తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని డీజీపీ శివధర్ రెడ్డి పేర్కొన్నారు.

# మే9న ప్రధాని మోడీ పర్యటన

ప్రధాని శంకుస్థాపనలు చేయనున్నారని సమాచారం.రవాణా, కనెక్టివిటీ రంగాల్లో ఈ ప్రాజెక్టులు కీలకమని ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి. ఇక మరో అంశంగా మల్లారెడ్డి యూనివర్సిటీ పర్యటన కూడా ప్రధాని షెడ్యూల్‌లో ఉండొచ్చని చర్చ జరుగుతోంది. అయితే ఇది ఇంకా అధికారికంగా ఖరారు కాలేదని తెలుస్తోంది. ప్రధాని మోదీ పర్యటన తెలంగాణ అభివృద్ధి ప్రాజెక్టుల ప్రారంభాలు, రవాణా మౌలిక సదుపాయాల విస్తరణ, ఆరోగ్య రంగంలో కొత్త సదుపాయాలపై కేంద్రీకృతమై ఉండే అవకాశాలు ఉన్నాయి. ప్రధాని అధికారిక షెడ్యూల్ పూర్తిగా ప్రకటించాల్సి ఉంది.

# మే 5నుంచి బెంగాల్లో మహిళలకు స్వేచ్ఛ

పశ్చిమ బెంగాల్‌లోని పూర్బ బర్ధమాన్ జిల్లాలోని జమాల్‌పూర్ గ్రామంలో జరిగిన ఎన్నికల ర్యాలీలో అమిత్ షా పాల్గొన్నారు. రాష్ట్రంలో మహిళల భద్రత విషయంలో విఫలమయ్యారని ముఖ్యమంత్రి మమతా బెనర్జీపై విమర్శలు గుప్పించారు. 'ఒక మహిళా ముఖ్యమంత్రి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరైన పాలనకు సంకేతమా?' అని ప్రశ్నించారు. భారతీయ జనతా పార్టీ అధికారంలో ఉన్న అన్ని రాష్ట్రాల్లోనూ మహిళలు ధైర్యంగా ఉన్నారని, మే 5 తర్వాత బెంగాలీ మహిళల పరిస్థితి కూడా మెరుగుపడుతుందని అన్నారు. తల్లులు, సోదరీమణుల వైపు దురుద్దేశంతో చూసేందుకు ఏ దుండగుడు సాహసించినా, వారిని జైలులో పెడతామని భారతీయ జనతా పార్టీ హామీ ఇస్తుందన్నారు. గత పదిహేను సంవత్సరాల మమతా బెనర్జీ పాలనలో, అత్యధికంగా నష్టపోయిన వారు మన తల్లులు, సోదరీమణులే. బెంగాల్‌లో మహిళలపై ఎన్నో హింసాత్మక ఘటనల జరిగాయి. మహిళలు రాత్రి 7 గంటల తర్వాత ఇళ్ల నుంచి బయటకు రాకూడదని దీదీ అంటున్నారు. నేను మీకు చెప్పేదేమిటంటే.. 5వ తేదీ తర్వాత, యువతులు రాత్రి 1 గంట తర్వాత కూడా బయటకు రాగలరు. ఏ దుండగుడూ ఆమె వైపు చూడటానికి కూడా సాహసించదని అమిత్ షా హామీనిచ్చారు.

# లిక్కర్ కేసులో సిట్ ముమ్మర దర్యాప్తు

సిట్ ఎస్పీ మీడియాతో మాట్లాడారు. ఏపీ లిక్కర్ స్కామ్‌లో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావుని విచారించామని తెలిపారు. ఆయన వయసు 60 సంవత్సరాలు పైనే ఉండటంతో చట్టప్రకారం ఆయన కోరిన చోటే విచారించామని వెల్లడించారు. ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో ఆయన స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేశామని సిట్ ఎస్పీ చెప్పుకొచ్చారు. విచారణకు ఆయన సహకరించారని.. అవసరమైతే మరోసారి విచారిస్తామని తెలిపారు. మద్యం రవాణా, టెండర్లు సబ్ కాంట్రాక్టుల అవకతవకల విషయంలో కారుమూరిపై, ఆయన కుమారుడిపై కేసు నమోదైందని చెప్పారు. మద్యం రవాణా ద్వారా ప్రభుత్వ ఆదాయానికి రూ.200 నుంచి రూ. 250 కోట్ల వరకు గండి కొట్టినట్లు ఆయనపై ఆరోపణలు ఉన్నాయని అన్నారు. కారుమూరి కుమారుడు సునీల్‌ను సిట్ కార్యాలయంలోనే విచారిస్తామని స్పష్టం చేశారు. కోర్టు ఆదేశాల ప్రకారం సిట్ ముందు ఆయన కుమారుడు విచారణకు హాజరు కావాలని సూచించారు. అనారోగ్య కారణాలతో సునీల్ సమయం కోరారని.. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని సిట్ ఎస్పీ పేర్కొన్నారు.

# కవితవి పిట్టల దొరసాని మాటలు..

కల్వకుంట్ల కవిత తన సొంత రాజకీయ పార్టీని ఈరోజు ప్రారంభించిన సంగతి తెలిసిందే. తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్) పేరుతో ఆమె పార్టీని ప్రకటించారు. కవిత పార్టీపై నిజామాబాద్ బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. బీజేపీపై ఆమె చేసిన విమర్శలకు కౌంటర్ ఇచ్చారు. 'పిట్టల దొరసాని' అంటూ కవితను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. గతంలో పిట్టల దొరను చూశారని, ఇప్పుడు కొత్త పార్టీ పేరుతో వస్తున్న 'పిట్టల దొరసాని'ని ప్రజలు చూస్తున్నారని ఎద్దేవా చేశారు. హైదరాబాద్ లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.నిజామాబాద్ గడ్డపైనే కవితకు బీజేపీ రాజకీయ సమాధి కట్టిందని అర్వింద్ గుర్తు చేశారు. ఇప్పుడు కొత్త పార్టీ పెట్టినా ఆమెకు పుట్టగతులు ఉండవని వ్యాఖ్యానించారు. బీజేపీ మద్దతు లేకుండానే తెలంగాణ వచ్చిందా? అని కవితను ప్రశ్నించారు. విభజన ప్రక్రియను బీఆర్ఎస్ నేతలు సరిగ్గా నిర్వహించక పోవడం వల్లే అనేక మంది బలిదానాలు జరిగాయని ఆరోపించారు. ఇదే విషయాన్ని ఎంపీ తేజస్వి సూర్య పార్లమెంటులో కూడా ప్రస్తావించారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ పాలనలో సామాజిక తెలంగాణ రాలేదు కాబట్టే ప్రజలు ఆ పార్టీని తిరస్కరించి బీజేపీని గెలిపించారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఇక, మాజీ క్రికెటర్ అజారుద్దీన్ అదృష్టం బాగుందని, అందుకే ఆయన మంత్రి, ఎమ్మెల్సీ కాగలిగారని అర్వింద్ పేర్కొన్నారు. గవర్నర్ కోటాలో ఆయనకు లబ్ధి చేకూరిందని అన్నారు.

# సిఎం రేవంత్‌తో పోలీస్ అధికారుల భేటీ

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఐసీసీసీలో సీనియర్ పోలీస్ అధికారులు మర్యాదపూర్వకంగా కలిసారు. డీజీపీ ర్యాంక్ ప్రమోషన్ పొందిన సీనియర్ ఐపీఎస్ అధికారులు వి.వి. శ్రీనివాసరావు, స్వాతి లక్రా, మహేష్ భాగవత్, చారు సిన్హా, డా. అనిల్ కుమార్, వి.సి. సజ్జనార్ లు కలిసి అభినందనలు తెలిపారు. ప్రభుత్వం వీరికి డిజిలుగా ప్రమోషన్లు ఇచ్చింది. దీంతో వీరు సిఎం కలిసారు.

## సంస్కరణలకు ముందు..తరవాత దేశాన్ని అధ్యయనం చేశా

విన్నర్ అని ప్రశంసించారు. టైమ్స్ బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు స్వీకరించడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ అవార్డు ద్వారా మరికొన్ని పెట్టుబడులు ఏపీకి వస్తాయని ఆశిస్తున్నానని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని వివరించారు. ఏపీలో అనుమతుల వేగాన్ని పారిశ్రామిక వేత్తలు గుర్తించాలని కోరారు. వివిధ రంగాల్లో పెట్టుబడులకు ఏపీలో విస్తృత అవకాశాలు ఉన్నాయని వెల్లడించారు. దేశంలో సంస్కరణలు అమలవుతున్నాయని.. ఆర్థిక వ్యవస్థ మెరుగుపడిందని తెలిపారు. ఇది పెట్టుబడులకు కూడా మెరుగైన సమయమని చెప్పుకొచ్చారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ విధానాల ద్వారా సుపరిపాలన అందిస్తున్నామని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఏఐ డాక్టర్, ఏఐ ట్యూటర్, ఏఐ అగ్రానమి లాంటి సేవలు అందిస్తున్నామని తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లు విషయంలో కేంద్రప్రభుత్వ నిర్ణయం సరైనదేనని వ్యాఖ్యానించారు. లింగ సమానత్వం, మహిళలకు సమాన అవకాశం కల్పించేందుకు తీసుకువచ్చిన బిల్లు ఇదని పేర్కొన్నారు.

# శ్రీశైలం దేవస్థానంలోస్థానిక సత్రాలవారితో సమావేశం

**క్షేత్రాన్ని సందర్శించే భక్తులకు సత్రాల నిర్వాహకులు ఇతోధిక సేవలు అందించాలి**

**వేసవి తీవ్రత కారణంగా అన్ని సత్రాలవారు చలివేంద్రాలను ఏర్పాటు చేయాలి**

**సత్ర ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలి**

**శుచీశుభ్రతలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలి**



**శ్రీశైలం ఏప్రిల్ 25(నంది పత్రిక)** కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు ప్రభుత్వం శ్రీశైలమహాక్షేత్రాన్ని తిరుమల స్థాయిలో అభివృద్ధి చేయాలనే కృతనిశ్చయంతో ఉందని కార్యనిర్వహణాధికారి శ్రీ యం. శ్రీనివాసరావు అన్నారు. ఇందుకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను దేవస్థానం దశలవారిగా కల్పించడం జరుగుతోందన్నారు. స్థానిక సత్రాల వారందరు కూడా క్షేత్రాభివృద్ధికి సహకరించాలన్నారు. ( 25.04.2026) పరిపాలనా భవనంలోని సమావేశమందిరంలో స్థానిక సత్రాల వారితో కార్యనిర్వహణాధికారివారు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కార్యనిర్వహణాధికారివారు మాట్లాడుతూ అన్ని సత్రాలవారు కూడా సేవా దృక్పథంతో భక్తులకు సేవలను అందించాలన్నారు. సహాయ సహకారాలు అందజేయడం జరుగుతుందన్నారు. ఇంకా వారు మాట్లాడుతూ వేసవి తీవ్రత కారణంగా అన్నీ సత్రాల వారు చలివేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ చలివేంద్రాలలో మంచినీటితో పాటు మజ్జిగను కూడా ఉచితంగా భక్తులకు అందించాలన్నారు. ప్రతీ సత్రం వారు కూడా శుచీశుభ్రతలకు ప్రాధాన్యమివ్వాలన్నారు. సత్ర ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచుకునేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా సత్రాలు అన్నదానం కోసం ఆయా వంటకాలు వండేటప్పుడు, అన్నదానం చేసినప్పుడు కూడా శుచీశుభ్రత ఉండేవిధంగా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వంటకాలలో తాజా కూరగాయలను వాడాలన్నారు. ఈ విషయమై సత్ర యజమాన్యాల వారు వారి సిబ్బందికి అవగాహన కల్పించాలన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా శ్రీశైలక్షేత్రాన్ని ప్లాస్టిక్ రహిత క్షేత్రంగా ప్రకటించడం జరిగిందన్నారు. ప్లాస్టిక్ నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు సత్రాలవారు కూడా సహకరించాలన్నారు. ఈ విషయమై సత్రాలలో వసతి పొందే భక్తులకు ఆయా సిబ్బంది తగు అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా స్వచ్ఛ శ్రీశైలం పట్ల దేవస్థానం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తుందన్నారు. ఈ విషయమై సత్రాల వారు కూడా తగు శ్రద్ధ కనబర్చాలన్నారు. అన్ని సత్రాలలో కూడా తగినంత మేరకు చెత్తకుండీలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. సత్రప్రాంగణాన్ని,పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తుండాలన్నారు. అదేవిధంగా తడిచెత్తను, పొడిచెత్తను వేరువేరుగా ఉంచాలన్నారు. చెత్త సేకరణకై దేవస్థానం పారిశుధ్య విభాగం వారు వచ్చినప్పుడు చెత్తను కూడా వేరు వేరుగా అనగా తడిచెత్త, పొడిచెత్తలుగా అందించాలన్నారు.

అవకాశం మేరకు సత్రాలలో కూడా ఆధ్యాత్మిక ప్రవచనాలు, పారాయణలు, భజనలు, సత్సంగాలు మొదలైన కార్యక్రమాలను ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా సత్రాలలో కూడా "ఓం నమ:శివాయ శ్రీ మాత్రే నమ: " నామ స్మరణ రికార్డింగును కూడా నిరంతరం ప్రసారం చేస్తుండాలన్నారు. దేవదాయచట్టం 30 / 1987 అనుసరించి దేవస్థానం పరిధిలో క్షేత్రపరిధికి భంగం కలిగించే ఏ విధమైన కార్యక్రమాలు కూడా చేపట్టరాదన్నారు. కావున అన్నీ సత్రాల వారు మరియు ఇతర సంస్థల వారు సత్రాలలో ఎటువంటి నిషేధిత కార్యక్రమాలను అనుమతించకూడదన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ విభాగం సహాయ కార్యనిర్వహణాధికారి సి. హెచ్. శ్రీనివాసరెడ్డి, ప్రజాసంబంధాల అధికారి టి. శ్రీనివాసరావు, రెవెన్యూ విభాగపు పర్యవేక్షకులు యం. శ్రీనివాసరావు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## మలేరియా రహిత సమాజమే మన లక్ష్యం.

**మలేరియా నియంత్రణ అధికారి అధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు.**




**బేతంచెర్ల ఏప్రిల్ 25 ( నందిపత్రిక ).** ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని,బేతంచెర్ల పట్టణ ఆరోగ్య కేంద్రం -3. వైద్యాధికారి డాక్టర్ సాయిశ్రీ ఆధ్వర్యంలో మలేరియా వ్యాధిపై ర్యాలీ మరియు అవగాహన సదస్సు శనివారం నిర్వహించడం జరిగింది. ఈ మలేరియా కార్యక్రమ ర్యాలీని, బేతంచెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి కోటపేట వీధి వరకు ర్యాలీ నిర్వహించి, మలేరియా ప్రతిజ్ఞ ను ఆశా కార్యకర్తలు మరియు ఆరోగ్య కార్యకర్తలచే ప్రతిజ్ఞ చేయించడం జరిగినది. తరువాత పట్టణ ఆరోగ్య కేంద్రం నందు అవగాహన సదస్సు నిర్వహించడం జరిగినది. ఈ సదస్సు నందు బేతంచెర్ల మలేరియా నియంత్రణ అధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దోమల వల్ల వచ్చే మలేరియా వ్యాధి ఎలా వ్యాపిస్తుంది మరియు దోమల నిర్మూలనకు తీసుకోవలసిన చర్యల గురించి అవగాహన కల్పించారు. మలేరియా రహిత సమాజమే మన లక్ష్యం అని అన్నారు.ముఖ్యంగా దోమ కాటు నుండి కాపాడుకోవడానికి ప్రజలు దోమతెరలు వాడండి- తోమకాటు నుండి రక్షణ పొందండి- దోమ పుట్టరాదు- పుడితే కుట్టరాదు. ఈ కార్యక్రమం నందు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సాయి శ్రీ, బేతంచెర్ల మలేరియా నియంత్రణ అధికారి వెంకటేశ్వర్లు, సచివాలయం ఆరోగ్య కార్యకర్తలు, హెల్త్ అసిస్టెంట్ విజయ్ కుమార్, ఆశా కార్యకర్తలు మరియు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# పసిబిడ్డకు పునర్జన్మను ప్రసాధించిన కిమ్స్ కడల్స్ వైద్యులు

**- పుట్టిన ఏడో రోజే విజయవంతంగా సర్జరీ**

**- హిర్ష్ స్ప్రంగ్ ముప్పు తొలగింపు.**




**కర్నూలు నంది పత్రిక బ్యూరో....**జన్మించిన ఏడవే రోజుకే... సర్జరీ చేసి చిన్నారి ప్రాణాలు కాపాడిన అరుదైన సంఘటన కిమ్స్ కడల్స్ కర్నూలులో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన చికిత్సనందించిన వివరాలను కన్సల్టెంట్ పీడియాట్రిక్ యూరాలజిస్ట్ డా. సాయి ప్రసూన తెలిపారు. తెలంగాణ రాష్ట్రం గద్వాల జిల్లాకు చెందిన ఓ జంటకు జన్మించిన శిశువు పుట్టి రెండు రోజులు గడిచినా మల విసర్జన జరగకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. దీంతో వారు కిమ్స్ కడల్స్ కర్నూలుకి తీసుకవచ్చారు. శిశువును పరిశీలించిన తర్వాత బిడ్డ 'హిర్ష్‌స్ప్రింగ్ వ్యాధి'తో బాధపడుతున్నట్లు గుర్తించారు. హిర్ష్‌స్ప్రంగ్ వ్యాధి అంటే మన పేగుల్లో మలాన్ని ముందుకు నెట్టడానికి ప్రత్యేక నరాల కణాలు ఉంటాయి. ఈ వ్యాధితో పుట్టిన పిల్లల్లో పేగు చివరి భాగంలో ఈ నరాలు ఉండవు. దీనివల్ల ఆ భాగం సంకోచించకపోవడంతో మలం ముందుకు కదలదు. ఫలితంగా పేగులు ఉబ్బిపోవడం, ఇన్ఫెక్షన్ ఏర్పడే ప్రమాదం ఉంటుంది. ఈ బిడ్డ విషయంలో గంటలు గడుస్తున్నా విసర్జన జరగలేదు. రెండో రోజు నాటికి పొట్ట ఉబ్బిపోవడం, ఆకుపచ్చ రంగులో వాంతులు రావడం మొదలయ్యాయి. "శిశువు పుట్టిన తర్వాత మొదటి 48 గంటలు అత్యంత కీలకం. ఆ సమయంలో మల విసర్జన జరగకపోవడాన్ని మేము 'సర్జికల్ సైరన్'గా భావిస్తాం," అని తెలిపారు. శిశువు జన్మించిన ఏడవ రోజుకే సర్జరీ చేసి చిన్నారికి ఊరట కల్పించాం. గతంలో ఈ సమస్యకు రెండు దశల్లో శస్త్రచికిత్స చేసేవారు. ముందుగా పొట్టపై కోత పెట్టి మలం బయటకు రావడానికి కొలోస్టమీ సంచి ఏర్పాటు చేసి, తర్వాత మరోసారి శస్త్రచికిత్స చేసేవారు. అయితే కిమ్స్ కడల్స్ వైద్య బృందం ఆధునిక ట్రాన్స్‌అనల్ ఎండోరెక్టల్ పుల్-త్రూ విధానంతో శస్త్రచికిత్స నిర్వహించింది. ఈ విధానంలో ఎటువంటి కోతలు లేకుండా మలద్వారం ద్వారానే ఆపరేషన్ చేశారు. ఈ విధానం వల్ల కొలోస్టమీ సంచి అవసరం లేకుండా ఒకే దశలో సమస్యను పరిష్కరించగలిగాం. బిడ్డకు మచ్చలు లేకుండా సురక్షితమైన చికిత్స అందుతుంది," అని డాక్టర్ సాయి ప్రసూన తెలిపారు. చాలా మంది తల్లిదండ్రులు పిల్లల్లో మలబద్ధకాన్ని చిన్న సమస్యగా భావించి విరోచన మందులు వేస్తుంటారు. దీనిని 'హ్యాబిచ్యువల్ కాన్స్టిపేషన్' అంటారు. కానీ హిర్ష్‌స్ప్రంగ్ వ్యాధి ఉంటే మందులు పనిచేయవు. గుర్తించకుండా వదిలేస్తే 'ఎంటెరోకోలిటిస్' అనే తీవ్రమైన పేగుల ఇన్ఫెక్షన్‌కు దారితీసి ప్రాణాలకు ముప్పుగా మారవచ్చు. పాలు తాగడానికి నిరాకరించడం, ఆకుపచ్చ రంగులో వాంతులు రావడం, పొట్ట గట్టిగా ఉబ్బిపోవడం, మందులు వాడినా మల విసర్జన జరగకపోవడం వంటివి గుర్తిస్తే వెంటనే ఆస్పత్రికి తీసువెళ్లి వైద్యులకు చూపించాలని సూచించారు.

## రంగాపురంలో ప్రపంచ మలేరియా దినోత్సవం- ర్యాలీ - ప్రతిజ్ఞ.



**బేతంచెర్ల ఏప్రిల్ 25 ( నందిపత్రిక ).** బేతంచెర్ల మండలం ఆర్.ఎస్. రంగాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు డాక్టర్ అబ్దుల్ అలీం, డాక్టర్ ముర్తుజావలి అధ్యర్యంలో ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించడం జరిగింది, మలేరియా రహిత సమాజం కొరకు అందరూ కృషిచేయాలి.ప్రతి శుక్రవారం డ్రైడే పాటించటం వలన, దోమలు పుట్టకుండ మరియు దోమలు కుట్టకుండా ఉండుటవలన మలేరియా, డెంగ్యూ,చికెన్ గన్య బోధకాలు, మెదడు వాపు వ్యాధులను నివారించవచ్చు. ఇంట్లో మరియు ఇంటి పరిసరాలు వారం పై బడి, నీటి నిలువ లేకుండా చేయాలి. మలేరియా రాకుండా దోమతేరాలు,వేపాకు పొగ మరియు దోమలు నియంత్రణ చేయు పరికరాలు వాడాలి. ఈ కార్యక్రమంలో సూపెర్వైసర్ రాజ్యలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ రామాంజనేయులు, బాబు,ఫార్మసిస్ట్ ఇక్బాల్, టెక్నాషియన్ సర్వేష్ ఏఎన్ఎం సుగుణ, ఆశా కార్యకర్తలు పుష్పావతి నాగేంద్రమ్మతదితర ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## దేశభక్తి పుస్తకాలు గ్రంధాలయంకు అందజేత



**నంద్యాల ప్రతినిధి. ఏప్రిల్ 25 . (నంది పత్రిక ):**పింగళి సూరన స్మారక శాఖా గ్రంధాలయం,(పద్మావతి నగర్) నంద్యాలకు చెందిన సీనియర్ ఫోటోగ్రాఫర్ చింతల పల్లె వాసు దేశభక్తికి సంబంధించిన పుస్తకాలను ఇంచార్జి గ్రంథాలయ అధికారి మధుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మధు మాట్లాడుతూ ఈ రకంగా ప్రతి ఒక్కరు తమ దగ్గర ఉన్నవిలువైన పుస్తకములు అందజేయాలని కోరారు.

## మలేరియా అంతం -మనతోనే సాధ్యం.

**తొట్టిగారిపల్లె వైద్యాధికారి రాజేష్ కుమార్.**



**బద్వేల్, ఏప్రిల్ 25 (నంది పత్రిక ):**మలేరియా అంతం మనతోనే సాధ్యమని తొట్టిగారి పల్లె వైద్యాధికారి రాజేష్ కుమార్ అన్నారు. బద్వేల్ మండలంలోని, తొట్టిగారి పల్లెలో, శనివారం ఉదయం ప్రపంచ మలేరియా దినోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది మలేరియా అంతం మనతోనే సాధ్యమని, బ్యానర్ చేతపట్టి, పలు వీధులలో ర్యాలీ నిర్వహించారు. లార్వాదశలోనే దోమలను అరికట్టాలని, దోమల నివారణకు దోమతెరలే శ్రేయస్కరమని, పరిసరాలను శుభ్రంగా పెట్టుకోవాలంటూ, నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ దోమ ద్వారానే చికెన్ గున్యా, మలేరియా, డెంగ్యూ, మెదడువాపు వ్యాధి, బోధకాలు పలు రకాల వ్యాధులు వస్తాయన్నారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి బ్రహ్మాజీ మాట్లాడుతూ, సిబ్బందిచే తాము ఇంటింటి లార్వా, ఫీవర్ సర్వే నిర్వహిస్తున్నామన్నారు. లార్వా ఉన్నచోట నీటిని పడవేస్తున్నామన్నారు .డ్రైనేజీ కాలువలో, నిల్వ ఉన్న నీరు, తడి ప్రదేశాలలో అబేట్ , ఆయిల్ బాల్స్, బ్లీచింగ్ పౌడర్ ను చల్లిస్తున్నామన్నారు. అవసరమైన చోట మెడికల్ క్యాంపులను నిర్వహిస్తున్నామన్నారు. 104, విలేజ్ హెల్త్ క్లినిక్ లలో ప్రజల వద్దకే వైద్యం అందుతుందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో మందులు సమృద్ధిగా ఉన్నాయన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ చంద్రావతి ,హెల్త్ అసిస్టెంట్లు వీరి జనార్ధన్ రావు, శ్రీరామయ్య, వెంకటసుబ్బయ్య, వైద్య సిబ్బంది మహేంద్ర, సుబ్బరాయుడు, ఈశ్వరమ్మ, ఏఎన్ఎం ,ఆశాలు పాల్గొన్నారు.

## విద్యార్థులు అన్ని రంగంలో నైపుణ్యాలు పెంపొందించుకోవాలి




**నంద్యాల ప్రతినిధి. ఏప్రిల్ 25 . (నంది పత్రిక ):**నంద్యాల లోని శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాల ఆటోనమస్ లో ఫ్రమ్ డాట ఇంటెలిజెన్స్ ది కోర్ ఆఫ్ ఎఐ అండ్ మెషిన్ లెర్నింగ్" అనే అంశంపై ఒక రోజు సెమినార్ విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని కళాశాల బేసిక్ సైన్సెస్ విభాగం ఆధ్వర్యంలో ఎస్ఆర్ఈసి ఐఈఈఈ స్టూడెంట్ బ్రాంచ్ సహకారంతో నిర్వహించారు. ఈ సెమినార్‌కు ప్రధాన వక్తగా డా. ఎ.పి. శివకుమార్, ప్రొఫెసర్, కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, అనంతపురం పాల్గొన్నారు. తన ప్రసంగంలో డా. శివకుమార్ డేటా నుండి ఇంటెలిజెన్స్ వరకు జరిగే ప్రక్రియ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మరియు మెషిన్ లెర్నింగ్ యొక్క ప్రాముఖ్యత, ప్రస్తుత మరియు భవిష్యత్ అవకాశాల గురించి వివరంగా చర్చించారు. విద్యార్థులు ఈ రంగంలో నైపుణ్యాలు పెంపొందించుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం.వి. సుబ్రహ్మణ్యం విద్యార్థులు ఇలాంటి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రోత్సహించారు. అలాగే కెరీర్ డెవలప్మెంట్ సెల్ డీన్ డా. దేవిడ్ సుకీర్తి కుమార్ విద్యార్థుల కెరీర్ అభివృద్ధికి ఈ తరహా సెమినార్లు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన విద్యార్థులు, అధ్యాపకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సెమినార్ విద్యార్థులకు విజ్ఞానాన్ని పెంపొందించడంలో ఎంతో ఉపయోగకరంగా నిలిచింది. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులకు కళాశాల యాజమాన్యం అభినందనలు తెలిపింది.



## మలేరియా రహిత నగరంగా మార్చుదాం

**నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు**



**కర్నూలు నంది పత్రిక బ్యూరో......** వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతో నగరాన్ని మలేరియా రహితంగా మార్చుదామని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు పిలుపునిచ్చారు. శనివారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా డాక్టర్స్ కాలనీలో నిర్వహించిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నిల్వ ఉన్న స్వచ్ఛమైన నీటిలో మలేరియాను వ్యాప్తి చేసే ఆడ ఎనోఫిలిస్ దోమలు పెరుగుతాయని ఆయన తెలిపారు. దోమల కాటుకు గురికాకుండా ఉండేందుకు గృహాలలో కిటికీలు, గుమ్మాలకు దోమల జాలీలు అమర్చుకోవాలని సూచించారు. అంతకుముందు కమిషనర్ పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనులను అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం. రఘు, సీనియర్ ఎంటమాలజిస్ట్ వెంకటేశ్వర్లు, శానిటేషన్ ఇన్స్పెక్టర్లు హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



## జల ధార పనులు చురుగ్గా సాగుతున్నాయి: ఎంపీడీవో నూర్జహాన్ బేగం



**ఆళ్లగడ్డ ప్రతినిధి ఏప్రిల్ 25 నంది పత్రిక** ఆళ్లగడ్డ మండలం ఆర్ కృష్ణాపురం, కోట కందుకూరు గ్రామాలలో జలధార జల హారతి పథకాల పనులను శనివారం ఆళ్లగడ్డ ఎంపీడీవో నూర్జహాన్ తనిఖీ చేశారు. కోట కందుకూరు చెరువు , రామతీర్థం లో ఉన్న పురాతన కోనేరు ను ఆమె పరిశీలించారు. మండలంలో జలధార పనులు చురుకుగా సాగుతున్నట్లు ఎంపీడీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు

నంది పత్రిక
ఆదివారం 26 - 04 -2026

# కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ని మర్యాదపూర్వకంగా కలిసిన నూతన సివిల్ జడ్జి మహమ్మద్ అజామ్.

### జ్యుడీషియల్ సర్వీసెస్‌లో విజయం సాధించిన అజామ్‌కు ఎస్పీ అభినందన.

**కర్నూలు నంది పత్రిక బ్యూరో....**ఇటీవల వెలువడిన ఆంధ్రప్రదేశ్ జ్యుడీషియల్ సర్వీసెస్ ఫలితాలలో జూనియర్ సివిల్ జడ్జి గా ఎంపికైన మహమ్మద్ అజామ్ శనివారం కర్నూలు జిల్లా పోలీసు కార్యాలయంలో కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ మహమ్మద్ అజామ్‌ను అభినందిస్తూ, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కృషి, పట్టుదలతో సాధించిన ఈ విజయాన్ని ప్రశంసిస్తూ, న్యాయవ్యవస్థలో ప్రజలకు న్యాయం అందించే దిశగా సేవలు అందించాలని సూచించారు. తండ్రి పోలీస్



శాఖలో సేవలందిస్తుండగా, కుమారుడు న్యాయవ్యవస్థలో ప్రతిష్టాత్మక స్థానం పొందడం గర్వకారణమని ఎస్పీ గారు కొనియాడారు. ఇది సమాజానికి ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. మహమ్మద్ అజామ్ నేపథ్యం. కర్నూలు రూరల్ మండలం బి. తాండ్రపాడు గ్రామానికి చెందిన మహమ్మద్ అజామ్, కర్నూలు జోనల్ ఇంటెలిజెన్స్ కార్యాలయంలో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న అల్లాబకాష్, షేకూన్ దంపతుల కుమారుడు.

**విద్యార్హతలు...**మహమ్మద్ అజామ్ తన ప్రాథమిక విద్యను కర్నూలులోనే పూర్తి చేసి, పెండేకంటి లా కాలేజీ హైదరాబాద్ లో ఎల్.ఎల్.బి దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ విశాఖ పట్టణం లో ఎల్.ఎల్.ఎమ్ పూర్తి చేశారు. 2025 నోటిఫికేషన్ లో హైకోర్టు నిర్వహించిన రాత పరీక్షలు మరియు ఇంటర్వ్యూలలో ప్రతిభ కనబరిచి, జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికై విజయాన్ని సాధించారు. జిల్లా పోలీసు అధికారులు మరియు సిబ్బంది మహమ్మద్ అజామ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రపంచ మలేరియా దినోత్సవం ఘనంగా నిర్వహణ

**వెలుగోడు, ఏప్రిల్ 25 (నంది పత్రిక):** స్టార్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, ఏపీవిహెచ్ఏ సహకారంతో ప్రపంచ మలేరియా దినోత్సవం 2026ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు సులోచన, రాహుల్ ముఖ్య అతిథులుగా పాల్గొని మలేరియా వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 2000 సంవత్సరం నుండి ప్రపంచవ్యాప్తంగా సుమారు 230 కోట్ల మలేరియా కేసులు, 14 కోట్ల మరణాలు నివారించబడినట్లు



తెలిపారు. ఇప్పటివరకు 47 దేశాలు మలేరియా రహిత దేశాలుగా గుర్తింపు పొందాయని, 2024లో 2 దేశాలు, 2025లో 3 దేశాలు ఈ జాబితాలో చేరినట్లు పేర్కొన్నారు. అలాగే 2024 నాటికి 37 దేశాలు వెయ్యి కంటే తక్కువ కేసులు నమోదు చేశాయని, పదివేల లోపు కేసులు ఉన్న దేశాల సంఖ్య 2000లో 27, 2024లో 46కు పెరిగినట్లు వివరించారు. హెల్త్ అసిస్టెంట్ పావని మాట్లాడుతూ, మలేరియా నివారణకు కొత్త టీకాలు, దీర్ఘకాలం పనిచేసే ఇంజెక్షన్లు వంటి పద్ధతులు అందుబాటులోకి వచ్చాయి. దోమల పెరుగుదలను అరికట్టేందుకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, నెక్స్ట్ జనరేషన్ దోమల నివారణ వలలను వినియోగించడం, ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించిన విధానాలను పాటించడం అవసరమని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ వై ఏ సంస్థ సిబ్బంది కె. ఖాదర్ వలీ, మెరిబ సంస్థ అధికారి జుల్ఫికర్ అలీ ఖాన్, జుబేదా వైద్య సిబ్బంది మరియు మహిళలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో రోగులకు మెరుగైన సేవలందించేందుకు వీలుగా మౌలిక వసతులను అభివృద్ధి చేసుకోవాలి





### జూన్ మొదటి వారంలో క్రిటికల్ కేర్ బ్లాక్ యూనిట్ ప్రారంభోత్సవం చేసే విధంగా చర్యలు చేపట్టండి
### ఎన్టీఆర్ వైద్య సేవ కింద లక్ష్య సాధనను 80 శాతానికి పెంచాలి.
### జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి

**కర్నూలు, నంది పత్రిక బ్యూరో....**ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో రోగులకు మెరుగైన సేవలందించేందుకు వీలుగా మౌలిక వసతులను అభివృద్ధి చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి వైద్యాధికారులను ఆదేశించారు. శనివారం కర్నూలు మెడికల్ కళాశాల మీటింగ్ హాల్ లో మెడికల్ కాలేజ్, గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ లకు సంబంధించిన వైద్య సేవలు, మౌలిక వసతుల కల్పన పై హెచ్ఓడి లతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్రిటికల్ కేర్ బ్లాక్ లో జరుగుతున్న ఆక్సిజన్ పైప్‌లైన్ నిర్మాణం, లిఫ్ట్ పనులు మే 31 వ తేది నాటికి పూర్తి చేసి, జూన్ మొదటి వారంలో ప్రారంభోత్సవం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి ఏపిఎమ్ఎస్ఐడిసి ఎస్ఈ ని ఆదేశించారు. పాథాలజీ విభాగానికి సంబంధించి ఝాణూ యంత్రం, ఇమ్యునోఫ్లోరోసెన్స్ మైక్రోస్కోప్ కొనుగోలుకు సంబంధించి ఫైల్ పంపాలని కలెక్టర్ కర్నూలు మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ ను ఆదేశించారు. విశ్రామ్ సదన్ పనుల ప్రారంభానికి సంబంధించిన భూమిపూజ పనులు వారం రోజులలో చేయాలని కలెక్టర్ జిజిహెచ్ సూపరింటెండెంట్ ను ఆదేశించారు. కమ్యూనిటీ మెడిసిన్ విభాగంలో విద్యార్థుల సంక్షేమ కార్యక్రమాలు, గ్రామీణ దత్తత కార్యక్రమాల కోసం ఒక బస్సు కావాలని మెడికల్ కాలేజీ వారు కోరడం జరిగిందని, దీనికి సంబంధించిన అంచనా వేసి వచ్చే వారం టెండర్ పిలవాలని కలెక్టర్ వైద్య అధికారులను ఆదేశించారు. విభాగంలో ఒక ప్రొఫెసర్, ఒక అసిస్టెంట్ మాత్రమే ఉన్నారని, దీనివల్ల సదరం క్యాంపులు, ౹ూ మరియు ౹ూ నిర్వహించడం చాలా కష్టం అవుతున్న తరుణంలో ఒక అసోసియేట్ ప్రొఫెసర్‌కు ప్రమోషన్ ఇచ్చారని, అదే విధంగా కర్నూలు మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ చొరవ తీసుకొని ఒక రిటైర్డ్ ప్రొఫెసర్‌ను కాంట్రాక్ట్ ప్రాతిపదికన నియమించడం పట్ల కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు... క్లినికల్ లెక్చర్ గ్యాలరీ, బ్లాక్ పనులు పూర్తి చేయడానికి సంబంధించి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఏపిఎమ్ఎస్ఐడిసి ఎస్ఈ ని ఆదేశించారు. ఎక్కడా కూడా డాక్టర్లు లేరనే మాట రాకూడదని, రోగులకు ఎటువంటి ఇబ్బందులు కలిగించకూడదన్నారు. 3 వ వార్డులో కిటికీలకు మెష్ లు లేకపోవడంతో కోతులు వస్తున్నాయని ఫిర్యాదులు వస్తున్నాయని, వెంటనే మెష్‌లు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఏపిఎమ్ఎస్ఐడిసి అధికారులను ఆదేశించారు. యూరాలజీ ఆపరేషన్ థియేటర్ ఆధునీకరణ పనులు పూర్తయ్యాయని, 'యురెట్రోస్కోప్స్' కావాలని అడిగారనీ, వాటికి సంబంధించిన కొటేషన్లు మరియు ఫైల్‌ను సిద్ధం చేసి పంపాలన్నారు. పిడియాట్రిక్ సర్జరీ కి కావాల్సిన సిస్టోస్కోప్స్ , లాపరోస్కోప్స్ ఇప్పటికే కొనుగోలు చేసి అందించామన్నారు. కింద 40 వెంటిలేటర్లు, అల్ట్రాసౌండ్ మెషిన్లు వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని, ఇంకా ఏమైనా పరికరాలు కావాలంటే వివరాలు ఇవ్వాలని కలెక్టర్ జిజిహెచ్ సూపరింటెండెంట్ ను ఆదేశించారు. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో వాష్ రూమ్ ల మరమ్మతులు ఇప్పటికీ పూర్తి కాలేదని, ఈ పనులు త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వైద్య అధికారులను ఆదేశించారు. టాయిలెట్ల మరమ్మతులకు సంబంధించి ప్రతిరోజూ ఫోటోలు పంపాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మానసిక వైద్యం, వ్యసన విముక్తి కు సంబంధించిన నియామక ప్రక్రియ మెరిట్ వివరాలను వారం రోజుల్లో అందచేసి నియామక ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ జి జి హెచ్ ఏఓ ను ఆదేశించారు. మ్యాన్ హోల్ క్లీనింగ్ మిషన్ల కొనుగోలు కోసం 30 లక్షల రూపాయల ప్రతిపాదనలు సిద్ధం చేసి సి పి ఓ కు పంపాలని కలెక్టర్ ఆదేశించారు. డెర్మటాలజీ వార్డు కు సంబంధించి వెనుక ఉన్న భవనం కూడా సరి చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్టీఆర్ వైద్య సేవ కింద సేవలను మరింత పెంచాలని, లక్ష్య సాధనను 80 శాతానికి పెంచాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అనంతరం వివిధ డిపార్ట్మెంట్లకు సంబంధించిన పీజీ విద్యార్థులు వారికి డిపార్ట్మెంట్ పరంగా కావలసిన పరికరాలు, సదుపాయాలను కలెక్టర్ దృష్టికి తీసుకొని రాగా వాటిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.. అనంతరం స్థానిక ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో మెడికల్ కళాశాల విద్యార్థినుల హాస్టళ్లను కలెక్టర్ తనిఖీ చేస్తూ, మున్సిపల్ కమిషనర్ తో మాట్లాడి హాస్టల్ ఎదురుగా ప్లాంటేషన్ చేయించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వైద్యాధికారులను ఆదేశించారు. హాస్టల్ భవనాల మీద మొలిచిన పిచ్చి మొక్కలను తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కొన్ని హాస్టల్ లలో మున్సిపల్ వాటర్ కనెక్షన్ లేవని గమనించిన కలెక్టర్ వెంటనే మున్సిపల్ వాటర్ కనెక్షన్ ఇప్పించే విధంగా చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులను ఆదేశించారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా వసతులు కల్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిజిహెచ్ సూపరింటెండెంట్ డా.వెంకటేశ్వర్లు, కర్నూల్ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డా. చిట్టి నర్సమ్మ, జిజిహెచ్ ఏవో సింధు సుబ్రహ్మణ్యం, ఏపీఎమ్మెస్ ఐడిసి ఎస్ఈ ఇంద్ర తదితరులు పాల్గొన్నారు.

# కిశోర బాలబాలికల సమగ్ర అభివృద్ధి పై ప్రత్యేక దృష్టి సారించాలి

### జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి




**కర్నూలు, నంది పత్రిక బ్యూరో....**కిశోర బాలబాలికల సమగ్ర అభివృద్ధి పై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో కర్నూలు, నంద్యాల, అనంతపురం, పుట్టపర్తి జిల్లాలకు చెందిన సి.డి.పి.ఓలు, కోఆర్డినేటర్ ల తో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కిషోర్ వికాసం 2026 వేసవి సెలవుల కార్యక్రమాలు అన్న అంశంపై ప్రాంతీయ వర్క్‌షాప్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... కిశోర బాలబాలికల సమగ్ర అభివృద్ధి మనందరి బాధ్యత అన్నారు. కిశోర బాలబాలికల హక్కులు, సాధికారత, ఆరోగ్య పరిరక్షణ, పోషకాహార ప్రాధాన్యం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి బాలికకు అనీమియా పరీక్షలు నిర్వహించడం, ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించడం, అవసరమైన వైద్య సేవలను అందించడం ముఖ్యమని సూచించారు. కర్నూలు జిల్లాలో ముఖ్యంగా తల్లిదండ్రులు వలస వెళ్లడం వల్ల విద్యార్థుల చదువు ఆగిపోతూ ఉన్నదన్నారు. ఈ పరిస్థితిని నివారించడానికి 70 సీజనల్ హాస్టల్స్ పెట్టి దాదాపు నాలుగు వేల మందిని అందులో చేర్చుకొని, వారి చదువు ఆగిపోకుండా చూశామని తెలిపారు. జిల్లాలో పదివేల మంది విద్యార్థులు డ్రాపవుట్స్ గా ఉంటే, 7000 మందిని తిరిగి పాఠశాలలలో చేర్పించామని తెలిపారు. జిల్లాలో నిరక్షరాస్యత, ఇతర కారణాల వల్ల బాల్య వివాహాలు జరగడం తద్వారా టీనేజ్ ప్రెగ్నెన్సీలు జరుగుతున్నాయన్నారు. వీటిని అరికట్టడానికి చాలా ప్రయత్నాలు చేస్తూ ఉన్నామని తెలిపారు. గ్రామ పోలీస్ , గ్రామ పెద్దల, అధికారుల సహకారంతో బాల్యవివాహాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కళాజాత బృందాల ద్వారా అవగాహన కల్పిస్తున్నామన్నారు. పిల్లలకు గుడ్, బాడ్ టచ్ పై, రుతుక్రమంపై పూర్తి అవగాహన ఆడపిల్లలకు కలిగించాలని తెలిపారు. అందరికీ సెక్స్ ఎడ్యుకేషన్ పై పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గర్భవతులు లైంగిక ఆరోగ్య పరిరక్షణ అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. అంతకు ముందు సమావేశంలో భాగంగా ప్రతి జిల్లాలో విజయవంతంగా అమలు చేసిన కార్యక్రమాలు మరియు ఎదురైన సమస్యలను అధికారులు పంచుకొని పరస్పర అవగాహన పెంపొందించుకున్నారు. ముఖ్యంగా చదువు మానేసిన బాలికలను తిరిగి విద్యలో చేర్పించడం, బాల్య వివాహాలను అడ్డుకోవడం, విద్య ప్రాధాన్యతపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం వంటి చర్యలు ప్రశంసనీయమని తెలిపారు. ఇతర రాష్ట్రాల నుండి వలస వచ్చిన కుటుంబాల పిల్లలను గుర్తించి, వారి విద్య ఆగిపోకుండా చర్యలు తీసుకోవడం, డ్రాప్‌అవుట్స్‌ను తగ్గించడం, పదవ తరగతి పరీక్షలకు ప్రోత్సహించడం, వృత్తి ఆధారిత కోర్సుల్లో చేర్పించి నైపుణ్య శిక్షణ అందించడం ద్వారా వారికి ఉపాధి అవకాశాలు కల్పించడం జరిగిందని అధికారులు వివరించారు. అదనంగా, వైద్య శాఖ ఆధ్వర్యంలో లైంగిక విద్య , యవ్వన దశలో వచ్చే శారీరక-మానసిక మార్పులు, టీనేజ్ గర్భధారణ వల్ల కలిగే ప్రమాదాలు, బాల్య వివాహాల దుష్పరిణామాలు వంటి అంశాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే బాలబాలికలకు సైకాలజికల్ కౌన్సిలింగ్ అవసరం, సోషల్ మీడియా ప్రభావం వంటి అంశాలపై కూడా చర్చించారు. కిశోర దశలో ఉన్న బాలబాలికల సమగ్ర అభివృద్ధి కోసం ప్రభుత్వంతో పాటు సమాజం మొత్తం కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని, వారి భవిష్యత్తు బలోపేతానికి సమిష్టిగా కృషి చేయవలసిన అవసరం ఉన్నది అని నిశ్చయించుకున్నారు . ఈ సమావేశానికి రీజనల్ జాయింట్ డైరెక్టర్ రోహిణి యునెసెఫ్ కౌన్సిలర్లు మురళీకృష్ణ , మేరీ జోన్స్ , మహిళా పోలీస్ డిఎస్పీ మహేంద్ర , డాక్టర్ మల్లికార్జున, ఐసిడిఎస్ పిడిలు కర్నూలు విజయ , నంద్యాల లీలావతి , అనంతపురం శశికళ , నాలుగు జిల్లాల సిడిపిఓలు, కోఆర్డినేటర్లు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# మహిళల కళ్లల్లో కన్నీటి ధారలు, వ్యధలు

### మద్యం మత్తులో సంసారాలు గుల్ల

**బండి ఆత్మకూరు నంది పత్రిక ఏప్రిల్ 26:** మద్యపానం.. పేద మధ్య తరగతికి చెందిన కుటుంబాలలో చిచ్చు రేపుతోంది. మద్యం మత్తులో పడి మధ్య తరగతికి చెందిన కుటుంబాల సంసారాలు గుల్ల అయిపోతున్నాయి. మద్యం మత్తులో మునిగిపోతూ విచక్షణ జ్ఞానాన్ని కోల్పోతున్న వ్యక్తులు కుటుంబాలలో ఘర్షణ వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. మొదట్లో సరదాగా మందు మొదలుపెట్టిన మందుబాబులు, తర్వాత దానినే వ్యసనంగా మార్చుకొని ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటున్నారు. సామాన్య కుటుంబాలకు చెందిన వ్యక్తులు చాలా మటుకు నేడు మద్య మత్తులో పడి తూలుతున్నారు. పూట గడవని స్థితిలో రెక్కలు ముక్కలు చేసుకుంటున్న వ్యక్తులు వచ్చిన కూలి సొమ్మును సాయంత్రం వేళకు సారా సీసాలకే తగలేస్తున్నారు. చేసిన కష్టమంతా సారా సీసాలకే తగలేస్తూ ఉండటంతో వీరినే నమ్ముకొని బ్రతుకుతున్న చాలా కుటుంబాలు పస్తులతోనే పొద్దు పు చ్చుకుంటున్నారు. పీకలగదాకా తాగి ఇంటికి చేరుకుంటున్న వ్యక్తులు ఇళ్లలో ఘర్షణ వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. ఈ విషయాన్ని ఇంటా బయట చెప్పుకోలేక చాలామంది పేద కుటుంబాలకు చెందిన మహిళలు మానసికంగా కృంగిపోతున్నారు. అతిగా మద్యం సేవిస్తూ ఉండటంవల్ల సమాజంలో తమ పరువు ప్రతిష్టలను కోల్పోతున్నారు. వ్యసనాలకు గురైన వ్యక్తులు అనారోగ్యానికి గురైన నేపథ్యంలో ఆసుపత్రులకు వెళ్లేందుకు చేతిలో చిల్లిగవ్వ లేక, దేహీ అని ఇతరుల వద్ద చేతులు చాచే పరిస్థితులు నెలకొంటూ ఉన్నాయి. గ్రామాలలో విచ్చలవిడిగా బెల్ట్ షాపుల నిర్వహణ యదేచ్ఛగా కొనసాగుతూ ఉండటంతో మద్యం బాబులకు ఆడిందే ఆటగా పాడిందే పాటగా మారుతుంది. నిత్యం మద్యం మందులో తూలుతున్న యువకులు గ్రామాలలో ఘర్షణ వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. చిన్న చిన్న విషయాలకి ఘర్షణపడి మందుబాబులు హత్యలు చేసే హీ నస్థితికి దిగజారుతున్నారు. ఇందుకు ఉదాహరణగా బండి ఆత్మకూరులో వారం రోజుల క్రితం కరిముల్లా అనే యువకుడికి అతిగా మద్యం తాగించి కొందరు వ్యక్తులు అతిగా



మద్యం సేవించి నంద్యాల కు సమీపంలోని కొత్తపల్లి మెట్ట వద్ద దారుణంగా హత్య చేసిన సంఘటన ఇందుకు సాక్షిభూతంగా నిలుస్తోంది. మద్యం మత్తులో పడి అతిగా వాహనాలను నడపడం వల్ల ఎన్నో రోడ్డు ప్రమాదాలు జరిగే పరిస్థితులు నెలకొంటూ ఉన్నాయి.. బెల్ట్ షాపులను నిర్మూలించే విషయంలో అధికార యంత్రాంగం చేతులు ఎత్తేస్తూ ఉండటంతో, మహిళలు వీరిపై శాపనార్థాలు పెడుతున్నారు. మందుబాబులకు అందుబాటులోనే మద్యం జరుగుతూ ఉండటంతో తెల్లవారుజామునే మద్యం సీసాలు తాగుతూ చిందులేస్తున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. మద్యపానానికి గురై నమ్ముకున్న కుటుంబాన్ని బజారుకీడిస్తున్నారు. ఇలాంటి సంఘటనను గురించి పలువురు మహిళలను కదిలిస్తే, వారి కళ్ళలో కన్నీటి ధారలు, కనిపిస్తున్నాయి, కన్నీటి వ్యధలను వినిపిస్తూ మూగగా రోధిస్తున్నారు.

**అతిగా మద్యం సేవించడం వల్ల.....** అతిగా మద్యం సేవించడం వల్ల శారీరకంగా,మానసికంగా అనేక తీవ్రమైన అనర్థాలు కలుగుతాయి. కాలేయం దెబ్బతినడం లాంటి అనర్థాలు ఏర్పడతాయి. లివర్ సిరోసిస్, ఫ్యాటీ లివర్, హైపర్టీస్ కు దారితీసి చివరకు కాలేయం పనిచేయకుండా పరిస్థితులు ఏర్పడతాయి. అధిక రక్తపోటు, గుండెపోటు,పక్షవాతం క్రమ రహిత హృదయ స్పందన వంటి సమస్యలు వస్తాయి. అతిగా మందు తాగడం వల్ల నోరు, గొంతు, అన్నవాహిక కాలేయం, ప్రాంక్రియాసిస్ తోపాటు రొమ్ము క్యాన్సర్ వచ్చేందుకు అవకాశాలు ఏర్పడతాయి. మతిమరుపు, ఏకాగ్రత లోపించడం వల్ల నరాల బలహీనత, చేతులు పాదాల్లో తిమ్మిర్లు రావడం జరుగుతుంది . పురుషుల్లో టెస్టో స్టెరాన్ స్థాయిలను తగ్గించడం,వీర్యకణాల నాణ్యతను తగ్గించి నపుంసకత్వానికి దారి చేసే పరిస్థితులు ఏర్పడతాయి. శరీరం వ్యాధులకు లోన అయ్యే అవకాశం పెరుగుతుంది.

**మద్యం మానేయడం ఎలా?** మద్యం మానేయడానికి మదిలో బలమైన సంకల్పం ఏర్పరుచుకోవాలి. ఇందుకు ప్రత్యేక ప్రణాళికతో పాటు కుటుంబం మద్దతు కూడా ఎంతో అవసరం ఉంటుంది. వైద్యులను సంప్రదించి క్రమంగా మద్యం తగ్గించడం, ఆల్కహాల్ లేని పానీయాలను ఎంచుకోవడం చేసుకోవాలి. ఖాళీ సమయాన్ని వ్యాయామం యోగ లేదా అభివృద్ధితో నింపడం ద్వారా అలవాట్లను వదిలించుకోవచ్చు. మద్యం మానేయడం వల్ల లీవ్ ఆరోగ్యం త్వరగా మెరుగుపడుతుంది. బ్రెయిన్ బాగా పనిచేస్తుంది నిద్రలో నాణ్యత పెరుగుతుంది. ఎనర్జీ లెవెల్స్ పెరుగుతాయి. రోగ నిరోధక శక్తి పెరిగి ఇన్ఫెక్షన్లు, జబ్బులు తగ్గుముఖం పడతాయి. జీవితాన్ని కంట్రోల్లో ఉంచుకోవడం చేసుకోగలుగుతారు. మద్యం మానేయడం వల్ల మీ కుటుంబంలోనే కాక సమాజంలోనూ అందరి వద్ద గౌరవాన్ని పొందగలుగుతారు.



# వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా పెట్రోల్, డీజల్ ను సరఫరా చేయాలి

### జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్

**కర్నూలు, నంది పత్రిక బ్యూరో...**వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా పెట్రోల్, డీజల్ ను సరఫరా చేయాలని జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్ పెట్రోల్ బంక్ ల యాజమాన్యాలను ఆదేశించారు. శనివారం నగరంలోని సూర్యదేవాలయం పక్కన ఉన్న హెచ్పీ పెట్రోల్ బంక్, బళ్లారి చౌరస్తాలోని నయారా పెట్రోల్ బంక్ ను జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ పెట్రోల్ బంక్ లో సరైన నిల్వలు ఉండే విధంగా చూ సుకోవాలని , వినియోగదారులకు ఇబ్బంది లేకుండా పెట్రోల్,డీజల్ సరఫరా చేయాలని యాజమాన్యాలను ఆదేశించారు. ఎలాంటి అక్రమాలు జరగకూడదని జేసీ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జేసీ వాహనదారులతో మాట్లాడారు. పెట్రోల్, డీజిల్ అవసరానికి తగినంత నిల్వ ఉందని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఓ రాజా రఘువీర్ పాల్గొన్నారు.



# మహిళల భద్రతే లక్ష్యం .

### మహిళల భద్రతపై అవగాహన పెంపొందించడమే లక్ష్యం

### నేరాల నివారణకు అవగాహన కార్యక్రమం



**కర్నూలు నంది పత్రిక బ్యూరో....** కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు సి. బెలగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మహిళలపై జరుగుతున్న నేరాలపై శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కోడుమూరు నియోజకవర్గ గౌరవ ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ...మహిళల భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.మహిళలపై జరిగే అన్యాయాలను అరికట్టడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని, ప్రభుత్వం మహిళల రక్షణ కోసం కఠిన చట్టాలు అమలు చేస్తోందని తెలిపారు. ఎవరైనా మహిళలపై నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఎంపీడీఓ ఎం. రాణెమ్మ మాట్లాడుతూ, గ్రామస్థాయిలో మహిళలకు అవగాహన కల్పించడం ఎంతో అవసరమని, మహిళలు తమ హక్కులు తెలుసుకుని ధైర్యంగా ముందుకు రావాలని సూచించారు. సి.బెళగల్ ఎంఆర్ఓ వెంకట లక్ష్మి మాట్లాడుతూ... ప్రభుత్వ సంక్షేమ పథకాలను మహిళలు వినియోగించుకోవాలని, సమస్యలు ఎదురైతే వెంటనే అధికారులను సంప్రదించాలని తెలిపారు.కోడుమూరు సీఐ తబ్రేజ్ మాట్లాడుతూ...మహిళలపై జరిగే నేరాలను అరికట్టడంలో పోలీసుల పాత్ర కీలకమని పేర్కొన్నారు.ఎవరైనా వేధింపులకు గురైతే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, పోలీస్ శాఖ ఎల్లప్పుడూ మహిళల భద్రతకు కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సి. బెలగల్ ఎస్సై వేణుగోపాల్ రాజు గారు, పోలీస్ సిబ్బంది, గ్రామ పెద్దలు, మహిళలు మరియు యువత పాల్గొన్నారు.

# తంగడంచ చెరువు అభివృద్ధికి ప్రణాళికల సిద్ధం చేస్తున్న అధికారులు... ఎస్ ఈ శివ శంకర్ రెడ్డి

### నియోజకవర్గంలో ఒక చెరువు ను జల ధార జలహారతి పథకం క్రింద అభివృద్ధి.



**జూపాడుబంగ్లా,ఏప్రిల్ :25: (నంది పత్రిక):** రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గంలోని చెరువులను జలధార జల హారతి పథకం కింద అభివృద్ధి చేసి భూగర్భ జలాలను పెంపొందించేందుకు ప్రతిపాదనను సిద్ధం చేయాలని ఆదేశించడం జరిగింది. శనివారం మండలంలోని తంగడంచ పెద్ద చెరువును జిల్లా వాటర్ రిసోర్స్ ఎస్ ఈ పి. శివ శంకర్ రెడ్డి అధికారి చెరువు ప్రాంతాన్ని సందర్శించి గ్రామ రైతులతో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు చెరువు అభివృద్ధికి భవిష్యత్తు ప్రణాళికను తయారుచేసి ప్రభుత్వనికి పంపడం జరుగుతుందన్నారు. ఈయన వెంట మైనర్ ఇరిగేషన్ ఏఈ గౌతమ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.



# పెట్రోల్, డీజిల్ కొరత లేదు

### ప్రజలు ఆందోళన చెందవద్దు

### జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి



**కర్నూలు నంది పత్రిక బ్యూరో....** జిల్లాలో పెట్రోల్, డీజిల్ సరఫరాపై కొరత లేదని, అవసరానికి తగినంత నిల్వ ఉందని, ప్రజలు ఆందోళన చెందవద్దు అని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి తెలిపారు.శనివారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో పెట్రోల్, డీజిల్ సరఫరా అంశాలపై జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్ తో కలిసి జిల్లా కలెక్టర్ ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...జిల్లాలో మొత్తం 166 పెట్రోల్ బంకులు పనిచేస్తుండగా, అవి బిపిసిఎల్, హెచ్‌పి, ఐఓసీఎల్, జియో, నయారా వంటి ప్రధాన కంపెనీలకు చెందినవని చెప్పారు. జిల్లాలో రోజువారీగా సగటున 2,36,000 లీటర్ల పెట్రోల్ వినియోగం జరుగుతుండగా, ప్రస్తుతం జిల్లాలో 7 లక్షల లీటర్ల పెట్రోల్ నిల్వ ఉందని తెలిపారు. అదనంగా ట్రాన్సిట్‌లో 6,39,000 లీటర్లు ఉండటంతో మొత్తం కలిపి 13,19,439 లీటర్ల పెట్రోల్ అందుబాటులో ఉందని వెల్లడించారు. ఈ నిల్వలతో 6 నుంచి 7 రోజుల వరకు సరఫరా కొనసాగించగలమని స్పష్టం చేశారు. డీజిల్ విషయంలో కూడా ఎటువంటి కొరత లేదని తెలిపారు. జిల్లాలో రోజుకు సగటున 3,16,848 లీటర్ల డీజిల్ సరఫరా జరుగుతుండగా, ప్రస్తుతం 5,65,000 లీటర్ల డీజిల్ నిల్వ మరియు ట్రాన్సిట్‌లో 5,06,564 లీటర్లు ఉన్నాయని చెప్పారు. మొత్తం కలిపి 11 లక్షల లీటర్ల డీజిల్ అందుబాటులో ఉండటంతో సుమారు 4 రోజుల సరఫరా నిరంతరంగా కొనసాగుతుంది అని తెలిపారు. అయితే, ప్రజలు భయంతో అధికంగా పెట్రోల్, డీజిల్‌ను క్యాన్లు, డబ్బాలు, బ్యారెల్స్‌లో నిల్వ చేసుకోవడం వల్ల జిల్లాలోని 166 బంకుల్లో 32 బంకులు తాత్కాలికంగా డ్రై అవుట్ అయ్యాయని పేర్కొన్నారు. పెట్రోల్, డీజిల్ సరఫరా నిలిచిపోతుందని, ధరలు పెరుగుతాయని ప్రచారం జరుగుతుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. కానీ వాస్తవానికి ఎక్కడా ధరలు పెరగలేదు, సాధారణ ధరలకే సరఫరా జరుగుతోందని స్పష్టం చేశారు. ప్రస్తుతం పెట్రోల్ ధర సుమారు రూ.109, డీజిల్ ధర రూ.97 వద్ద ఉన్నాయని వివరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ, అవసరానికి మించి పెట్రోల్, డీజిల్ నిల్వ చేసుకోవద్దని, అపోహలు నమ్మకుండా సాధారణంగా వినియోగించుకోవాలని సూచించారు. ఈ విధంగా అధికంగా కొనుగోలు చేయడం వల్ల నిజంగా అవసరమైన వారికి ఇబ్బందులు కలుగుతున్నాయని తెలిపారు. జిల్లాలో పెట్రోల్, డీజిల్ తగినంత ఉంది, ఎటువంటి కొరత లేదు. ప్రజలు భయపడవద్దు, అపోహలను నమ్మకూడదని అని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. పెట్రోల్, డీజల్ ను బ్లాక్ లో అమ్మితే కఠినచర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.

# .మున్సిపల్ శానిటేషన్ వర్కర్ సురేష్ మృతికి--నివాళులర్పించిన ఏఐటియుసి నేతలు.





**.సురేష్ కుటుంబానికి న్యాయం చేయాలి-**
**సురేష్ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి.**
**.50 లక్షలు తక్షణమే ప్రకటించాలి**
**మృతి చెందిన సురేష్ కుటుంబానికి న్యాయం చేయడంలో మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తే ప్రత్యక్ష ఆందోళన కార్యక్రమాలకు సిద్ధమవుతాం**
**మున్సిపల్ అధికారులను హెచ్చరించిన .ఏఐటీయూసీ నంద్యాల జిల్లా కార్యదర్శి సుంకయ్య**

**నంద్యాల సిటీ బ్యూరో ఏప్రిల్ 25 ( నంది పత్రిక )** నంద్యాల మున్సిపాలిటీ శానిటేషన్ వర్కర్ సురేష్ అకాల మృతికి గోస్పాడు ఆయన స్వగృహం నందు ఏఐటిసి నంద్యాల జిల్లా కార్యదర్శి సుంకయ్య, నంద్యాల పట్టణ అధ్యక్ష కార్యదర్శులు డి.శ్రీనివాసులు, ధనుంజయ్ ఏఐటియుసి నంద్యాల పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ శివరాం, కార్యవర్గ సభ్యులు రంజిత్, ప్రతాప్, మస్తాన్ లు పూలమాలవేసి నివాళు లు అర్పించారు అనంతరం వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి కుటుంబానికి న్యాయం జరిగేంతవరకు ఏఐటియుసి అండగా ఉంటుందని మృతి చెందిన సురేష్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవడానికి 50 లక్షలు ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని,సురేష్ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, సురేష్ కుటుంబానికి నంద్యాల పట్టణంలో ఇళ్ల స్థలం ఇచ్చి ఇల్లు నిర్మించి ఇవ్వాలని ఏఐటియుసి నంద్యాల జిల్లా కార్యదర్శి సుంకయ్య గారు అధికారులను ప్రభుత్వం యంత్రాంగాన్ని డిమాండ్ చేశారు.

# ప్రతి మహిళా ఒక పారిశ్రామికవేత్త కావాలి

### జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి



**కర్నూలు నంది పత్రిక బ్యూరో.....**స్వయం సహాయక సంఘాల లోని ప్రతి మహిళా ఒక పారిశ్రామికవేత్త కావాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్ లో మెప్మా స్వయం సహాయక సంఘాల మహిళలు బిస్మిల్లా పొదుపు లక్ష్మి గ్రూప్, షాజహాన్ ఎస్ హెచ్ జి, మణికంఠ ఐక్య మహిళా సంఘం, గాంధీ పొదుపు లక్ష్మి గ్రూప్ మహిళలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 100 మంది మహిళలలో ఉత్తమ పారిశ్రామికవేత్తలుగా ఎంపికయిన సందర్భంగా వీరంతా జిల్లా కలెక్టర్ ను కలిశారు. వారి వ్యాపారాలను మరింత అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం వారికి హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూ క్యాంపస్‌లో నాలుగు రోజుల రెసిడెన్షియల్ శిక్షణను ఏర్పాటు చేస్తోంది.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వారిని అభినందించారు. ప్రభుత్వం మహిళా సంఘాల అభివృద్ధికి ఎంతగానో ప్రోత్సహిస్తోందని, ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని ప్రతి మహిళ ఒక పారిశ్రామికవేత్త కావాలని కలెక్టర్ వారిని ఉత్తేజపరిచారు. ఆయా సంఘాల మహిళలు చేస్తున్న వ్యాపారాలు, టర్నోవర్ లాభం తదితర విషయాలను గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. స్వయం ఉపాధితో ఆర్థిక సాధికారత సాధించి సమాజంలో ప్రముఖులుగా ఎదగాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మెప్మా పీడీ శ్రీనివాసులు, పాల్గొన్నారు.

# ఆయిల్ ఫామ్ సాగుపై రైతు సదస్సు



**బండి ఆత్మకూరు నంది పత్రిక ఏప్రిల్ 26:** బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న భోజనం గ్రామంలో శనివారం ఆయిల్ ఫామ్ సాగుపై రైతులకు అవగాహన సదస్సు సమావేశాన్ని నిర్వహించారు. నంద్యాల జిల్లా ఉద్యానశాఖ, పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో ఈ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా నంద్యాల ఆర్టికల్చర్ అధికారి బి హరీంద్ర, పతంజలి డిప్యూటీ మేనేజర్ మాట్లాడుతూ ఆయిల్ ఫామ్ సాగు చేసే రైతుకు ఒక ఎకరాకు 50 మొక్కల చొప్పున సంవత్సరం వయసు కలిగిన మొక్కలను ఉచితంగా ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. ఒక హెక్టారుకు 10,500 రూపాయల చొప్పున ఆయిల్ ఫామ్ పంటకాయ ఖర్చులకు అంతర పంట సాగు కొరకు ప్రోత్సాహంగా అందివ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. ఆయిల్ ఫామ్ మొక్కలను సాగు చేసుకోవడం వల్ల నాలుగవ సంవత్సరం నుండి దిగుబడిని ఇస్తూ, 25 సంవత్సరాల పాటు దిగుబడిని ఇస్తుందని పేర్కొన్నారు. ఒక సంవత్సరానికి లక్ష రూపాయల నుండి 1,50,000 ఆదాయాన్ని ఒక ఎకరాకు ఆదాయం పొందవచ్చు అని అన్నారు. ఈ పంటను సాగు చేసుకునేందుకు ప్రధానంగా నీటి వసతి కలిగి ఉండాలని, ఆసక్తి కలిగిన రైతులు తమ గ్రామాలలోని రైతు సేవా కేంద్రాలలో సంప్రదిస్తే, పతంజలి కంపెనీ సిబ్బంది, ఉద్యాన శాఖ ద్వారా రైతులకు మొక్కలు అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి చందనాయక్ తో పాటు, భోజనం గ్రామ టిడిపి అధ్యక్షుడు బాలకృష్ణ, రైతు సేవా కేంద్రం సిబ్బంది, పి ఎఫ్ ఎల్ సిబ్బందితోపాటు భోజనం గ్రామ రైతులు పాల్గొన్నారు.




# యునాని ఉచిత వైద్య శిబిరం విజయవంతం



**సిరివెళ్ల (నంది పత్రిక)** శిరివెళ్ల మండల కేంద్రంలోని నూరాణి మసీదు సమీపంలో గల మదరసాలో ఉన్నటువంటి విద్యార్థులకు యునాని వైద్యాధికారి డాక్టర్ షమీమున్నిషా శనివారం ఉచిత వైద్య సేవలను అందజేశారు. ఈ సందర్భంగా 65 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేశామని తెలియజేశారు. వేసవిలో సంభవించే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వడదెబ్బ శోకకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ షమీమున్నిషా తెలియజేశారు. యునాని మందులు ఎటువంటి సైడ్ ఎఫెక్ట్ లేకుండా అన్ని రోగాలకు మందులు అందుబాటులో ఉంటాయని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మదరసా ఇముత్తావుల్ ఉలుమా బాయ్స్ మదరసా కేంద్రంలోని ఉపాధ్యాయులు సిబ్బంది ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# భక్తులకు మజ్జిగ పంపిణీ



**బనగానపల్లె ఏప్రిల్ 25నందిపత్రిక** శ్రీ మద్దిలేటి నరసింహ స్వామి దేవస్థానం కు వచ్చి వెళ్ళే భక్తుల కు శ్రీ యాగంటి ఉమా మహేశ్వర స్వామీ దేవాలయం వెళ్ళే దారిలో ఉన్న పత్తే నగరం గ్రామం మెట్ట దగ్గర బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి శివ క్రిష్ణ యాదవ్ ఆద్వర్యంలో రెండవ శనివారం గ్రామం తరుపున ఉచిత మజ్జిగ పంపిణి కార్యక్రమం ఏర్పాటు చేశారు. నట్టల బాల స్వామీ,పార్లపాటి సురేష్ అక్కన్నగారి శివయ్య సహకారం ఏర్పాటు కు సహాయ సహకారాలు అందించారు. దాదాపు 650 మంది భక్తులు మజ్జిగ తీసుకున్నారు విపరీతం గా ఎండలు ఉన్న సందర్భంగా పలువురు భక్తులు సంతోషం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో గ్రామస్తులు గోపాల్ రాజు బాల స్వామీ వినోద్ పరమేష్ బిజెపి రూరల్ మండలం అద్యక్షుడు హరీ కృష్ణ గౌడ్ శివ క్రిష్ణ యాదవ్ కుమార్తె దివ్య వర్ష తదితరులు పాల్గొన్నారు

# అందరి భాగస్వామ్యంతో నగరాన్ని తీర్చిదిద్దుతాం

### నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు

### సెన్సస్ స్వీయ గణనకు ప్రజలు కలిసి రావాలి

### స్వచ్ఛ సర్వేక్షన్‌లో అభిప్రాయాన్ని తెలియజేయాలి

**కర్నూలు నంది పత్రిక బ్యూరో....** ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, అందరి భాగస్వానంతో నగరాన్ని అన్ని విధాల తీర్చిదిద్దామని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు అన్నారు. శనివారం వెంకటరమణ కాలనీలోని నగరపాలక కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. మౌలిక సదుపాయాలు కల్పన, పారిశుద్ధ్యం, పచ్చదనం, ప్రజా సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఆస్తిపన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించామని, కార్పొరేషన్ నూతక కార్యాలయ పనులను త్వరలో పునః ప్రారంభిస్తామని తెలిపారు.ప్రజలు సైతం నగరపాలకు సహకరించాలని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి పన్ను ముందస్తు చెల్లింపులపై 5 రాయితీ, బకాయిలు ఏకమొత్తంలో చెల్లింపులపై 50 వడ్డీ రాయితీని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్వీగణనకు పౌరులు సహకరించాలని, లింక్ ద్వారా ఏప్రిల్ 30 లోపు వివరాలు నమోదు చేసుకోవాలని, మే 1 తర్వాత ఎన్యూమరేటర్ వచ్చినప్పుడు తప్పులుంటే సరి చేసుకోవచ్చని సూచించారు. స్వచ్ఛ సర్వేక్షన్ ప్రజా అభిప్రాయ సేకరణ ప్రారంభమైందని, లింకు ఓపెన్ చేసి, ప్రతి పౌరుడు అభిప్రాయాన్ని తెలియజేయాలని కోరారు.



# జలధార కార్యక్రమాన్ని చక్కటి ప్రణాళికతో అమాలు చేయాలి..!

## మండల స్థాయి బృందాలు సమన్వయం తో ఉత్సాహం గా పనిచేయాలి

## జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి



**వై ఎస్ ఆర్ కడపబ్యూరో చీఫ్ , ఏప్రిల్ 25నంది పత్రిక :** నీటి భద్రతా కార్యక్రమంలో రైతులు, సాగునీటి సంఘాల భాగస్వాములతో జలధార కార్యక్రమాల ప్రణాళికలను మరింత ప్రాధాన్యతతో పటిష్టంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి నోడల్ అధికారులు,మండల స్థాయి బృందాల అధికారులను ఆదేశించారు.శనివారం కలెక్టరేట్ లోని సభా భవన్ లో నుండి జిల్లా కలెక్టర్ డా. శ్రీదర్ చెరుకూరి.. 'జలధార.. జల హారతి, నీటి భద్రత– అమలు ప్రణాళిక పై.. అన్ని మండలాల నోడల్ అధికారులు,ఎంపిడిఓ లు,ఇరిగేషన్,డ్వామా అధికారులు లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో భూగర్భ జలాలు మట్టాన్ని పెంపొందించడం,నీటి వనరులు సంరక్షణ,సాగునీటి వ్యవస్థ బలోపేతం లక్ష్యంగా క్షేత్రస్థాయిలో అవసరాలను గుర్తించాలన్నారు.అందులో భాగంగా నీటి వనరులను గుర్తించడం నీటి భద్రత, సాగునీటి పొదుపు, కొత్త ఆయకట్టు మదుపు,వాగులు, చెరువుల అనుసంధానం, సూక్ష్మ సేద్యం,వర్షపు నీటిని ఒడిసి పట్టడం.. తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మే 1వ తేదీ నుండి 30 వ తేదీ వరకు గ్రామాల వారీ గా వారి పరిధి లోని చెరువుల్లో వారి సొంత అవసరాలకు మట్టిని తోలుకోవచ్చని, కమర్షియల్ గా కాకుండా వారి సొంత అవసరాలకు మట్టిని తోలు కోవచ్చునని తెలియజేసారు. ఈ విషయంలో గ్రామస్థులు వాణిజ్య అవసరాలకు కాకుండా కేవలం వారి సొంత అవసరాలు అంటే.. పొలాలకు మట్టి తోలడం, ఇంటి నిర్మాణం కోసం, గ్రామంలో అభివృద్ధి అవసరాలకు, ఇంటి పరిసరాల పనుల కోసం చెరువుల నుండి ఉచితంగా మట్టిని తోలుకోవచ్చున్నారు. కాగా ఈ ప్రక్రియలో గ్రామస్థులు సొంత అవసరాల కోసం, వారి సొంత ఖర్చుతోనే ఇరిగేషన్ అధికారులు సూచించిన డీసిల్టేషన్ నిబంధనల మేరకు.. మట్టి లెవెల్స్ ప్రకారం తవ్వుకోవచ్చున్నారు.సాగునీటి కాలువలు, చెరువులు గట్లను బలోపేతం చేయడం,కాలువల పూడిక తీత,లాక్స్ మరమ్మతులు వంటి పనులు చేపట్టాలన్నారు.గ్రామాల్లో చెక్ డ్యాములు,రోడ్డు పక్కన ఉన్న కాల్వల డైవర్షన్ వంటి పనులు చేసి ఉంటే గుర్తించి.. క్లియర్ చేసేందుకు ఎన్ఆర్ఈజిఎస్ ద్వారా పనులనుప్రతిపాదించాలన్నారు.పనుల గుర్తింపు,పనుల నిర్వహణ కు సంబంధించి జేసీబీలు,ఇతర సాంకేతిక పరికరాల అవసరాల నివేదికలను ఇవ్వాలన్నారు.గ్రామ పరిసరాల్లో ఉన్న చెరువులు,కుంటలు, కాల్వలలో పిచ్చి మొక్కలు, కంపచెట్లను తొలగింపు, చెరువులు,కాలువల అను సంధానం,భూగర్భ జలాల సంరక్షణ కోసం సూక్ష్మ నీటి సాగును ప్రోత్సహించడం స్లూయిజ్ కాల్వల రిపేరీపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.కాస్కెట్ ట్యాంక్ లు,తాత్కాలికంగా మల్లింపు చేసిన కాలువలను గుర్తించి రిస్టోర్ చేయాలన్నారు. ఈ పనుల్లో ప్రజలు ముఖంగా మహిళా రైతులు,డ్వాక్రా మహిళలు భాగస్వామ్యంతో పనులను వేగవంతంగా, నాణ్యతగా చేపట్టాలన్నారు. జలవనరులు శాఖ,అటవీ శాఖ,పంచాయతీ రాజ్, వ్యవసాయ,పశుసంవర్ధక శాఖలు,డ్వామా తదితర శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. సాగునీటి సంఘాలను పటిష్టం చేసే దిశగా సంబందిత అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. భూగర్భ జలాలను పెంపొందించే దిశ గా ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమీక్షా సమావేశం లో డ్వామా పీడి ఆదిశేషారెడ్డి, జెడ్పి సీఈఓ రామచంద్రారెడ్డి, మైనర్ ఇరిగేషన్ ఎస్ఈ అబ్దుస్, గ్రౌండ్ వాటర్.డిడి మురళీధర్, సంబందిత శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ మలేరియా దినోత్సవం ఘనంగా నిర్వహణ



**శిరి వెళ్ల:-(నంది పత్రిక)** సిరివెళ్లలో 25వ తేదీ శనివారం నాడు స్థానిక ఆస్పత్రి నందు డాక్టర్ ముఖేష్ మరియు డాక్టర్ ఆంజనేయులు నాయక్ ఆధ్వర్యంలో ప్రపంచ మలేరియా దినోత్సవం ఘనంగా నిర్వహించారు .ఈ సందర్భంగా డాక్టర్ ఆంజనేయులు నాయక్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఏప్రిల్ 25 వ తేదీన ప్రపంచవ్యాప్తంగా మలేరియా వ్యాధిపట్ల అవగాహన కల్పించేందుకు మలేరియా దినోత్సవం జరుపుకుంటారని తెలిపారు.మలేరియా వ్యాధి ఆడ అనాపిలిస్ దోమ కాటు వల్ల వస్తుందని ఇంటి పరిసరాల్లో నీటి నిలువలపై దోమలు గుడ్లు పెట్టకుండా నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని,నిల్వ నీటిపై వేస్ట్ ఇంజిన్ ఆయిల్ కిరోసిన్ ఆయిలు చల్లించాలని తెలిపారు...మరియు మురుగు నీటి కాలువలపై యాంటీ లార్వల్ మందులు చెల్లించాలని తెలిపారు. వ్యాధి లక్షణాలు కనిపించి నట్లయితే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచితంగా రక్త పరీక్ష చేయించుకుని వ్యాధి నిర్ధారణ అయితే చికిత్సతో వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చని తెలిపారు .. 2025 నుండి మలేరియా కేసులు గణనీయంగా తగ్గుముఖం పట్టాయని మలేరియా రహిత దేశమే భారత ప్రభుత్వ లక్ష్యమని ప్రతి ఒక్కరూ ప్రభుత్వము అమలు చేయుచున్న ఆరోగ్య కార్యక్రమాలను వినియోగించు కోవాలని తెలిపారు. వ్యాధి వ్యాప్తి పట్ల అవగాహన కలిగి ఉండి తగిన జాగ్రత్తలు తీసుకుంటే కీటక జనిత వ్యాధులు రాకుండా కాపాడుకోవచ్చు అని తెలిపారు. తదనంతరం ఆరోగ్య సిబ్బంది చే మలేరియా నివారణ పట్ల తనవంతు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు ఈ కార్యక్రమంలో పి హెచ్ ఎన్ సరస్వతి ,కిరణ్ ,ఆరోగ్య సిబ్బంది ఆశా కార్యకర్తలు మరియు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ప్రజలు జనగణన స్వీయ ఎన్యూమరేషన్ పూర్తి చేసుకోవాలి..

## ఎంపీ బస్తిపాటి నాగరాజు



**కర్నూలు నంది పత్రిక బ్యూరో....** జిల్లా ప్రజలందరూ జనగణన స్వీయ ఎన్యూమరేషన్ పూర్తి చేసుకోవాలని ఎంపీ బస్తిపాటి నాగరాజు సూచించారు.. జనగణన స్వీయ ఎన్యూమరేషన్ లో భాగంగా ఇటీవల స్వీయ గణన చేసుకున్న ఎంపీ నాగరాజుకు, నగరంలోని ఎంపీ కార్యాలయంలో సహాయ గణాశీక అధికారి శివన్న జనగణన మెమెంటో అందజేశారు...ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ భారత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జనగణన-2027 ప్రక్రియలో భాగంగా, ప్రజలు తమ వివరాలను ఆన్‌లైన్‌లో స్వయంగా నమోదు చేసుకునే స్వీయ ఎన్యుమరేషన్ విధానం అందుబాటులోకి వచ్చిందని, ప్రతి కుటుంబం స్వీయ గణనలో పాల్గొని సరైన పూర్తి వివరాలను నమోదు చేసుకోవాలన్నారు..

# పెట్రోల్ డీజిల్ కృత్రిమ కొరత సృష్టిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి - ఏఐవైఎఫ్




**కర్నూల్ ప్రతినిధి నంది పత్రిక** కర్నూల్ నగరంలో డీజిల్, పెట్రోల్ కృత్రిమ కొరత సృష్టిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో కర్నూల్ నగరంలోని మెడికల్ కాలేజ్ దగ్గర ఉన్న పెట్రోల్ బంకు ముందు ధర్నా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ఏఐవైఎఫ్ నగర అధ్యక్షులు నాగరాజు అధ్యక్షత వహించగా ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె శ్రీనివాసులు, నగర కార్యదర్శి బిసన్న లు మాట్లాడుతూ కర్నూల్ నగరం తో పాటు జిల్లా వ్యాప్తంగా గత నాలుగు రోజులుగా పెట్రోల్ దొరకక ప్రజలు అనేక ఇబ్బందులు పడతా ఉంటే జిల్లా అధికార యంత్రాంగం మాత్రం డీజిల్, పెట్రోల్, గ్యాస్, కొరత లేదు అంటూ ప్రకటనలకే పరిమితం అవుతా ఉన్నారు తప్ప క్షేత్రస్థాయిలో ప్రజల ఇబ్బందులు పట్టించుకోవడం లేదన్నారు కర్నూలు నగరంలో గత మూడు రోజుల నుండి అన్ని పెట్రోల్ బంకులో నో స్టాక్ బోర్డుల దర్శనమిస్తున్నాయని ఒకటి రెండు పెట్రోల్ బంకులో పెట్రోల్ ఉంటే ప్రజలు క్యూలైన్లో గంటల తరబడి వేచి ఉండవలసిన పరిస్థితి ఏర్పడిందని గంటలు వేచి ఉన్న కొంతమందికి పెట్రోల్ దొరకక బండ్లు తోచుకుంటూ ఇండ్లకు వెళ్తున్న పరిస్థితి దాపరిచిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు పెట్రోల్ కొరత వల్ల చాలామంది డెలివరీ బాయ్స్, ఆఫీస్ కి వెళ్లేవారు, ఆటో డ్రైవర్లు ఇండ్లకే పరిమితం కావలసిన పరిస్థితి దాపరించిందని వారి మండిపడ్డారు పెట్రోల్, డీజిల్ కొరత ఒక వాహనాలకే పరిమితం కాదని దీనివల్ల నిత్యవసర వస్తువుల ధరలు కూడా విపరీతంగా పెరిగి సామాన్య, మధ్యతరగతి అనేక ఇబ్బందులు పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు జిల్లా అధికార యంత్రాంగం జిల్లాలో పెట్రోల్ డీజిల్ కొరత లేదనేది నిజమైతే, వాటిని నిలువ ఉంచుకొని కృత్తిమ కొరత సృష్టించి బ్లాక్ లో అధిక రేటుకు అమ్ముకునే వారిపై క్రిమినల్ కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారి డిమాండ్ చేశారు, అలాకాకుండా జిల్లా అధికార యంత్రాంగం సామాన్య ప్రజల గాలికి వదిలేసి మేం పత్రికా ప్రకటనలకే పరిమితం అవుతాం అంటే అఖిల భారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ గా చూస్తూ ఊరుకోమని కృత్తిమ కొరత సృష్టించే వారిపై అవసరమైతే ప్రత్యక్ష దాడులు చేస్తామని, దానికి పాలకులు అధికారుల బాధ్యత వహించవలసి ఉంటుందని వారు హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి అశోక్ ఏఐవైఎఫ్ నగర నాయకులు చంటి, కుమార్, రాజేష్, కాసిం, రంజిత్ భాష, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు

# బ్రహ్మంగారి కాలజ్ఞానం ప్రపంచానికి ఆదర్శం బ్రహ్మానంద చారి



**బనగానపల్లె ఏప్రిల్ 25నందిపత్రిక** బనగానపల్లె మండలం పలుకూరు గ్రామంలో స్థానిక రామాలయం నందు జె కె ఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జె ఎస్ ఎస్ బ్రహ్మానంద చారి ఆధ్వర్యంలో బ్రహ్మంగారి ఆరాధన ఉత్సవాలు పురస్కరించుకొని బ్రహ్మంగారి కాలజ్ఞాన విశిష్టతపై సదస్సు నిర్వహించడం జరిగింది ముందుగా బ్రహ్మంగారి చిత్రపటానికి పూలమాలవేసి బ్రహ్మానంద చారి ఆలయ పూజారి శ్రీనివాసులు పూజలు నిర్వహించారు అనంతరం సదస్సును ఉద్దేశించి బ్రహ్మానంద చారి మాట్లాడుతూ బ్రహ్మంగారి కాలజ్ఞానం ప్రపంచానికి ఆదర్శమని భూత భవిష్యత్తు వర్తమానం తెలియజేసిన దేవాది దేవుడు వీరబ్రహ్మేంద్రస్వామి ఆయన ఆరాధనలు,జయంతిని ప్రభుత్వపరంగా నిర్వహించాలని జిల్లాకు గాని ఒక యూనివర్సిటీ కి గాని ఆయన పేరు పెట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రవ్వల కొండను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని చింతమాను మఠం నేల మఠం అభివృద్ధికి కృషి చేయాలని బ్రహ్మంగారి మఠాన్ని ప్రపంచ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని ప్రసాద పథకం కింద 150 కోట్లు కేటాయించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి శ్రీనివాసులు నటలయ్య గాలి అన్న దూదేకుల ఉసేని కుమ్మరి వెంకటేశ్వర్లు నర్సమ్మ కరెంటు రాజు భక్త బృందం పాల్గొన్నారు

# అంగవైకల్యం ఆధారం లేని జీవితం దాతల సహాయం కోసం ఎదురు చూపులు



**పోరుమామిళ్ల ఏప్రిల్ 25 (నంది పత్రిక):** కడప జిల్లా కాశీనాయన మండలంలోని బాలాయపల్లె హరిజనవాడకు చెందిన కందుల నయోమి (30) పుట్టుకతోనే అంగవైకల్యంతో ,తల్లిదండ్రులు లేక తమ నాయనమ్మ ఆదరణ చూపుతూ ఇంతకాలం వరకు జీవనం సాగిస్తూ కాలం గడిపింది. అయినవారు పట్టించుకోకపోవడంతో వృద్ధాప్యంలో ఉన్న నాయనమ్మ చేదోడు వాదోడుగా ఆమెను ఆదరించడం ఎంతో గొప్ప విషయం. ప్రభుత్వం మంజూరు చేసిన పెన్షన్ వస్తున్నప్పటికీ వృద్ధాప్యంలో ఉన్న నాయనమ్మ ఎంత కాలం చూస్తుందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వమైన, మనసున్న దాతలు ఎవరైనా వీల్ చైర్ ను పంపిణీ చేస్తారని ఆమె మీడియా ముందు ప్రాధేయపడ్డారు.ఇప్పటికైనా ప్రభుత్వం దాతలు ముందుకు వచ్చి సలోమికి సహాయం చేస్తారని ఆశిద్దాం. దాతల సహాయార్థం 7013304593 ఈ నెంబర్ను సంప్రదించవలసిందిగా ఆమె కోరడమైనది.

# మాజీ సైనికుల కొరకు ఉచిత న్యాయ సేవలు



**కర్నూలు నంది పత్రిక బ్యూరో ....** రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థల ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ అధ్యక్షులు మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి సూచనల మేరకు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ, కార్యదర్శి గారైన బి. లీలా వెంకట శేషాద్రి శనివారం నాడు బి.క్యాంపు నందు గల జిల్లా సైనిక్ వెల్ఫేర్ ఆఫీస్ ను సందర్శించి అందు గల మాజీ సైనికుల సమస్యల గురించి చర్చించారు. జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయం నందు మాజీ సైనికుల కొరకు నల్సా వీర్ పరివార్ సహాయత యోజన 2025 పథకం లో భాగంగా లీగల్ సర్వీసెస్ క్లినిక్ ను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు . జడ్జి మాట్లడుతూ ఈ క్లినిక్ నందు న్యాయ వాది మరియు ప్యారా లీగల్ వాలంటీర్ లు ఉంటారని వీరు మాజీ సైనికుల కు చట్టభద్ధ మైన సమస్య లు ఉంటే వాటికీ ఉచితంగా న్యాయాన్ని అందించి వారి సమస్య లను పరిష్కరిస్తారని తెలిపారు. మాజీ సైనికులు అందరు ఉచిత న్యాయ సహాయానికి అర్హులని తెలిపారు. మాజీ సైనికులు వారి కుటుంబ సభ్యులు వారి చట్టాపరమైన సమస్యల పరిష్కారం కోసం లీగల్ సర్వీసెస్ టోల్ ఫ్రీ హెల్ప్ లైన్ నెంబర్ 15100 కు ఫోన్ చేస్తే వారి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు.ఈ సదస్సు లో కర్నూలు జిల్లా ఇంచార్జి సైనిక్ వెల్ఫేర్ ఆఫీసర్ మహేంద్రమ్మ , ప్యారా లీగల్ వాలంటీర్ మధు సుధన్,మాజీ సైనిక ఉద్యోగుల అధ్యక్షులు, మాజీ సైనికులు పాల్గొన్నారు.

# శ్రీనివాస్ సెంటర్ టు సంజీవనగర్ గేట్ రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించిన ... మంత్రి ఎన్ఎండి ఫరూక్



**నంద్యాల సిటీ బ్యూరో ఏప్రిల్ 25 ( నంది పత్రిక )** నంద్యాల పట్టణంలోని శ్రీనివాస్ సెంటర్ టు సంజీవనగర్ గేట్ వరకు జరుగుతున్న రోడ్డు అభివృద్ధి పనులను రాష్ట్ర మంత్రి వర్యులు ఎన్ఎండి ఫరూక్ శనివారం స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లతో మాట్లాడి పనుల పురోగతి గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి ఫరూక్ మాట్లాడుతూ పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ఒకటైన శ్రీనివాస్ సెంటర్ టు సంజీవనగర్ గేట్ వరకు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా రోడ్డు పనులను అత్యంత నాణ్యతతో, వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పనులు జరుగుతున్న సమయంలో వాహనదారులకు, స్థానిక ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జాప్యం లేకుండా నిర్ణీత గడువులోగా రోడ్డు విస్తరణ మరియు అభివృద్ధి పనులను ముగించాలని తెలిపారు. నిర్మాణ సమయంలో దుమ్ము, ట్రాఫిక్ మళ్లింపు వంటి విషయాల్లో ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. రోడ్డు నిర్మాణంలో ఎక్కడా రాజీ పడకుండా అత్యుత్తమ ప్రమాణాలు పాటించాలన్నారు ఈ కార్యక్రమంలో మంత్రి వెంట స్థానిక నాయకులు, సంబంధిత శాఖల అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.



# మారెమ్మ కర్రేమ్మ సుంకలమ్మ దేవరను విజయవంతం చేయాలి :::బీజేపీ కోడుమూరు నియోజకవర్గ ఇన్చార్జ్ వేల్పుల గోపాల్



**కర్నూల్ ప్రతినిధి నంది పత్రిక** కర్నూలు జిల్లా కోడుమూరు అసెంబ్లీ నియోజకవర్గం గూడూరు మండలం గుడిపాడు గ్రామంలో కర్నూలు ఆర్ డి ఓ సందీప్ కుమార్ గూడూరు మండలం ఆఫీస్ నందు తశిల్దార్ వెంకటేష్ నాయక్ మరియు గూడూరు పోలీసు స్టేషన్ యస్ ఐ రాజ లింగయ్య కలిసి గుడిపాడు గ్రామ పెద్దలు రైతులు ప్రజల సమక్షంలో 28:04:2026 నుండి 29:04:2026 వరకు మారెమ్మ కర్రేమ్మ సుంకలమ్మ దేవర సందర్భంగా వారిని ఆహ్వానించారు వేల్పుల గోపాల్ మాట్లాడుతూ కోడుమూరు నియోజకవర్గం గూడూరు మండలం చుట్టుపక్కల గ్రామాలు ప్రజలు మరియు భక్తులు రానున్నారు మండలంలో జరిగే ప్రధాన దేవరలలో ఒకటి కాబట్టి మండలంలోని ఇతర 10 పంచాయతీల నుంచి కూడ భక్తులు ప్రజలు పాల్గొని మారెమ్మ కర్రేమ్మ సుంకలమ్మ దేవర సందర్భంగా అమ్మ వార్ల గృపకు పాత్రులు కాగలరు అలాగే బుధవారం రాత్రి 9 గంటలకు లక్ష్మీ కళా సమితి ఆధ్వర్యంలో సప్తమాంకములు ఉచిత డ్రామా నిర్వహించనున్నారు గనుక కళాకారులు ప్రజలు అదిక సంఖ్యలో పాల్గొని విజయ వంతం వేయాలన్నారు ఈ కార్యక్రమంలో యేసేపు లింగన్న చిన్న గిడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.



# గాయపడిన బస్సు డ్రైవర్ చికిత్స కు ఆర్థిక సహాయం

**బనగానపల్లె ఏప్రిల్ 25నందిపత్రిక** బనగానపల్లె పట్టణంలోని రంగరాజు వీధిలో ప్రమాదం చోటుచేసుకుంది. కాలనీ వాసి ప్రవైట్ బసు డ్రైవర్ అయిన సయ్యద్ అన్వర్ హుస్సేన్ శనివారం మధ్యాహం సమయం లో తన ఇంటి ముందు నిలబడి ఉండగా, ఒక ఆటో అదుపుతప్పి ఆయనపైకి దూసుకురావడంతో హుస్సేన్ కాలికి ఫ్రాక్చర్ అయింది ఈ విషయం తెలుసుకున్న మంత్రి బీసి జనార్ధన్ రెడ్డి సతీమణి బీసీ ఇందిరా రెడ్డి బీసీజేఆర్ వెల్ఫేర్ ట్రస్ట్ తరపున రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు, బాధితుడు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.



# నవధాన్యాల సాగుతో ఆరోగ్యవంతమైన పంట ఉత్పత్తుల పెంపుదలకు కృషి





## జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**బీమవరం బ్యూరో చీఫ్ ఏప్రిల్ 25నంది పత్రిక** రైతులు ఆరోగ్యవంతమైన మరియు అధిక దిగుబడులు ఇచ్చే పంటలను ఉత్పత్తి చేయడానికి ప్రకృతి వ్యవసాయాన్ని విస్తృతంగా అవలంబించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు. శనివారం నర్సాపురం మండలం సీతారాంపురం గ్రామంలో వరి పంట కోతల సందర్భంగా క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించిన ఆమె, కొప్పర్తి శ్రీనివాస్ అనే రైతు పొలాన్ని సందర్శించి యంత్ర పరికరాలతో వరి కోత విధానాన్ని పరిశీలించారు. జిల్లా కలెక్టర్ స్వయంగా శ్రీనివాస్ పొలంలో నవధాన్యాలను వెదజల్లారు. ఈ సందర్భంగా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ భూసారాన్ని పెంచి పంట బలంగా పెరగడానికి ప్రకృతి సాగు ఎంతో ఉపయుక్తమని పేర్కొన్నారు. ఈ దిశగా నవధాన్యాలను పొలంలో చల్లడం ద్వారా పచ్చిరొట్ట పంట పెరిగి, తరువాత దుమ్ము చేయడం వల్ల భూమి సారవంతమై మంచి దిగుబడులు సాధించవచ్చని వివరించారు. రసాయన వినియోగాన్ని తగ్గించడం లక్ష్యంగా ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ రైతులకు వివిధ రాయితీలు అందజేస్తోందన్నారు. ప్రకృతి వ్యవసాయ కేంద్రం ఆధ్వర్యంలో తొమ్మిది రకాల ధాన్యాలతో (నవధాన్యాలు) 10 కేజీల కిట్లు రైతులకు అందుబాటులో ఉంచుతున్నామని, ఎకరానికి ఒక కిట్ వినియోగిస్తే పచ్చిరొట్ట పంట విస్తారంగా పెరిగి భూమిలో కలిసిపోయి నేల సారాన్ని పెంచుతుందని తెలిపారు. రబీ సీజన్ అనంతరం వేసవిలో విత్తనాలు చల్లి 45 రోజుల తరువాత పొలాన్ని దమ్ము చేయడం ద్వారా మొక్కల నుంచి వచ్చే పోషకాలు భూమిలో కలసి, జూన్‌లో ప్రారంభమయ్యే ఖరీఫ్ పంటలకు భూమి సిద్ధమవుతుందని చెప్పారు. రైతులు వ్యవసాయ కార్యకలాపాల్లో ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ఉండేందుకు ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోందని కలెక్టర్ తెలిపారు. హార్వెస్టింగ్ యంత్రాలకు 75 లీటర్ల డీజిల్, ట్రాక్టర్లకు 20 లీటర్ల డీజిల్ కూపన్లను అందజేస్తున్నామని చెప్పారు. వరి నాటడం నుంచి కోత కోసి కుప్పనూర్చే వరకు రైతులకు అవసరమైన అన్ని విధాల సహాయ సహకారాలు ప్రభుత్వం అందిస్తుందని స్పష్టం చేశారు. వ్యవసాయ రంగానికి సంబంధించిన సందేహాలు లేదా సమస్యలు ఉంటే రైతులు సంబంధిత అధికారులను సంప్రదించాలని సూచించారు. ఈ క్షేత్రస్థాయి పర్యటనలో నర్సాపురం మండల రెవెన్యూ అధికారి ఏవీవీ సత్యనారాయణ, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పీవీవీ ఎన్ఎస్‌పి ప్రసాద్, మండల వ్యవసాయ అధికారి ఏ.జోషేల్, వీఆర్వో, రైతులు తదితరులు పాల్గొన్నారు...





# అపోహలకు లోను కాకుండా అవసరమైన మేరకు మాత్రమే పెట్రోల్, డీజిల్ వినియోగించాలి అక్రమ నిల్వలపై కఠిన చర్యలు

## జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి

**బీమవరం బ్యూరో చీఫ్ ఏప్రిల్ 25నంది పత్రిక** జిల్లాలో పెట్రోల్ మరియు డీజిల్ కొరత లేదని, రైతులు మరియు వాహనదారులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం రాత్రి పొద్దు పోయాక భీమవరం పట్టణంలోని జువ్వలపాలెం రోడ్డులో ఉన్న మోహన్ ఫిల్లింగ్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పెట్రోల్ బంక్‌లో అందుబాటులో ఉన్న పెట్రోల్, డీజిల్ నిల్వలను జాయింట్ కలెక్టర్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మార్కెట్లో డీజిల్ కొరత ఉందన్న అపోహలను ప్రజలు నమ్మవద్దని సూచించారు. రైతులు మరియు వాహనదారుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సరఫరా తగినంతగా ఉందని తెలిపారు. మత్స్యశాఖ మరియు వ్యవసాయ శాఖలు జారీ చేసిన కూపన్ల ప్రకారం రైతులకు డీజిల్ సరఫరా జరగాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ అనవసర పరిమితులు విధించకూడదని పెట్రోల్ బంక్ యజమానులకు సూచించారు. అదే సమయంలో, కొరత ఉందన్న అపోహతో క్యాన్లు లేదా ప్లాస్టిక్ డబ్బాలలో డీజిల్ నిల్వ చేసుకునేందుకు ప్రజలు ప్రయత్నించవద్దని హెచ్చరించారు. ముఖ్యంగా వేసవి కాలంలో ఇలాంటి నిల్వలు ప్రమాదకరమని పేర్కొన్నారు. పెట్రోల్ బంక్ యజమానులు పెట్రోల్, డీజిల్‌ను అక్రమంగా నిల్వ చేసి కృత్రిమ కొరత సృష్టించడం లేదా అధిక ధరలకు విక్రయించడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్ హెచ్చరించారు. అలాగే డీజిల్ కోసం వాహనాలు ఎక్కువసేపు క్యూలైన్లలో నిలవకుండా తగిన చర్యలు తీసుకుని నిరంతర సరఫరా కొనసాగించాలని ఆదేశించారు. ప్రజల సౌకర్యం దృష్ట్యా పారదర్శకంగా, సమర్థవంతంగా ఇంధన సరఫరా నిర్వహించాలని ఆయన పెట్రోల్ బంక్ నిర్వాహకులను కోరారు. ఈ తనిఖీ సందర్భంగా జాయింట్ కలెక్టర్ వెంట భీమవరం తహసీల్దార్ రావి రాంబాబు, సివిల్ సప్లైస్ డి.టి సురేష్ మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు .



# వ్యవసాయ, ఆక్వా రైతులు మరియు వాహనదారులకు ఇంధన సరఫరా సమస్యల పరిష్కారానికి కంట్రోల్ రూమ్ ఏర్పాటు





## జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి

**బీమవరం బ్యూరో చీఫ్ ఏప్రిల్ 25నంది పత్రిక**

జిల్లాలో వ్యవసాయ, ఆక్వా రైతాంగం మరియు వాహనదారులకు డీజిల్, పెట్రోల్ సరఫరాలో క్షేత్రస్థాయిలో తలెత్తే సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు జిల్లా కలెక్టరేట్లో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి తెలిపారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను శనివారం స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జిల్లాలో ప్రస్తుతం వరి కోతలు ముమ్మరంగా సాగుతున్న నేపథ్యంలో వ్యవసాయ, ఆక్వా రంగాలకు చెందిన యంత్రాలు, వరి కోత మిషన్లు, రవాణా వాహనాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఇంధన సరఫరాను నిరంతరంగా కొనసాగించేందుకు ఈ చర్యలు తీసుకున్నట్లు వివరించారు. జిల్లాలోని వివిధ ఆయిల్ కంపెనీల నుంచి పెట్రోల్ బంకులకు డీజిల్, పెట్రోల్ సరఫరా మరియు నిల్వలపై నిరంతర పర్యవేక్షణ చేపడుతున్నామని తెలిపారు. వినియోగదారులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సరఫరా సజావుగా కొనసాగించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో ఎక్కడైనా ఇంధన సరఫరాకు సంబంధించిన సమస్యలు ఎదురైన పక్షంలో రైతులు,

వాహనదారులు నేరుగా కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలని సూచించారు. కంట్రోల్ రూమ్ నంబర్: 8121676653 కు అందిన ఫిర్యాదులను వెంటనే పరిశీలించి తగిన పరిష్కార చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలు అపోహలకు లోను కాకుండా అవసరమైన మేరకు మాత్రమే ఇంధనాన్ని వినియోగించాలని, ప్రభుత్వం తగినంత నిల్వలను ఏర్పాటు చేసిందని జాయింట్ కలెక్టర్ స్పష్టం చేశారు.

## ఇరాన్ తో చర్చల కోసం పాకిస్థాన్ వెళ్లొద్దు.. అమెరికా బృందానికి ట్రంప్ ఆదేశం

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఇరాన్‌తో చర్చల నిమిత్తం తమ ప్రతినిధుల బృందం పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్‌కు వెళ్లాల్సి ఉండగా, ఆ పర్యటనను రద్దు చేస్తున్నట్లు శనివారం ప్రకటించారు. చర్చల కోసం అంత దూరం ప్రయాణించడం సమయం వృథా అని, వాళ్లు మాట్లాడాలనుకుంటే ఫోన్ చేస్తే సరిపోతుందని ఆయన స్పష్టం చేశారు.

ఈ మేరకు తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్'లో ఆయన ఒక పోస్ట్ పెట్టారు. "ఇరాన్‌తో సమావేశం కోసం ఇస్లామాబాద్ వెళుతున్న నా ప్రతినిధుల పర్యటనను ఇప్పుడే రద్దు చేశాను.

# పెట్రోల్ డీజిల్ కొరత తీర్చాలి లేదంటే ఆందోళనకు దిగుతాం- సిఐటియు అధ్యక్షులు నగేష్



**కర్నూల్ ప్రతినిధి నంది పత్రిక** కర్నూల్ నగరము మరియు జిల్లా వ్యాప్తంగా పెట్రోలు డీజిల్ లేక బంకుల దగ్గర తాళ్లు కట్టి పెట్టడం ఒకటి రెండు బంకుల దగ్గర పెట్రోలు డీజిల్ అమ్మితే భారీగా వాహనాలు గంటలు తరబడి ఎదురుచూసిన దొరుకుతుందో లేదో అనే పరిస్థితి కర్నూలు జిల్లాలో ఏర్పడింది. అధికార కూటమి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి జిల్లాలో ఏర్పడుతున్న పెట్రోల్ డీజిల్ కొరతను వెంటనే పరిష్కారం చేయాలని ప్రభుత్వాన్ని సిఐటియు న్యూ సిటీ అధ్యక్షులు వై నగేష్ డిమాండ్ చేశారు. భారీగా శుభకార్యాలు, పాఠశాలలకు సెలవులు వచ్చిన ఈ తరుణంలో మూడు రోజుల నుండి ఎమ్మిగనూరు ఆదోని పత్తికొండ ప్రాంతంలో పెట్రోల్ డీజిల్ దొరకక తీవ్రంగా కష్టమర్లు ఆందోళన చెందుతున్నారు. నిన్న నుండి కర్నూల్ నగరంలో కూడా భారీగా ఇబ్బంది పడుతున్నారు. మంత్రి టీజీ భరత్ ఎక్కడ కొరత లేదని ప్రకటిస్తున్నాడు ఒకసారి పెట్రోల్ బంకుల దగ్గరికి వెళ్లి చూడాలని మంత్రికి సూచించారు. ఎక్కడో ఏసి రూమ్ లో కూర్చుని కొరత లేదని చెప్పడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. అమెరికా సామ్రాజ్యవాదం ముఖ్యంగా ట్రంపు దుందుడుకు చర్యల వల్ల ప్రపంచమంతా ఇబ్బంది పడుతుంటే ఇరాన్ కు అండగా నిలవాల్సింది పోయి దుర్మార్గంగా వ్యవహరిస్తున్న అమెరికాకు మోడీ ప్రభుత్వం మద్దతుగా నిలవడం సరైన చర్య కాదని తెలిపారు. భారత్ కి ఇరాను మిత్ర దేశంగా ఉంటుంది కావున ఇరానుకు భారత్ మద్దతుగా నిలవాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లాలో డీజిల్ పెట్రోల్ కొరత తీర్చకపోతే కష్టమర్లతో కలిసి ఆందోళనకు దిగవలసి వస్తుందని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించారు.

# మున్సిపాలిటీ పరిధిలోని వైన్ షాపులు మరియు బార్లలో తనిఖీలు

## డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పి శ్రీదేవి



**కర్నూలు నంది పత్రిక బ్యూరో....** కర్నూలు ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో కర్నూలు మున్సిపాలిటీ పరిధిలోని వైన్ షాపులు మరియు బార్లలో తనిఖీలు ముమ్మరం చేయడం జరిగినది. డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పి శ్రీదేవి మరియు జిల్లా ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ అధికారి ఎం సుధీర్ బాబు వేరువేరుగా షాపులు మరియు బారులను తనిఖీ చేసి మద్యం యొక్క నాణ్యతను పరిశీలించి మద్యం బాటిల్ల యొక్క స్కానింగ్ ను నిశితంగా పరిశీలించడం జరిగినది ప్రతి ఒక్క బాటిల్ సురక్ష ఆప్ ద్వారా స్కాన్ చేయవలెనని సమయపాలన పాటించవలనని తెలియజేయడం జరిగినది. ఇందు వెంట ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ చంద్రహాస్ ఈఎస్టిఎఫ్ ఇన్స్పెక్టర్ రాజేంద్రప్రసాద్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## పరిమళ విద్యానికేతన లో పాలిటెక్నిక్ ఎంట్రెన్స్ పరీక్షలు



**మంత్రాలయం , ఏప్రిల్ 25,** మండల కేంద్రమైన మంత్రాలయం లోని పరిమళ విద్యానికేతన లో ఆదివారం పాలిటెక్నిక్ కామన్ ఎంట్రెన్స్ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలకు 144 మంది అభ్యర్థులు నమోదు చేసుకోగా , 108 మంది హాజరైనట్లు పర్యవేక్షణ అధికారులు శ్రీ రాములు , వెంకటేష్ తెలిపారు. పరీక్షల ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించిన పరిమళ విద్యానికేతన్ యాజమాన్యానం , పోలీస్ శాఖ ,వైద్య, ఆరోగ్య విద్యుత్ శాఖ, తదితర శాఖలకు సమన్వయం తో విజయవంతం అయిందన్నారు. ఈపరీక్ష పత్రానికి సంబంధించిన ప్రాథమిక కీ నెల 27న అధికార వెబ్సైట్లో అభ్యర్థులు చూసుకోవచ్చున్నారు.

## రహదారి ఆక్రమణలపై మంత్రి ఎన్ఎండి ఫరూక్ సీరియస్ .... తక్షణమే తొలగించాలని కమిషనర్‌కు ఆదేశం



**నంద్యాల సిటీ బ్యూరో ఏప్రిల్ 25 ( నంది పత్రిక )** నంద్యాల పట్టణంలోని ప్రధాన కూడలి అయిన శ్రీనివాస్ సెంటర్ సమీపంలో ఉన్న ఎస్బిఐ మెయిన్ బ్రాంచ్ పక్కన ఉన్న సందు ఆక్రమణకు గురికావడంపై రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్ తీవ్రంగా స్పందించారు. స్థానికంగా ఉన్న ఈ కీలకమైన సందును కొందరు వ్యక్తులు ఆక్రమించి, మూసివేయడం వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గమనించిన మంత్రి ఫరూక్ శనివారం స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించారు. సందు మూసివేత వల్ల రాకపోకలకు కలుగుతున్న అంతరాయాన్ని పరిశీలించిన ఆయన, ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ నంద్యాల మున్సిపల్ కమిషనర్ శేషన్న గారిని సంఘటన స్థలానికి పిలిపించి మాట్లాడి, సందును ఆక్రమణలను తక్షణమే తొలగించాలి. మూసివేసిన మార్గాన్ని వెంటనే తెరిపించి, సాధారణ ప్రజల ఉపయోగంలోకి తీసుకురావాలిని తెలిపారు. పట్టణంలోని ప్రధాన రహదారులు, సందులు ఆక్రమణలకు గురికాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రజల సౌకర్యార్థం ఉన్న దారులను ఆక్రమించడం చట్టవిరుద్ధమని, మున్సిపల్ అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేస్తూ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని మంత్రి ఫరూక్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



# ప్రభుత్వ ఉద్యోగులు ఏఐ టూల్స్‌పై అవగాహన పెంపొందించుకోవాలి

## జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి




**భీమవరం బ్యూరో చీఫ్ ఏప్రిల్ 25నంది పత్రిక** కర్మయోగి పోర్టల్‌లో నమోదు తప్పనిసరిప్రభుత్వ పరిపాలనలో సాంకేతికత వినియోగం కీలకమవుతున్న నేపథ్యంలో ప్రభుత్వ ఉద్యోగులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టూల్స్‌పై అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం నిర్వహించిన పీజీఆర్ఎస్ సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి ఐ గాట్ (ఇంటిగ్రేటెడ్ గవర్నమెంట్ ఆన్లైన్ ట్రైనింగ్) కర్మయోగి పోర్టల్ నమోదు ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ ఉద్యోగులు తమ శాఖల పరిపాలనా పనులను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా ఏఐ ఆధారిత టూల్స్ అయిన చాట్‌జిపిటి, నోట్‌బుక్ ఎల్ఎమ్ వంటి ప్లాట్‌ఫారమ్‌లపై ప్రాథమిక అవగాహన ఉండటం అవసరమని సూచించారు. ఐ గాట్ కర్మయోగి పోర్టల్‌లో అన్ని ప్రభుత్వ ఉద్యోగులు తప్పనిసరిగా నమోదు కావాలని ఆదేశించారు. ఈ పోర్టల్ ద్వారా ఉద్యోగులు తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకునే అవకాశముందని పేర్కొన్నారు. పోర్టల్‌లో లాగిన్ అయ్యే విధానం, కోర్సుల్లో నమోదు, కోర్సులను పూర్తి చేయడం, సర్టిఫికెట్లను డౌన్‌లోడ్ చేసుకునే విధానం వంటి అంశాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులకు వివరించారు. ఈ సందర్భంగా తప్పనిసరిగా పూర్తి చేయాల్సిన మూడు కోర్సులను గుర్తు చేశారు. హార్ట్ ఇన్ గవర్నెన్స్, కోడ్ ఆఫ్ కండక్ట్ ఫర్ గవర్నమెంట్ ఎంప్లాయీస్, ఓరియంటేషన్ మాడ్యూల్ ఆన్ మిషన్ లైఫ్, ప్రస్తుతం జిల్లాలోని వివిధ శాఖలకు చెందిన మొత్తం 14,992 మంది ప్రభుత్వ ఉద్యోగుల్లో 10,066 మంది ఇప్పటికే పోర్టల్‌లో నమోదు చేసుకున్నారని, ఇంకా 4,926 మంది నమోదు కావాల్సి ఉన్నదని తెలిపారు. మిగిలిన ఉద్యోగులు వెంటనే పోర్టల్‌లో నమోదు అయ్యి సంబంధిత కోర్సులను పూర్తి చేయాలని సూచించారు. మారుతున్న సాంకేతిక పరిణామాలకు అనుగుణంగా వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకున్నప్పుడే ప్రభుత్వ సేవలను మరింత సమర్థవంతంగా అందించగలమని జాయింట్ కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో సీపీఓ శివపార్వతి, జిల్లా పంచాయతీ అధికారి దోసిరెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి గీతాబాయి, గృహనిర్మాణ శాఖ అధికారి పిచ్చయ్య, వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు, టెక్నీషియన్లు పాల్గొన్నారు.

# కుక్కల దాడిలో 6 గురికి గాయాలు



**మహానంది ఏప్రిల్ 25 (నంది పత్రిక):–**మహానంది మండలంలో కుక్కలు దాడిలో పలు గ్రామాలకు చెందిన 6 మంది గాయపడ్డారు.కుక్కల దాడిలో భాస్కరరావు,మోహన్, మహానంది,నరసింహ, కేశవ, మంజులత గాయపడ్డారు. జమాలయ్యా దర్గా – శ్రీనగరం, శ్రీనగరం – బుక్కాపురం రహదారిలో కుక్క దాడి చేసి గాయపరిచినట్లు బాధితులు వాపోయారు.బాధితులు తిమ్మాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ వేణు కార్తికేయ, వైద్య సిబ్బంది బాధితులకు చికిత్స అందించారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరికీ నంద్యాల ఆసుపత్రికి రెఫర్ చేశారు.అధికారులు స్పందించి కుక్కల భారీ నుంచి రక్షించాలని ప్రజలు,బాధితులు కోరుతున్నారు.

# మహానంది దేవస్థానం ఆక్రమణ భూమి స్వాధీనం



**మహానంది, ఏప్రిల్ 25 (నంది పత్రిక):–** నంద్యాల మండలం మూలసాగరం గ్రామంలో ఆక్రమణలో ఉన్న శ్రీ మహానందీశ్వర స్వామి దేవస్థానం భూమిని స్వాధీనం చేసుకున్నట్లు ఆలయ ఈవో ఎన్. శ్రీనివాస రెడ్డి తెలిపారు. శనివారం ఈవో మాట్లాడుతూ.. మూలసాగరంలోని సర్వే నంబర్ 974/1లోని 5–68 ఎకరాల భూమిని ఆక్రమించుకున్నారన్నారు. దీంతో రికార్డుల ప్రకారం స్వాధీనం చేసుకున్నామన్నారు. భూమిని సర్వే చేయించి లీజుకు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ మధు,సిబ్బంది పాల్గొన్నారు.



# సర్క్యులేటరీ ఆక్వా సిస్టమ్ ద్వారా కొరమీను చేపల పెంపకాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**భీమవరం బ్యూరో చీఫ్ ఏప్రిల్ 25నంది పత్రిక**

పశ్చిమ గోదావరి జిల్లాలో చేపల పెంపకాన్ని ప్రోత్సహిస్తూ, ఆదాయ వనరులను విస్తరించేందుకు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి నరసాపురం లేస్ పార్క్ ఆవరణలో సర్క్యులేటరీ ఆక్వా సిస్టమ్ (జఅతీఛబశ్రీథ్శీతీఎ ాానబ్ఖుఛబశ్రీబతీవ ూాఎర్వఎ – జూూ) ద్వారా కొరమీను చేపల పెంపక మోడల్ యూనిట్‌ను శనివారం ప్రారంభించారు. సెర్ప్ మరియు ఎఫ్‌బిఓ మండల సమైక్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ యూనిట్‌లో కలెక్టర్ స్వయంగా కొరమీను చేపలను ఆర్టిఫిషియల్ నీటి కుంటలో వదిలి కార్యక్రమాన్ని ప్రారంభించారు. నాలుగు నెలల క్రితం లేస్ పార్క్ సందర్శన సందర్భంగా ప్రయోగాత్మకంగా టబ్‌లో వదిలిన కొరమీను సీడ్ ప్రస్తుతం సుమారు అరకేజీ బరువుకు పెరగడం విశేషం. ఈ చేపలను నేడు కృత్రిమ నీటి కుంటలోకి మార్చడం జరిగింది.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్‌వై) పథకం కింద రూ.3 లక్షల వరకు రుణం 35% సబ్సిడీతో అందుబాటులో ఉందన్నారు. ఈ సర్క్యులేటరీ ఆక్వా సిస్టమ్ విధానం ద్వారా ఇంటి ఆవరణలో ఖాళీ స్థలాన్ని ఉపయోగించుకుని చేపల పెంపకం చేపట్టవచ్చని తెలిపారు. ఒక సెంటు లేదా రెండు సెంట్ల విస్తీర్ణంలో కూడా ఈ యూనిట్ ఏర్పాటు చేయవచ్చని, సుమారు 50,000 లీటర్ల నీటి నిల్వ సామర్థ్యం ఉంటే సరిపోతుందని వివరించారు. ఈ విధానంలో 7 నెలల్లోనే చేపల పంట సిద్ధమవుతుందని, అరకేజీ బరువున్న చేపలను నేరుగా కుంటలో వదిలితే సంవత్సరానికి రెండు పంటల ద్వారా రూ.3 లక్షల నుండి రూ.3.5 లక్షల వరకు ఆదాయం పొందే అవకాశం ఉందన్నారు.

**ఎన్ఇసిసి సమకూర్చిన ఎగ్ కార్ట్స్ ప్రారంభం** ఇదే కార్యక్రమంలో నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ (ఎన్ఇసిసి) ద్వారా సమకూర్చిన ఎగ్ కార్ట్స్‌ను కలెక్టర్ ప్రారంభించారు. డిఆర్డిఏ ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల సభ్యులను ఎంపిక చేసి ఈ కార్ట్స్‌ను పూర్తిగా ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. ఎగ్ కార్ట్ నిర్వహణ ద్వారా మహిళలు మరియు స్వయం సహాయక సంఘాల సభ్యులు అదనపు ఆదాయాన్ని పొందే అవకాశం ఉందని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ దాసిరాజు, డిఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎంఎస్ఎస్ వేణుగోపాల్, మత్స్యశాఖ ఏడి ఎల్ఎల్ఎన్ రాజు, బొమ్మిడి సునీత, తహసిల్దార్ ఐతం సత్యనారాయణ, లేస్ పార్క్ మేనేజర్ కుసుమ కుమారి, లేస్ పార్క్ ప్రెసిడెంట్ ఎన్. సావిత్రి, డిఆర్డిఏ అధికారులు మరియు ఇతరులు పాల్గొన్నారు..



# పశు వైద్యధికారి కరుణాకర్ కు సన్మానం



**మహానంది ఏప్రిల్ 25 (నంది పత్రిక):–**మహానంది మండలంలోని తిమ్మాపురం గ్రామంలో పశువుల వైద్యశాలలో పనిచేస్తున్న డాక్టర్ కరుణాకర్ ను ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సోమన్న, భారత కమ్యూనిస్టు పార్టీ మహానంది మండల కార్యదర్శి ఆర్.సామెల్, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పి.రాజు ,భారత కమ్యూనిస్టు పార్టీ మండల సహాయ కార్యదర్శి తూపాకల వెంకటేశ్వర్లు వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు లక్ష్మణ్ లు సన్మానించారు.వారు మాట్లాడుతూ కోళ్ల పెంపకం నుంచి పాలు, పాల ఉత్పత్తుల వరకు ఈ రంగం విస్తృతంగా అభివృద్ధి చెందుతోందన్నారు. ముఖ్యంగా గ్రామీణ మహిళలు పశు పోషణ ద్వారా కుటుంబ ఆర్థిక స్థితిని మెరుగుపరుచు కుంటున్నారు. పాడి పరిశ్రమ వేలాది పేద కుటుంబాలకు ఉపాధి కల్పిస్తోందన్నారు. ఈ నేపథ్యంలో పశువుల ఆరోగ్యం అత్యంత కీలకం మని, అయితే సామాన్య రైతులకు పశు వైద్యంపై సరైన అవగాహన లేకపోవడం ఒక ప్రధాన సమస్య అన్నారు. ఈ లోటును పూరించేందుకు ప్రతి సంవత్సరం ఏప్రిల్ నెల నాల్గవ శనివారం ప్రపంచ పశువైద్య దినోత్సవాన్ని జరుపుకుంటారు. 2000 సంవత్సరం నుంచి పశువైద్య దినోత్సవంగా ప్రకటించి పశు వైద్యరంగంలో కృషి చేస్తోందన్నారు. పెంపుడు జంతువులు, పశు వులకు చికిత్స, వ్యాధి నివారణ, ఆహార భద్రత, పరిశోధన, పర్యావరణ పరిరక్షణలో పశు వైద్యులు కీలక భూమిక పోషిస్తున్నారు. వ్యవసాయ అనుబంధ రంగాల్లో యువత పాత్రను ప్రోత్సహించాలి. ప్రతి సంవత్సరం ప్రపంచ పశు వైద్య దినోత్సవాన్నిజరుపటం ద్వారా పశు వైద్య నిపుణుల కీలకమైన వృత్తిని జంతువులు, ప్రజలందరికీ ఆరోగ్యకరమైన సమాజాన్ని సృష్టించడంలో పశు వైద్యులు నిబద్ధతగా సేవలందిస్తారని, అందించాలని కోరుకుందాం అన్నారు.ప్రపం, పశువైద్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పశు వైద్యాధికారులు, రైతులు సమన్వయంతో పశు సంక్షేమానికి కృషి చేయాలన్నారు..

# పోలిసెట్2026 పరీక్షల నిర్వహణను పరిశీలించిన జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

## అన్ని సౌకర్యాలతో ప్రశాంత వాతావరణంలో పరీక్షల నిర్వహణ



**భీమవరం బ్యూరో చీఫ్ ఏప్రిల్ 25** నరసాపురంలోని స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలిసెట్2026 పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రంలో అభ్యర్థులకు కల్పించిన సౌకర్యాలను సమగ్రంగా పరిశీలించారు. పరీక్షా కేంద్రంలో సీటింగ్ ఏర్పాట్లు, లైటింగ్ సదుపాయాలు, త్రాగునీటి సౌకర్యం, వైద్య శిబిరాల ఏర్పాటు వంటి అంశాలను కలెక్టర్ పరిశీలించి సంబంధిత అధికారులకు సూచనలు ఇచ్చారు. అభ్యర్థుల హాజరు శాతం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ పోలిసెట్2026 పరీక్షలు జిల్లాలో ప్రశాంత వాతావరణంలో సక్రమంగా నిర్వహించబడినట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పగడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ఏప్రిల్ 25న నిర్వహించిన పోలిసెట్2026 పరీక్షలు ఉదయం 11.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు నిర్వహించబడినట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణ కోసం జిల్లాలో మొత్తం 26 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అందులో తాడేపల్లిగూడెంలో 4 కేంద్రాలు, తణుకులో 10 కేంద్రాలు, భీమవరంలో 8 కేంద్రాలు, నరసాపురంలో 4 కేంద్రాలు ఏర్పాటు చేయబడినట్లు వివరించారు. ఈ పరీక్షలకు జిల్లాలో మొత్తం 8,615 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణలో ఎటువంటి అంతరాయాలు లేకుండా విజయవంతంగా పూర్తిచేసేందుకు సహకరించిన అధికారులను అభినందించారు. అభ్యర్థులకు అన్ని అవసరమైన సౌకర్యాలు కల్పించడం ద్వారా వారికి అనుకూలమైన పరీక్షా వాతావరణం కల్పించడమే లక్ష్యంగా పనిచేశామని కలెక్టర్ పేర్కొన్నారు...

# ప్రజా సంక్షేమం మరిచి గత పాలకులను విమర్శించడమే ప్రభుత్వ లక్ష్యం.

**కేసముద్రం, ఏప్రిల్ 25(నంది పత్రిక):** శాసనసభ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను, ప్రజా సంక్షేమాన్ని విస్మరించి కేవలం గత పాలకులను విమర్శించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని బిఆర్ఎస్ కేసముద్రం మండల అధ్యక్షుడు మహమ్మద్ నజీర్ అహ్మద్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని బిఆర్ఎస్ కార్యాలయంలో బిఆర్ఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో మహబూబాబాద్ నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు బానోత్ శంకర్ నాయక్ ఆదేశాల మేరకు పత్రిక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండల బిఆర్ఎస్ అధ్యక్షులు మొహమ్మద్ నజీర్ అహ్మద్ తో పాటు నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, కల్వకుంట్ల చంద్రశేఖర రావు రాష్ట్ర రైతంగానికి కాళేశ్వరం అనే బృహత్తర ఎత్తిపోతల పథకాన్ని ప్రపంచంలోనే ఎక్కడలేని విధంగా నిర్మించి, తెలంగాణ రాష్ట్రంలో అన్ని గొలుసు కొట్టు చెరువులకు నీళ్లు అందించి, భూగర్భ జలాలను పెంచారు. రైతుల కష్టాలను దృష్టిలో పెట్టుకొని రైతుబంధుతో పాటు నిరంతరం 24 గంటలు విద్యుత్ సరఫరా అందించి, పండిన పంటలను ప్రభుత్వం పరంగా కొనుగోలు చేసి, రైతుకు కష్టం లేకుండా చేశారని తెలిపారు. దీనిని చూసి ప్రజాదరణను చూసి ఓర్వలేని కాంగ్రెస్ బిఆర్ఎస్ నేతలను నానా ఇబ్బందులకు గురి చేస్తూ, లేనిపోని కమిషన్లు వేసి కేసులు పెట్టి కోర్టుల చుట్టూ తిప్పుతూ చేసిన అభివృద్ధి పద్ధతిగా లేదని తిరస్కరించి ప్రజల్లో దుష్ప్రచారం నిర్వహిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వేసిన అర్జీలను హైకోర్టు గత పాలకుల తప్పులేదని తేల్చి చెప్పినది. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇది చెంపపెట్టు లాంటిదనీ, కాళేశ్వరం కూలిపోయిందని, పనికిరాదని ప్రచారం నిర్వహిస్తూ ఇన్ని రోజులు ప్రజా సంక్షేమాన్ని మరిచి పాలన కొనసాగిస్తున్నారు. ఉద్యోగస్తులకు ఇచ్చిన హామీలు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు, రిటైర్డ్ ఎంప్లాయిస్ కి ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా వారి ఆత్మహత్యలకు దారి చేపట్టారు. ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని మరిచి అన్ని వర్గాల ప్రయోజనాలను తాకట్టు పెట్టి ప్రజాపాలనాన్ని కొనసాగిస్తున్నారు. అన్ని వర్గాలకు ఎలాంటి ప్రయోజనాలు కల్పించకుండా తప్పుడు ప్రచారాలు నిర్వహించుకుంటూ గత పాలకులను నిందించడమే ఏకైక ఎజెండాగా పెట్టుకుని పరిపాలన కొనసాగిస్తున్నారు. ఇప్పటినుంచి రైతులకు గాని, ఉద్యోగస్తులకు గాని ఎలాంటి ఆపద వచ్చిన బిఆర్ఎస్ ముందుండి పోరాడుతుందని అన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలు నెరవేర్చాలని, నెరవేర్చకుంటే ఎలాంటి పోరాటానికైనా సిద్ధమని మండల పార్టీ హెచ్చరిస్తున్నట్లు తెలిపారు. మొక్కజొన్న రైతులకు వారి మొక్కజొన్నలను కొని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. రైతులకు నిరంతరం విద్యుత్తు, నీరు అందించి దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని మొదటి స్థానంలో నిలుపాలని కోరారు. ఆర్టీసీ కార్మికుల కోరికలను వెంటనే అమలు చేయాలని, మృతుల కుటుంబాలకు కోటి రూపాయలు, ఉద్యోగం ఇచ్చి వారి కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలను వెంటనే చెల్లించి వారిని ఆదుకోవాలని, నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు ఇచ్చివారి జీవితాలకు వెలుగు నింపాలని కోరారు. భవిష్యత్తులో జరిగే ఎన్నికల్లో బిఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని ప్రజలు ఎలాంటి అపోహలకు గురి కాకుండా ధైర్యంగా ఉండాలని అన్ని వర్గాల ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి రావుల శ్రీనాథ్ రెడ్డి మండల ప్రధాన కార్యదర్శి కముటం శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు గుగులోత్ వీరు నాయక్, ఊకంటి యాకూబ్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు జాటోత్ సుజాత హరినాయక్, రావుల వినయ్ రెడ్డి, ఆగే రాము, దూడపాక కృష్ణ, మేకల శారద సురేష్, పాయిరాల శరత్, పురం రాజమణి రమేష్, సర్పంచులు ఈసం లక్ష్మీనారాయణ, ఎదరబోయిన సూరయ్య బాలాజీ, జ్యోతి శ్రీనివాస్, మాజీ సర్పంచులు హరి రామ్, ముఖ్య నాయకులు పందుల సంజీవ, తోట శ్రీను, బానోత్ వెంకన్న, మాజీ ఎంపిటిసిలు కొమ్ము రాహుల్, దుబాకుల వెంకన్న, చందు, ఎన్నమాల ప్రభాకర్, రాయుడు, కూన భద్రాద్రి, లింగాల పిచ్చయ్య, బద్రు నాయక్ తదితరులు పాల్గొన్నారు.



# తండ్రి జ్ఞాపకార్థం కూతురు అల్లుడు సేవా కార్యక్రమాలు

## అనాథలకు దుప్పట్లు, దుస్తులు,గొడుగులు అందజేత



**ఎమ్మిగనూరు, ఏప్రిల్ 26( నంది పత్రిక)** ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన ఉప్పర నాగరాజు జ్ఞాపకార్థం ఆయన కుమార్తె తేజస్విని ,అల్లుడు నవీన్ లు సేవా కార్యక్రమాలు చేశారు.శనివారం ఎమ్మిగనూరు పట్టణంలో తేజస్విని తో పాటు ఆమె భర్త నవీన్ లు ఇద్దరు పిల్లలు తో కలిసి ప్రత్యేక ఆటో లో దుప్పట్లు, దుస్తులు,గొడుగులు వేసుకొని పట్టణంలో ప్రధాన వీధులలో తిరుగుతూ ఆర్టీసీ బస్టాండ్,మిలటరీ కాలని, ఎంజీ పెట్రోల్ బంక్ సర్కిల్,సోమప్ప సర్కిల్,సోమప్ప నగర్,వ్యవసాయ మార్కెట్ కమిటీ సర్కిల్,శివ సర్కిల్,గోనెగండ్ల రోడ్డు,అన్నమయ్య సర్కిల్ లలో రోడ్ల పై అనాథలు గా ఉంటున్న వారికి దుప్పట్లు, దుస్తులు,గొడుగులు ఇచ్చారు.అనాథలకు అవసరమైన వస్తువులను అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు .అలాగే తన తండ్రి పై ఉన్న ప్రేమ అభిమానాన్ని చాటుకుంది.ఇందుకు తేజస్విని భర్త కూడా మంచి మనసు తో బార్య కు అండగా నిలిచి మానవత్వాన్ని చాటుకున్నారు. దుస్తులు పంపిణీ చేసే క్రమంలో తండ్రి ను తలుచుకొని కూతురు తేజస్విని కన్నీరు పెట్టుకుంది.నన్ను మా నాన్న ఎంతో ప్రేమ గా పెంచి పెద్ద చేసి ఉన్నత చదువులు చదివించారని అలాంటి మా నాన్న ఇటీవల మరణించడం తట్టుకోలేకపోతున్నాను.మా నాన్న జ్ఞాపకార్థం అనాథలకు సేవలు చేయాలనే సంకల్పం తో గత కొన్ని రోజులుగా ఎమ్మిగనూరు లో సేవ కార్యక్రమాలు చేస్తున్నట్లు తేజస్విని , అల్లుడు నవీన్ అన్నారు.

## ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పాలాభిషేకం



**రామగిరి ఏప్రిల్ 25 –** తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, ఆర్యవైశ్య స్టేట్ కార్పొరేషన్ చైర్పర్సన్ కాల్వ సుజాత చిత్రపటాలకు శనివారం రామగిరి మండల ఆర్యవైశ్య సంఘం నాయకులు పాలాభిషేకం నిర్వహించారు. వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి కార్యక్రమాన్ని అధికారికంగా నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేసిన సందర్భంగా రామగిరి మండల ఆర్యవైశ్య సంఘం నాయకులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు, కాల్వ సుజాత చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షుడు ముస్త్యాల శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలుస్తోందని తెలిపారు. అందుకు నిదర్శనమే మా ఆర్యవైశ్య కులదైవమైన వాసవి మాత జయంతిని అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడమేనని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో కూడా ఆర్యవైశ్య సమాజ అభివృద్ధికి మరిన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో రామగిరి మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గుండ శ్రీనివాస్, వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయ కమిటీ అధ్యక్షుడు రవికంటి గుండయ్య, సంఘం నాయకులు కురిమిల్ల సుధాకర్, గుండా రాధయ్య, కొత్త కమలాకర్, సామ శ్యాంసుందర్, చిట్టిమల్ల వెంకటరమణ, వట్టం శ్రీనివాస్, రావికంటి అరవింద్, దొంతుల మహేందర్, గుండ రమేష్, తోట ప్రసాద్, దొడ్ల మల్లికార్జున్, జిల్లా సతీష్, గోపిశెట్టి రమేష్, తోట శ్రీనివాస్, గుండ రమేష్, కసనగొట్టు సురేష్, నలమాసు రాజు, గుండ శంకరయ్య, కోలేటి వసంత్, పైడ శ్రీనివాస్, మహిళా నాయకురాళ్లు మంచాల శైలజ, ఇల్లందుల వసంత తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సన్నాహక సమావేశం పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్

**కుత్బుల్లాపూర్ ఏప్రిల్ 25 :-** గాజులరామారం సర్కిల్ పరిధిలోని గాజులరామారం, మహాదేవపురం, షాపూర్ నగర్, సురారం డివిజన్లు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సన్నాహక సమావేశం మాజీ శాసనసభ్యులు శ్రీశైలం గౌడ్ నివాసంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన కాంగ్రెస్ ముఖ్య నాయకులు ఉద్దేశించి కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు ఆరు గ్యారెంటీలో ముఖ్యమైన రేషన్ కార్డులు, పేదలకు సన్న బియ్యం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత కరెంటు, ఇందిరమ్మ ఇండ్లు ఇతర సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు కృషి చేయాలని తెలిపారు. రాబోవు గ్రేటర్ మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని అన్ని డివిజన్లో కాంగ్రెస్ ముఖ్య నాయకులు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టతకు బలంగా పనిచేసే వారికి మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా అవకాశం దక్కుతుందని నాయకులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ డిసిసి ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్ గౌడ్, గాజులరామారం సర్కిల్ పరిధిలోని నాలుగు డివిజన్ల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



## గిర్ని తండా అంగన్వాడి కేంద్రంలో ఘనంగా ఈసీసీ డే






**కేసముద్రం, ఏప్రిల్ 25(నంది పత్రిక):**కేసముద్రం మున్సిపల్ పరిధిలో గిర్ని తండా అంగన్వాడి కేంద్రంలో శనివారం ఈసీసీ డేను అంగన్వాడీ టీచర్స్ రమాదేవి, కవిత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన అంగన్వాడి సూపర్ వైజర్ విజయ, జిపిఓ రాములు మాట్లాడుతూ మూడు నుండి ఆరు సంవత్సరాల లోపు పిల్లలకు ఎర్లీ చైల్డ్ కేర్ ఎడ్యుకేషన్ కార్యక్రమం ఎంతో ఉపయోగకరమన్నారు. అంగన్వాడి సెంటర్ ద్వారా లభించే పౌష్టికాహారం పిల్లలకు ఎంతో బలమైనదని ఆకుకూరలు పాలు, గుడ్లు, మాంసకృతులు బాగా ఉంటాయని, ప్రతిరోజు అంగన్వాడి సెంటర్ ద్వారా లభించే పౌష్టికాహారం తీసుకుంటే పిల్లలు దృఢంగా ఉంటారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు, కిషోర బాలికలు, గర్భిణీ స్త్రీలు, బాలింతలు తండావాసులు, ఆయాలు వెంకటలక్ష్మి, కవిత తదితరులు పాల్గొన్నారు.

## ఓపెన్ పదవ తరగతి పరీక్షలు వ్రాసిన టిడిపి మండల అధ్యక్షుడు ఏషబోయిన ఎల్లయ్య.



**కేసముద్రం, ఏప్రిల్ 25(నంది పత్రిక):** మనిషి జీవితంలో ఎన్ని సాధించినా గాని చదువుకుని సర్టిఫికెట్ సంపాదించుకోవడం ముఖ్యమంటూ పట్టుదలతో ఓపెన్ 10వ తరగతి పరీక్షలు వ్రాసి పలువురికి ఆదర్శంగా నిలిచారు కేసముద్రం మండల టిడిపి అధ్యక్షుడు ఏషబోయిన ఎల్లయ్య. ఈ నెల 20 నుండి ప్రారంభమైన ఓపెన్ పదవ తరగతి వార్షిక పరీక్షలలో కేసముద్రం విలేజ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుండి అడ్మిషన్ పొంది మహబూబాబాద్ మండలం జమాండ్లపల్లి లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో యువకులకు దీటుగా పట్టుదలతో ఓపెన్ 10వ తరగతి వార్షిక పరీక్షలను పూర్తి చేసుకున్నారు. గతంలో కేసముద్రం మండలం మహమూద్ పట్నం గ్రామ సర్పంచిగా తన భార్య కేతమ్మ విధులు నిర్వర్తించగా, మండలంలో తెలుగుదేశం పార్టీకి అధ్యక్షుడిగా వ్యవహరిస్తూ, ప్రతి ఒక్కరికి చదువు అవసరమని గుర్తించి ఓపెన్ 10 పరీక్షలు రాసిన ఎల్లయ్య తెలిపారు. నిత్యం ఏదో ఒక పనితో బిజీగా ఉండే ఎల్లయ్య విద్యార్థి లాగా మారి పట్టుదలతో చదివి ఓపెన్ పదవ తరగతి పరీక్షలు రాయడం పట్ల తనకు చాలా సంతోషాన్ని కలిగించిందని తెలిపారు.

# కమలాపూర్‌లో బెల్ట్ షాపుల వేట

### - పంచాయతీ పాలక మండలి సంచలన నిర్ణయం!

**కమలాపూర్, ఏప్రిల్ 25 :** కమలాపూర్ మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో అక్రమ మద్యం విక్రయాలకు అడ్డుకట్ట వేస్తూ గ్రామ పంచాయతీ పాలక మండలి కీలక నిర్ణయం తీసుకుంది. గ్రామంలో బెల్ట్ షాపులను పూర్తిగా నిషేధిస్తూ శనివారం జరిగిన జనరల్ బాడీ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. అనర్థాలకు కేంద్రాలుగా బెల్ట్ షాపులు గ్రామ సర్పంచ్ పబ్బు సతీష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గ్రామంలోని తాగునీరు, పారిశుధ్యం , ఇతర అభివృద్ధి పనులపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామంలో విచ్చలవిడిగా వెలుస్తున్న బెల్ట్ షాపుల వల్ల శాంతిభద్రతలకు విఘాతం కలగడమే కాకుండా, అనేక కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచ్ పబ్బు సతీష్ మాట్లాడూతూ బెల్ట్ షాపు నిర్వాహకులు ఎంఆర్‌పి (వీ=రా) ధరల కంటే అధికంగా వసూలు చేస్తూ పేదల రక్తాన్ని తాగుతున్నారు. రాత్రి, పగలు అనే తేడా లేకుండా మద్యం విక్రయాలు సాగించడం వల్ల యువత పెడదోవ పడుతోంది. సులభంగా మద్యం అందుబాటులో ఉండటంతో తాగి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు పెరిగి ప్రాణాలు పోతున్నాయి. అబ్కారీ శాఖకు విన్నపం గ్రామస్తుల సంక్షేమం దృష్ట్యా పాలక మండలి తీసుకున్న ఈ నిర్ణయానికి అబ్కారీ (జు×ఎఱంవ) అధికారులు పూర్తి సహకారం అందించాలని కోరారు. తక్షణమే క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టి బెల్ట్ షాపులను తొలగించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పుల్ల శ్రీనివాస్, వివిధ వార్డుల సభ్యులు , పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. పాలక మండలి తీసుకున్న ఈ నిర్ణయంపై గ్రామ మహిళలు, మేధావుల హర్షం వ్యక్తం చేశారు.



## సీనియర్ పాత్రికేయుడు గన్ను శ్రీనివాస్ కన్నుమూత..

### - నివాళులర్పించిన ప్రెస్ క్లబ్ ప్రతినిధులు...



హుజురాబాద్ మండలం చెల్పూరు గ్రామానికి చెందిన సీనియర్ పాత్రికేయుడు గన్ను శ్రీనివాస్ (54) శనివారం ఉదయం గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. ఆయన అకాల మరణం పట్ల స్థానిక పాత్రికేయు లు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. శ్రీనివాస్ మరణవార్త తెలిసిన వెంటనే హుజురాబాద్, జమ్మికుంట ప్రాంతాలకు చెందిన పాత్రికేయ మిత్రులు చెల్పూరుకు చేరుకుని ఆయన భౌతికకాయానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ, వృత్తి పట్ల ఆయనకు ఉన్న నిబద్ధతను కొనియాడారు. కుటుంబ సభ్యులను పరామర్శించిన పాత్రికేయులు, మున్సిపల్ చైర్ పర్సన్, ప్రజా ప్రతినిధులు.. శ్రీనివాస్ కుటుంబ సభ్యులను పరామర్శించిన పాత్రికేయులు, మున్సిపల్ చైర్ పర్సన్ రొంటాల సుహాసిని, స్థానిక సర్పంచ్ వనతడుపుల కస్తూరి, కౌన్సిలర్ సొల్లు సునీత బాబు,నాయకులు పోలంపల్లి శ్రీనివాస్ రెడ్డి, దేశిని కోటి లు వారికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ పరామర్శలో పాల్గొన్న వారిలో హుజురాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కాయిత రాములు, జమ్మికుంట ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నర్సింగ్ శ్రీనివాస్, సీనియర్ జర్నలిస్టులు కేసిరెడ్డి నరసింహారెడ్డి, అనుమాస రాజేందర్,అల్లి నరేందర్,మండల యాదగిరి,టేకుల సాగర్,నంబి భరణి కుమార్,సృజన్ తేజస్వి రాజ్, పోతరాజు సంపత్,నాగవల్లి రాజు లు ఉన్నారు. గన్ను శ్రీనివాస్ మృతి తో చెల్పూరు గ్రామంతో పాటు హుజురాబాద్ పాత్రికేయ రంగానికి తీరని లోటని ప్రెస్ క్లబ్ ప్రతినిధులు ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు.

# బాచుపల్లి, నిజాంపేట్ డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయాలలో మౌలిక వసతులను అభివృద్ధి చేస్తాం





### ఎమ్మెల్యే కే.పీ వివేకానంద్ గౌడ్

**కుత్బుల్లాపూర్ ఏప్రిల్ 25 :-** సిఎంసి నిజాంపేట్ సర్కిల్ పరిధి బాచుపల్లి, నిజాంపేట్ డబల్ బెడ్ రూమ్ ఇండ్ల సముదాయాలలో లబ్ధిదారులకు అందుతున్న సదుపాయాలపై బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కే.పీ వివేకానంద్ గౌడ్ అధికారులతో క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఇరువైపులా ప్రహరీ గోడ నిర్మాణం, వాటర్ లీకేజీ, లిఫ్ట నిర్వాహణ, నీటి సంపు, ప్రార్థన మందిరాలపై స్థలాల కేటాయింపు, పార్కుల అభివృద్ధి, అంగన్ వాడీ, బస్తీ దవాఖాన, స్మశాన వాటిక కై స్థలం కేటాయింపు, వీధి దీపాల ఏర్పాటు వంటి సదుపాయాలను కల్పించాలని ఎమ్మెల్యే కి విన్నవించారు. అనంతరం వారు మాట్లాడుతూ డబల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయాల లోని ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పరుస్తున్నామని, రానున్న రోజుల్లో ఇండ్లలో మౌలిక వసతులతో పాటు ప్రార్థన మందిరాలు, వైకుంఠధామాలకు స్థలాలు కేటాయించి అభివృద్ధి పరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో

హౌసింగ్ బోర్డు, రెవెన్యూ, ఇంజనీరింగ్, వాటర్ వర్క్స్ విభాగాలతో పాటు పలు విభాగాలకు చెందిన అధికారులు, మాజీ ప్రజా ప్రతినిధులు ఆగం రాజు, చందు, గాజుల సుజాత, రంగరాయ ప్రసాద్, బాచుపల్లి, నిజాంపేట్ డబల్ బెడ్ రూమ్ ఇండ్ల సముదాయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## ఆసుపత్రి, బడి, గుడి, గుడిసె అన్నీ లెక్కిస్తాం: జనగణన తెలంగాణ డైరెక్టర్

జనగణన తెలంగాణ డైరెక్టర్ భారతి హోళికెరె జనాభా లెక్కల సేకరణ వివరాలను శనివారం మీడియాకు వివరించారు. తెలంగాణ భౌగోళిక పరిధిలో ఉన్న ప్రతి ఇంటిని లెక్కిస్తామని ఆమె వెల్లడించారు. ప్రతి నిర్మాణాన్ని లెక్కలోకి తీసుకుంటామని తెలిపారు. ఆసుపత్రి, బడి, గుడి, గుడిసె, అద్దె భవనం ఇలా అన్నింటి గణన జరుగుతుందని వెల్లడించారు. అలాగే ఒక భవనం లేదా కాంప్లెక్స్‌లో ఉండే ప్రతి కుటుంబాన్ని పరిగణనలోకి తీసుకుంటామని అన్నారు. 2027 ఫిబ్రవరిలో రెండో దశ జనగణన మొదలయ్యేలోగా అన్నీ సిద్ధం చేస్తామని తెలిపారు. రెండో దశ జనగణనలో భాగంగా 2027 ఫిబ్రవరి నుంచి వ్యక్తిగత సమాచారాన్ని సేకరిస్తామని అన్నారు. ఇళ్ల గణన కోసం బ్లాకులుగా విభజించి ఎన్యుమరేటర్లను కేటాయిస్తామని తెలిపారు. మే 11వ తేదీ నుంచి జూన్ 9 వరకు ఎన్యుమరేటర్లు ప్రతి ఇంటికి మార్కింగ్ చేస్తారని తెలిపారు. ప్రతి ఇంటికి వెళ్లి జనగణనకు సంబంధించిన యాప్ ద్వారా 33 ప్రశ్నలను అడిగి వాటిని పూరిస్తారని చెప్పారు. జనగణనకు సంబంధించి ఒక ఇంటి నుంచి ఒక మొబైల్ నెంబర్ తీసుకుంటామని చెప్పారు. భాషను, ఇంటి పెద్దల వివరాలు సరిగ్గా ఇవ్వాలని సూచించారు. మొబైల్ నెంబర్, భాష, ఇంటి పెద్ద పేర్లను ఒకసారి నమోదు చేస్తే, వాటిని మార్చడానికి వీలుండదని తెలిపారు.

## ఉచిత విద్య, వైద్యం ఉచ్చరించడానికి మనసు ఒప్పని పార్టీలు

సాధించిన దానితో తృప్తిని చెంది అదే విజయం అనుకుంటే పొరపాటోయి “ అని శ్రీ శ్రీ తన సినీ గీతంలో కర్తవ్యాలను గురించి హెచ్చరించిన సందర్భం ప్రజలకు మాత్రమే కాదు పాలకులకు కూడా వర్తిస్తుందనుకుంటే మంచిది. విద్యా రంగానికి పరిమితమై మాట్లాడుకుంటే 1966 లో కొఠారి కమిషన్ చేసిన సూచన కామన్ స్కూలు విధానాన్ని ప్రవేశపెట్టడం ద్వారా సమానత్వాన్ని సాధించడానికి కృషి చేయాలని హెచ్చరిస్తే అంతరాల భారతాన్ని అలాగే కొనసాగించాలనే కుట్రతో అంతరాల విద్య వైద్యాన్ని అమలు చేస్తున్నారు పాలకులు. ప్రపంచంలోనే మూడవ ఆర్థిక వ్యవస్థ స్థాయికి చేరుకున్నదని గర్వంగా చెబుతున్నటువంటి పాలకులు భారతదేశశీ ప్రస్తుతము ఐఎంఎఫ్ నివేదిక ప్రకారంగా పొ రుగున ఉన్న శ్రీలంక, మాల్దీవుల కంటే కూడా తలసరి ఆదాయంలో తక్కువగా ఉండడాన్ని ఎలా సమర్థించుకుంటారు ?నివేదికలతో పాటు పాలకుల యొక్క చిత్తశుద్ధి సామాజిక బాధ్యత ఎక్కడైతే ఉంటుందో వారు అంకితభావంతో ప్రజల కోసం పనిచేసిన సందర్భాలు ముఖ్యంగా విద్యా వైద్య రంగాలలో తీసుకువచ్చిన విప్లవాత్మక మార్పులను మనం కొంతవరకు చూడవచ్చు. ముఖ్యంగా విద్య (25%) విషయంలో ఢిల్లీ ఆమ్ ఆద్మీ పార్టీప్రభుత్వం చేసిన విశేష కృషి కేంద్ర ప్రభుత్వంతో సహా అందరికీ ఆదర్శప్రాయమే. ఇక విద్యారంగంలో కేరళ ప్రభుత్వం కూడా తన బడ్జెట్లో 24% కేటాయించడం ద్వారా తనదైన శైలిలో కొనసాగుతున్నది. అంతెందుకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నాటి ప్రభుత్వాలు విద్యకు 17% కేటాయిస్తే బంగారు తెలంగాణ పేరుతో ఆడంబరాలు పలికిన టిఆర్ఎస్ తన హయాంలో ఏడు శాతానికి మించలేదు. ఇటీవల వచ్చినటువంటి కాంగ్రెస్ ప్రభుత్వం కూడా 8 శాతానికి చేరువలో ఉన్నదంటే వీళ్ళ అంకితభావం ఏ పాటిదో అర్థం చేసుకోవచ్చు. కేజ్రీ వాల్ నాయకత్వంలోని ఢిల్లీ ప్రభుత్వం అంతర్జాతీయ స్థాయిలో విద్య వైద్యం ప్రమాణాలు సాధించడంతోపాటు ప్రైవేట్ రంగంలోని విద్యార్థులని ప్రభుత్వ పాఠశాలల్లోకి ఆకర్షించిన తీరు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు కనువిప్పు కావాలి. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడంతో పాటు పాఠశాలల్లో సకల సౌకర్యాలు కల్పించి ఉపాధ్యాయులకు అంతర్జాతీయ స్థాయిలో శిక్షణ ఇప్పించి ప్రతి పాఠశాలలో ఆరోగ్య సిబ్బందిని నియమించడం ద్వారా విద్యార్థులకు ఆరోగ్య సేవలను అందించిన తీరు చిరకాలం గుర్తుండిపోతుంది. ఆ విధానాన్ని కేంద్ర రాష్ట్రాలు ఆచరిస్తే మంచిది.

## టంగుటూరు శంకర్‌పల్లి పీహెచ్‌సీల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మలేరియా దినోత్సవ అవగాహన ర్యాలీ

**పాల్గొన్న చేవెళ్ల డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీనివాస్..**

**ప్రజలకు పరిశుభ్రతపై సూచనలు**




**శంకర్‌పల్లి ఏప్రిల్ 25 :-**అంతర్జాతీయ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని శంకర్‌పల్లి టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆధ్వర్యంలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమం శంకర్‌పల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రేవతి ఆధ్వర్యంలో జరిగింది. ఈ ర్యాలీలో చేవెళ్ల డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రజలకు మలేరియా నివారణపై అవగాహన కల్పించారు. ప్రజలు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నిల్వ నీటితో దోమలు వ్యాప్తి చెందుతూ మలేరియా వంటి వ్యాధులు వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో టంగుటూరు పీహెచ్‌ఎన్ శ్రీమతి శాంతకుమారి, ఎంపీహెచ్‌ఎస్ విజయలక్ష్మి, టంగుటూరు పీహెచ్‌సీ సిబ్బంది, శంకర్‌పల్లి ఆసుపత్రి సూపర్వైజర్ సిబ్బంది, ఎంపిహెచ్‌ఈ (ఎం), ఎంపిహెచ్‌ఈ (ఎఫ్), ఆశా వర్కర్లు పాల్గొన్నారు. ర్యాలీ ద్వారా మలేరియా నివారణ చర్యలు, దోమల నివారణ పద్ధతులపై ప్రజలకు అవగాహన కల్పించారు.




## రెండు కేసులలో భారీ గంజాయి పట్టివేత



**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా క్రైమ్ బ్యూరో ఏప్రిల్ 25** హఫీజ్‌పేట్ కొండాపూర్ రోడ్డులో ఎస్టీఎఫ్ డీ టీమ్ సీఐ నాగరాజు సిబ్బంది కలిసి గంజాయి అమ్మకాలు జరుగుతున్నాయనే సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 3.83 కేజీల గంజాయి పట్టుబడింది. ఈ కేసులో జుట్టు సంజీవ అనే వ్యక్తి అరెస్టు చేశారు. ఆతడి రాయల్ ఎన్‌ఫీల్డ్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని, గంజాయిని కొండాపూర్ ఎక్సైజ్ స్టేషన్ లో అప్పగించారు.

**మరో కేసులో 340 గ్రాముల గంజాయి పట్టివేత..** బాలనగర్ ఎక్సైజ్ పరిధిలో గంజాయి అమ్మకాలు జరుగుతున్నాయనే సమాచారం మేరకు ఎస్టీఎఫ్ సీ టీం సిఐ వెంకటేశ్వర్లు సిబ్బంది 340 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఈ సాయినాథ్, ఎస్.పింకిలను అరెస్టు చేశారు. నిందితులను, గంజాయిని బాలనగర్ ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగింబచారు.



## సింహపురి కాలనీ లోని పార్కుల అక్రమాన


**నెలలు గడుస్తున్నావ్ పట్టించుకోని సంబంధిత అధికారులు**

**ఆర్టిఐ ద్వారా ఆక్షన్ టేకెన్ రిపోర్ట్ అడిగిన ఇవ్వకపోవడం?**

**అధికారుల నిర్లక్ష్య వైఖరి అక్రమాలకు పరోక్ష మద్దతు?**




**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 25** దుండిగల్ సర్కిల్ పరిధి సింహపురి కాలనీ లోని పార్కుల అక్రమాలపై 11-03-2026న ఫిర్యాదు చేయడం జరిగిందని ఆకుల సతీష్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫిర్యాదు చేసినప్పటి నుండి నెలలు గడిచినా సంబంధిత అధికారులు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది అని అన్నారు. ఈ అంశంపై సమాచారం కోసం ఆర్‌టీఐ దాఖలు చేయగా, స్పష్టమైన సమాధానం ఇవ్వకుండా డొంక తిరుగుడు రీతిలో స్పందించడం ద్వారా అధికారులు తమ బాధ్యతను తప్పించుకుంటున్నారని స్పష్టమవుతోంది అని తెలిపారు. ఈ విధమైన నిర్లక్ష్య వైఖరి అక్రమాలకు పరోక్ష మద్దతుగా భావించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పార్కుల పరిరక్షణపై తక్షణ చర్యలు తీసుకోవాలని, చర్యలు తీసుకోకుండా, సహకరించడమే కాకుండా, ఆర్టిఐ ద్వారా ఆక్షన్ టేకెన్ రిపోర్ట్ అడిగిన ఇవ్వకుండా, తప్పించుకోవడానికి ఆర్టిఐ చట్టానికి తూట్లు పొడిస్తే ఆర్టిఏ కమిషనర్ కి ఆ పిల్లలారా సమాచారం రాబట్టడమే కాకుండా నష్టపరిహారం కూడా చెల్లించాలని డిమాండ్ చేశారు. అధికారుల నిర్లక్ష్యాన్ని ఇకపై సహించబోమని ప్రస్తుతం చేస్తూ ఈ సమస్యకు సరైన పరిష్కారం వచ్చే వరకు మా పోరాటం నిరంతరం కొనసాగుతుందన్నారు.






## గంజాయి, డ్రగ్స్ పట్టుకున్న ఎక్సైజ్ టీమ్‌లకు నగదు ప్రొత్సహాకాలు

**బాగా పని చేయండి.. ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్‌కు గౌరవం తీసుక రండి**

**ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం చేతుల మీదుగా ప్రధానం**

**సిటీ బ్యూరో ఏప్రిల్ 25 :-** ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీములు బాగా పని చేసి ఎక్సైజ్ శాఖకు మంచి పేరు తీసుక రావాలని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం పిలుపు నిచ్చారు. గంజాయి, డ్రగ్స్ పట్టుకున్న 20 ఎక్సైజ్ టీమ్‌లకు ఆబ్కారీ భవన్ లోని డైరెక్టర్ చాంబరులో శనివారం నగదు ప్రొత్సహాకాలను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం చేతుల మీదుగా ప్రధానం చేశారు. ఖమ్మం జిల్లాలో ఖమ్మం టూ స్టేషన్‌లో 30.96 కేజీలు, ఖమ్మం వన్ స్టేషన్‌లో 23.6 కేజీలు, మధిరలో 22 కేజీలు, కొత్తగూడెం భద్రాచలంలో 43 కేజీలు, 30.6 కేజీలు,24.9 కేజీలు, 23.8 కేజీలు, 21.3 కేజీలు, 20.8 కేజీలు మొత్తంగా 265.96 కేజీలు గంజాయి పట్టుకున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్‌లకు, ఎక్సైజ్ సిబ్బంది నగదు బహుమతి అందించారు. ధూళ్‌పేట్‌లో 21.425 కేజీల, హైదరాబాద్‌లో 1920 కేజీల గంజాయి చాక్లెట్లు కేసుల్లో ఆయా టీమ్ డైరెక్టర్ నగదు ప్రొత్సహాకాలు ఇచ్చారు. మొత్తం 12 గంజాయి కేసుల్లోను 8 డ్రగ్స్ కేసుల్లో నగదు రివార్డులు అందించారు. సంగారెడ్డిలోని జాహీరాబాద్‌లో 46.020 కేజీల నిట్రా జిప్సమ్, నిజామాబాద్‌లో 2.020 కేజీల ఓపీఎం, నిజామాబాద్‌లో 609 గ్రాముల ఆల్ఫోజోలం, కాచిగూడలో 113 ఎలఎస్‌డి బాస్ట్స్, చార్మినార్‌లో 1920 కేజీల గంజాయి చాక్లెట్లు, నారాయణగూడలో 33.3 గ్రాముల కోకైన్, ఆమీర్‌పేట్‌లో 14.83 ఎండిఎంఎ, ధూల్‌పేట్‌లో 12.29 గ్రాముల ఎండిఎంఎ కేసుల్లో నగదు ప్రోత్సహాక రివార్డులు అందించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ జాయింట్ కమిషనర్ అంజన్‌రావు, డిప్యూటివ కమిషనర్ ప్రణవీలు ఖమ్మం అసిస్టెంట్ కమిషనర్ జి.గణేష్, ఎన్‌ఫోర్స్‌మెంట్, డీటీఎఫ్,ఎక్సైజ్ టీమ్‌ల సీఐలు సిబ్బంది పాల్గొన్నారు.



## జీడిమెట్ల సర్కిల్ లో స్వయం సహాయక బృందాలకు చెక్కుల పంపిణీ



**కుత్బుల్లాపూర్ ఏప్రిల్ 25 :-** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అమలు చేస్తున్న 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో 51వ రోజు స్వయం సహాయక బృందాల-బ్యాంకు అనుసంధాన కార్యక్రమం సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి కుత్బుల్లాపూర్ జోన్ లోని జీడిమెట్ల సర్కిల్ సి.ఎం.సి పరిధిలో శనివారం స్వయం సహాయక బృందాలకు చెక్కులను పంపిణీ చేయడం జరిగినది. 284- గణేశ్ నగర్ - (4) గ్రూప్స్ కు 80.00 లక్షలు, 285-పద్మ నగర్ - (2) గ్రూప్స్ కు 40.00 లక్షలు, 286-కుత్బుల్లాపూర్ -(3) గ్రూప్స్ కు 60.00 లక్షలు, 287-పేట్ బషీరాబాద్- (1) గ్రూప్స్ కు 20.00 లక్షలు మొత్తం 2.00 కోట్లు పంపిణీ చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్, డి. శంకర్ సింగ్ డెప్యూటీ కమిషనర్, జీడిమెట్ల సర్కిల్, కుమారి లావణ్య డెప్యూటీ కమిషనర్, చింతల్ సర్కిల్, ఇంద్రసేన, ప్రాజెక్టు ఆఫీసర్, జీడిమెట్ల సర్కిల్, యు సి డి సిబ్బంది పాల్గొన్నారు.

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయము తోనే సమగ్ర క్రీడాభివృద్ధి : శ్రీనగర్ లో మంత్రి వాకిటి శ్రీహరి

**స్పోర్ట్స్ బ్యూరో ఏప్రిల్ 25 :-** క్రీడల అభివృద్ధి కేవలం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రమే కాకుండా ప్రజల భాగస్వామ్యంతో పాటు క్రీడా సంఘాలు, వివిధ స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ సంస్థలు సమిష్టిగా కృషి చేసినప్పుడే సమగ్ర క్రీడాభివృద్ధి సాధ్యమవుతుందని తెలంగాణ రాష్ట్ర యువజన క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. శనివారం నుండి మూడు రోజులపాటు జమ్మూ కాశ్మీర్ రాష్ట్రంలో శ్రీనగర్ లో జరుగుతున్న చింతన్ శిబిర్ 2026కు తెలంగాణ నుండి క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి( క్రీడలు) జయేశ్ రంజన్, క్రీడా సలహాదారులు ఏపీ జితేందర్ రెడ్డి, చైర్మన్ శివసేనారెడ్డి, ఎండి డాక్టర్ సోనీ బాలాదేవి, ప్రముఖ క్రీడాకారులు పుల్లెల గోపీచంద్, గగన్ నారంగ్ తదితరులు హాజరయ్యారు. శ్రీనగర్ లోని షేర్- ఏ -కాశ్మీరి ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ సెంటర్ ప్రాంగణంలో శనివారం ఉదయం యోగాతో ప్రారంభమైన ఈ కార్యక్రమాల్లో ఖేలో ఇండియా మిషన్ -మెడల్ స్ట్రాటజీ, ఖేలోభారత్ నీతి-కేంద్ర, రాష్ట్రాల సమన్వయం స్వచ్ఛత, సురక్ష క్రీడలు ప్రతిభ గుర్తింపు, అభివృద్ధి అంశాలపై చర్చ జరిగింది. తెలంగాణ ప్రభుత్వం తరపున మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ దేశంలో మంచి, బలమైన క్రీడా వాతావరణం నిర్మాణం జరగాలంటే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమిష్టిగా కృషి చేయాలని, దేశానికి కీర్తి ప్రతిష్టలు తెచ్చే విధంగా భవిష్యత్తు కార్యాచరణ ఉండాలని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం గత రెండున్నర సంవత్సరాలుగా ఒకవైపు కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాలను రాష్ట్రంలో దిగ్విజయంగా అమలు చేస్తూనే, దేశానికి కీర్తి ప్రతిష్టలు తెచ్చే అనేక కార్యక్రమాలను రూపొందించి బ్రహ్మాండంగా నిర్వహిస్తుందని మంత్రి వివరించారు. హైదరాబాద్ అంటేనే ఆటలకు మారుపేరుగా తీర్చిదిద్దాలన్న సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనల మేరకు క్రీడా శాఖ అనేక వినూత్నకార్యక్రమాలు రూపొందించిందని, గ్రామీణ స్థాయి నుండి క్రీడా ప్రతిభను గుర్తించి ప్రోత్సహించే విధంగా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అందుకు రెండు దఫాలుగా నిర్వహించిన సీఎం కప్ 2024, 2025లు ఉదాహరణ అని మంత్రి తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఖేలో ఇండియా కార్యక్రమాలను, జాతీయ క్రీడా దినోత్సవంను "సండే ఆన్ సైక్లింగ్" ఒలంపిక్స్ విజేతలను గుర్తించే కార్యక్రమాలను తెలంగాణ రాష్ట్రం దిగ్విజయంగా ముందుకు తీసుకెళ్తుందని మంత్రి వివరించారు. ఈ కార్యక్రమంలో క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరితో పాటు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, క్రీడల సలహాదారులు ఏపీ జితేందర్ రెడ్డి స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి ఎండి డాక్టర్ సోని బాలాదేవి, క్రీడా ప్రముఖులు పుల్లెల గోపీచంద్ గగన్ నారాయణ స్పోర్ట్స్ అథారిటీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రవితేజ తదితరులు ఈ శిబిరంలో తెలంగాణ తరపున పాల్గొంటున్నారు.




## ఘనంగా ముగిసిన కందుల కూచిపూడి నాట్యాలయం, శిల్పారామం నృత్య సమ్మేళనం

**మాదాపూర్ ఏప్రిల్ 25 :-** మాదాపూర్ లోని శిల్పారామం లో కందుల కూచిపూడి నాట్యాలయం, శిల్పారామం ఆధ్వర్యంలో నృత్య సమ్మేళనం 2026 శనివారం అంఫిథియేటర్ లో రెండు రోజుల ఉత్సవం ఘనంగా ముగిసింది. భారతీయ శాస్త్రీయ నృత్య సంప్రదాయాల వైభవాన్ని ప్రతిబింబించే అద్భుత సాంస్కృతిక మహోత్సవం లో రెండవ రోజు కుమారి దివిజ, కుమారి వైష్ణవి కూచిపూడి నృత్యం, బెంగళూరు నుండి విచ్చేసిన మోహినియాట్టం కళాకారిణి డాక్టర్ హనీ ఉన్నికృష్ణన్, ఇంఫాల్ నుండి విచ్చేసిన మణిపురి కళాకారులూ గోపాల్ సింగ్, ఝార్ఖండ్ నుండి విచ్చేసిన కథక్ కళాకారులూ త్వరిత సర్కార్, రవి, ఇందిరా పరాశరం శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శనలు అలరించాయి. రెండు రోజుల ఉతసవంలో దేశం నలుమూలల నుండి వచ్చిన ప్రతిభావంతులైన కళాకారులు పాల్గొనడం తమ అద్భుత నృత్య ప్రదర్శనలతో ప్రేక్షకులను అలరించారు. భారతీయ శాస్త్రీయ నృత్యరూపాలు ఈ వేదికపై సజీవంగా ఆవిష్కృతం చేశారు. ఈ మహోత్సవానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ గురువులు పసుమర్తి శేషు బాబు, వేదాంతం విదుమౌళి, కుమారి కొక విజయలక్ష్మి, మిమిక్రీ ఆర్టిస్ట్ మధుసూదన్, ఇందిరా పరాశరం లు విచ్చేసి కళాకారులను అభినందించారు. ఈ నృత్య సమ్మేళనం యువ కళాకారులకు తమ ప్రతిభను ప్రదర్శించే వేదికగా నిలవడంతో పాటు, భారతీయ నాట్య సంప్రదాయాల పరిరక్షణకు ముఖ్యమైన పాత్ర పోషిస్తోంది. ఈ సందర్భంగా కందుల కూచిపూడి నాట్యాలయం వ్యవస్థాపక అధ్యక్షులు గురు రవి కూచిపూడి మాట్లాడుతూ ఈ నృత్య సమ్మేళనాన్ని నిర్వహించడం తనకు ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఈ మహోత్సవానికి సహకారం అందించి, ప్రోత్సహించిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే వేదికను అందించిన శిల్పారామం యాజమాన్యానికి, తోటి కళాకారులందరికీ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.



# జర్నలిస్టులు ఆరోగ్య శిబిరాలను తప్పక వినియోగించుకోవాలి






## మెగా హెల్త్ క్యాంప్ ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి

**హైదరాబాద్ జిల్లా బ్యూరో ఏప్రిల్ 25 –** జర్నలిస్టులు ఆరోగ్య శిబిరాలను తప్పక సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ హరి చందన దాసరి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా జిల్లాస్థాయి జర్నలిస్టులకు బల్కంపేట నేచర్ క్యూర్ ఆసుపత్రి నందు సమాచార పౌర సంబంధాల శాఖ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా హెల్త్ క్యాంప్ ను అదనపు కలెక్టర్ జితేందర్ రెడ్డి తో కలసి కలెక్టర్ ప్రారంభించారు. జర్నలిస్టుల ఆరోగ్య పరిరక్షణ ధ్యేయంగా జర్నలిస్టుల కోసం ప్రత్యేకంగా ఇలాంటి సమగ్ర ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించిన డిపిఆర్ఓ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వారి సిబ్బందిని ఈ సందర్భంగా అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం కేవలం ఆరోగ్య శిబిరం మాత్రమే కాదు, సమాజంలో అలాగే ప్రజాస్వామ్యంలో జర్నలిస్టులు చేస్తున్న అమూల్యమైన సేవలకు గుర్తింపుగా నిలుస్తోందని, జర్నలిస్టు సోదరులు ప్రభుత్వానికి అటు ప్రజలకు వారధిగా నిలుస్తారని తెలిపారు. జిల్లా స్థాయిలో మీడియా అకాడమీ ద్వారా 94 మంది జర్నలిస్టుల కుటుంబాలకు లక్ష చొప్పున ఆర్థిక సహాయం అందించడం తో పాటు17 మందికి అనారోగ్యం, శారీరక వైకల్యం సందర్భాల్లో రూ.50 వేల చొప్పున ఆర్థిక సహాయం చేయడం జరిగిందని, మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు ప్రతి నెల రూ.3 వేల పెన్షన్ అందచేయడం తోపాటు మరణించిన జర్నలిస్టుల పిల్లలకు ఎల్‌కేజీ నుండి పదో తరగతి వరకు నెలకు వెయ్యి చొప్పున ట్యూషన్ ఫీజులు అందించనున్నామని తెలిపారు. జర్నలిస్టుల ఆరోగ్య పథకం కింద 2022 సంవత్సరం నుండి 2026 వరకు 5,266 ఆరోగ్య కార్డులు జారీ చేయడంతో 1,922 కుటుంబాలకు వైద్య సేవలు అందుతున్నాయని అన్నారు. అలాగే 1,230 మంది జర్నలిస్టులకు ఉచిత బస్సు పాసులు వినియోగించుకుంటున్నారని, తెలంగాణ మీడియా అకాడమీ ద్వారా జర్నలిస్టులకు శిక్షణ, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. అనంతరం పలు వైద్య విభాగాలను సందర్శించి కలెక్టర్ కంటి పరీక్షలు చేయించుకున్నారు. జర్నలిస్టులందరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండే విధంగా ఇలాంటి అవకాశాన్ని తప్పక సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ హెల్త్ క్యాంపులో జర్నలిస్టులు అధిక సంఖ్యలో పాల్గొని వైద్య వివిధ రకాల పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ భాను కిరణ్, తాసిల్దార్లు డి.రత్నం, ప్రేమ్ కుమార్, నేచర్ క్యూర్ ఆసుపత్రి పర్యవేక్షకులు డాక్టర్ శ్యామల, డి ఎం ఓ వెంకటేశ్వర్లు, కిమ్స్, షంషైన్ ఆస్పత్రుల వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# మే 10 వరకు స్వీయ జనగణన నమోదు అవకాశం

## ప్రజలు ముందుండి వివరాలు నమోదు చేసుకోవాలి: మున్సిపల్ కమిషనర్ యోగేష్



**శంకర్ పల్లి ఏప్రిల్ 25 :–**నేటి నుండి మే 10వ తేదీ వరకు స్వీయ జనగణన నమోదు కార్యక్రమం అందుబాటులో ఉంటుందని శంకర్ పల్లి మున్సిపల్ కమిషనర్ యోగేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జనగణన సమయంలో ప్రభుత్వ ఉద్యోగి ఇంటికి వచ్చి వివరాలు అడిగే వరకు వేచి ఉండకుండా, ప్రజలు స్వయంగా ఆన్‌లైన్ నమోదు వేదిక ద్వారా తమ కుటుంబ వివరాలను నమోదు చేసుకోవచ్చని తెలిపారు. కుటుంబ సభ్యుల వివరాలు, నివాస సమాచారం తదితర అంశాలను ప్రజలు స్వయంగా నమోదు చేసుకునే ఈ విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. పట్టణ పరిధిలోని ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు, ప్రభుత్వ ఉద్యోగులు, మహిళా సంఘాల సభ్యులు, పట్టణ ప్రజలు అందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ప్రకటనలో కోరారు.

# వ్యవసాయ కార్మికుల సంక్షేమానికి సమగ్ర చట్టం చేయాలి.

## ఆధార్ బేస్ట్ పేమెంట్ రద్దు చేసి పెండింగ్ బకాయిలు విడుదల చేయాలి.



**డోర్నకల్ ఏప్రిల్ 25** వ్యవసాయ కార్మికుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం సమగ్రమైన శాసనం తీసుకురావాలని, రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రత్యేక చట్టం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి. నాగయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం మహబూబాబాద్‌లో జరిగిన సంఘం జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సమావేశానికి జిల్లా ఉపాధ్యక్షులు ఎండి. యాకూబ్ అధ్యక్షత వహించారు.

ఈ సందర్భంగా నాగయ్య మాట్లాడుతూ వ్యవసాయ కార్మికుల సంక్షేమం కోసం ఎన్నో ఏళ్లుగా సంఘం ఆధ్వర్యంలో పోరాటం కొనసాగుతోందన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఈ అంశాన్ని పరిశీలిస్తామని చెప్పి చట్టం చేయకుండా కాలయాపన చేసిందన్నారు. 1974లో కేరళలో వామపక్ష పార్టీల కృషితో వ్యవసాయ కార్మికుల సంక్షేమానికి సమగ్ర చట్టం అమల్లోకి వచ్చిందని గుర్తు చేశారు. ప్రస్తుతం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఈ అంశాన్ని పట్టించుకోవడం లేదని విమర్శించారు.ఉపాధి హామీ కూలీలకు అమలు చేస్తున్న ఆధార్ బేస్డ్ పేమెంట్ విధానాన్ని రద్దు చేయాలని, గ్రామీణ ఉపాధి పనులను పట్టణ ప్రాంతాలకు విస్తరించాలని, పని దినాలను 200 రోజులకు పెంచాలని, రోజువారీ కూలీని రూ.600లకు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు.జిల్లా కార్యదర్శి వీరయ్య మాట్లాడుతూ జిల్లాలో గత మూడు నెలలుగా ఉపాధి హామీ కూలీల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. మండల, జిల్లా అధికారులకు పలుమార్లు విన్నవించినా స్పందన లేదని తెలిపారు. ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శులు గొడిశాల వెంకన్న, వంగూరు వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షురాలు కే. చంద్రకళ, జిల్లా నాయకులు గుండగాని మధుసూదన్, గంధసిరి శ్రీనివాస్, పాల్వాయి దుర్గయ్య, పురుషోత్తం, రవి, లక్ష్మి, వెంకన్న పాల్గొన్నారు.

# చంచల్‌గూడ ఖైదీలకు న్యాయ అవగాహన కల్పించిన జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ పి.అరుణ కుమారి

**హైదరాబాద్ జిల్లా బ్యూరో ఏప్రిల్ 25 –**

జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ పి.అరుణ కుమారి హైదరాబాద్ లోని చంచల్‌గూడ జైలును సందర్శించారు. ఈ సందర్భంగా ఖైదీలకు న్యాయ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయం, బెయిల్ విధానం, లోక్‌అదాలత్ ప్రయోజనాలు, న్యాయ సేవల గురించి సమగ్రంగా వివరించారు. ఖైదీలు తమ సమస్యలను న్యాయపరంగా ఎలా పరిష్కరించుకోవాలో మార్గదర్శనం ఇచ్చారు. ఉచిత న్యాయ సహాయం పొందడానికి అర్హతలు, దరఖాస్తు విధానం వివరించారు. అండర్‌ట్రయల్ ఖైదీలు త్వరితగతిన కేసుల పరిష్కారం కోసం తీసుకోవాల్సిన చర్యలను తెలియజేశారు. మహిళా ఖైదీలకు ప్రత్యేకంగా లభించే న్యాయ రక్షణలు, సంక్షేమ పథకాలను వివరించారు. బాలలతో ఉన్న మహిళా ఖైదీలకు అందుబాటులో ఉన్న సదుపాయాలపై సమాచారం ఇచ్చారు. లోక్‌అదాలత్ ద్వారా తక్కువ సమయంలో కేసులు పరిష్కరించుకునే అవకాశాలను వివరించారు. ఖైదీల కుటుంబ సభ్యులతో సంబంధాలు కొనసాగించడానికి ఉన్న చట్టపరమైన హక్కులను తెలియజేశారు. ఖైదీలు జైలు శిక్షలో ఉన్నప్పటికీ మానవ హక్కులు కాపాడబడతాయని స్పష్టం చేశారు. జైలు పరిపాలనలో ఉన్న ఫిర్యాదు పరిష్కార వ్యవస్థపై అవగాహన కల్పించారు. న్యాయ సేవల అథారిటీ ద్వారా నిర్వహించే కౌన్సెలింగ్, పునరావాస కార్యక్రమాల గురించి వివరించారు. విడుదల అనంతరం పునరావాసానికి అందించే సహాయం పై సమాచారం అందించారు.



ఈ–కోర్ట్స్ సేవలు, లీగల్ ఎయిడ్ క్లినిక్స్, పరోల్, రిమిషన్ విధానాలపై కూడా వివరించారు. సందర్శన లో భాగంగా ఖైదీలతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలను స్వీకరించారు. ఖైదీలు ఎదుర్కొంటున్న న్యాయ, వ్యక్తిగత సమస్యలపై స్పందించి, వాటి పరిష్కారానికి తగిన సూచనలు చేశారు. ఖైదీలు ఆసక్తిగా పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. జైలు అధికారులు ఈ కార్యక్రమానికి పూర్తి సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో జైలు అధికారులు ఎన్ శివకుమార్, జైలు సూపరింటెండెంట్ కాలిదాస్, డిప్యూటీ సూపరింటెండెంట్ లు విజయకుమార్,

రామకృష్ణ రెడ్డి, జైలర్ మహిళా ఖైదీల డిప్యూటీ సూపరింటెండెంట్ అమరావతి తదితరులు పాల్గొన్నారు.

# హామీ నిలబెట్టుకున్న అధికార పార్టీ నాయకులు



**రామగిరి ఏప్రిల్ 25 –**స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా గ్రామస్తులకు ఇచ్చిన హామీని అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు నిలబెట్టుకున్నారు. రామగిరి మండలం రత్నాపూర్ పంచాయతీ పరిధి రాంనగర్ లో స్థానిక ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులకు స్థానికులు తమ ఇండ్లపై కరెంటు లైన్లు ఉన్నాయని వాటి వల్ల చాలా ఇబ్బంది పడుతున్నామని వివరించగా ఈ విషయాన్ని మంత్రి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్ రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు వెంటనే స్పందించి కరెంటు అధికారులకు సమస్యను గురించి వివరించారు. దీంతో అధికారులు ఇక్కడికి వచ్చి కరెంటు లైన్ ను పరిశీలించి ఎస్టిమేషన్ వేసుకొని పనులు చేపడుతున్నారు. కరెంటు లైన్లను నూతనంగా నిర్మించడానికి పనులు జరుగుతున్న క్రమంలో పనులను శనివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మంథనిబ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్, మండల అధ్యక్షుడు రొడ్డ బాపన్న, బీసీ సెల్ అధ్యక్షుడు బండారి సదానందం, మాజీ సర్పంచ్ ఎల్లే రామ్మూర్తి, రత్నపూర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# జనగణన2027 స్వీయ లెక్కింపునకు శ్రీకారం

## ఏప్రిల్ 26 నుంచి మే 10 వరకు కుటుంబ వివరాల నమోదు ప్రజలు తప్పనిసరిగా పాల్గొని ఖచ్చితమైన సమాచారం అందించాలి : జిల్లా కలెక్టర్

**శంకర్ పల్లి ఏప్రిల్ 25** భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో పనిచేస్తున్న జనగణన కమిషనర్ కార్యాలయం జనగణన2027లో భాగంగా స్వీయ లెక్కింపు కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ విధానం ద్వారా ప్రజలు తమ కుటుంబ వివరాలను ప్రత్యేకంగా రూపొందించిన అంతర్జాల వేదిక ద్వారా స్వయంగా నమోదు చేసుకునే అవకాశం కల్పించబడింది. దీనివల్ల గణనలో ఖచ్చితత్వం పెరగడంతో పాటు మానవ తప్పిదాలు తగ్గే అవకాశం ఉంది. ఈ స్వీయ లెక్కింపు సౌకర్యం ఏప్రిల్ 26, 2026 నుంచి మే 10, 2026 వరకు అందుబాటులో ఉంటుంది. జిల్లాలో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసింది. గ్రామాలు, వార్డులు, పట్టణ ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టనున్నారు. ప్రజలకు సౌలభ్యం కల్పించేందుకు గ్రామ సచివాలయాలు, వార్డు కార్యాలయాలు మరియు ఇతర ప్రజా సేవా కేంద్రాల్లో సహాయ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. అదేవిధంగా సామాజిక మాధ్యమాలు, పత్రికలు, దూరదర్శన్ ప్రసారాలు మరియు ఇతర ప్రచార మార్గాల ద్వారా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు.జిల్లా కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ ప్రతి కుటుంబం తమ వివరాలను ఖచ్చితంగా నమోదు చేసుకోవాలని కోరారు. సరైన సమాచారం అందించడం ద్వారా ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి ప్రణాళికలు రూపొందించడంలో ప్రభుత్వానికి ఉపయోగపడుతుందని తెలిపారు. అలాగే జనగణన అధికారులు, జిల్లా, విభాగ, మండల స్థాయి అధికారులు మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేసి ప్రజల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి పౌరుడు ఈ అవకాశాన్ని వినియోగించుకుని నిర్దేశిత గడువులోగా స్వీయ లెక్కింపు పూర్తి చేయాలని జిల్లా పరిపాలన కోరింది.

# ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని సందర్శించిన డిఆర్డిఓ

**రామగిరిఈఏప్రిల్ 25–**రామగిరి మండలం కల్వచర్ల లో మహిళల సాధికారతను లక్ష్యంగా తీసుకుని నిర్వహిస్తున్న అర్ఎస్కే ఆపన్న హస్తం ఆధ్వర్యంలో ఇంద్రాణి ఎంటర్‌ప్రైజెస్ కుట్టు మిషన్ ఉచిత శిక్షణ కేంద్రాన్ని శనివారం డిఆర్డిఓ కాలిందిని సందర్శించారు. మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తూ, స్వయం సమృద్ధి దిశగా తీసుకెళ్తున్న ఈకార్యక్రమాన్ని ఆమె అభినందించారు. ఈ శిక్షణ ద్వారా మహిళలు స్వయం ఉపాధి సాధించేందుకు ముందుకు రావాలని, ఇలాంటి కార్యక్రమాలు గ్రామీణాభివృద్ధికి దోహదపడతాయని ఆమె పేర్కొన్నారు. ఈ సేవా కార్యక్రమాన్ని గత నాలుగు సంవత్సరాలుగా నిరంతరం ఉచితంగా నిర్వహిస్తున్న సర్పంచ్ రేండ్ల శారదను అమే ప్రత్యేకంగా అభినందించి, సేవలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బద్రి శైలజా రాణి, ఏపీఓ మౌనిక, అగ్రికల్చర్ సీసీ శ్రీధర్, ఏపీఎం దొమ్మటి పద్మ తదితరులు పాల్గొన్నారు.



# రాఘవ్ చద్దాకు 24 గంటల్లో 10 లక్షల మంది ఫాలోవర్లు తగ్గారు!



ఆమ్ ఆద్మీ పార్టీని వీడి బీజేపీలో చేరతానని ప్రకటించడం ద్వారా రాఘవ్ చద్దా జాతీయ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టించారు. అయితే ఈ ప్రకటన తర్వాత ఆయనకు సామాజిక మాధ్యమాల్లో ఫాలోవర్లు తగ్గిపోయారు. పార్టీ మారుతున్నట్లు ఆయన ప్రకటించిన 24 గంటల్లో సోషల్ మీడియాలో ఆయన ఫాలోయింగ్ తగ్గిపోయింది.రాఘవ్ చద్దాకు నిన్నటి వరకు ఇన్‌స్టాగ్రామ్‌లో 14.6 మిలియన్ల ఫాలోవర్లు ఉన్నారు. కానీ ఈరోజు మధ్యాహ్నానికి ఆ సంఖ్య 13.5 మిలియన్లకు తగ్గింది. ఇటీవల లోక్ సభలో ఆయన సంధించిన ప్రశ్నలతో ఫాలోవర్ల సంఖ్య పెరిగింది. కానీ గత ఇరవై నాలుగు గంటల్లో మాత్రం ఒక్కసారిగా తగ్గిపోయింది. రాఘవ్ చద్దాకు 24 గంటల్లో 10 లక్షల మంది ఫాలోవర్లు తగ్గిపోవడంపై ఎన్సీపీ(శరద్ పవార్) అధికార ప్రతినిధి అనీశ్ గవాండే స్పందించారు. ఇంటర్నెట్ మిమ్మల్ని రాత్రికి రాత్రే హీరోగా మార్చగలదు, అలాగే రాత్రికి రాత్రే మిమ్మల్ని సున్నాకు కూడా పడేయగలదని ట్వీట్ చేశారు.

# నిజాయితీ చాటుకున్న లాండ్రీ షాప్ యజమాని

**రామగిరి ఏప్రిల్ 25 –** రామగిరి మండలం సెంటినరీ కాలనీలోని శ్రీలక్ష్మి చికెన్ సెంటర్, లాండ్రీ షాప్ యజమాని బండి మొండయ్య తన వద్దకు ఇస్త్రీ కోసం వచ్చిన బట్టలలో కొరికిన నగదును బట్టల యజమానికి అందించి తన నిజాయితీని చాటుకున్నారు. సెంటినరీ కాలనీకి చెందిన సింగరేణి కార్మికుడు మహమ్మద్ గులాం షమీ తన బట్టలు ఇస్త్రీ చేసుకోవడానికి శ్రీ లక్ష్మీ చికెన్ సెంటర్ అండ్ లాండ్రీ షాప్ కు వచ్చి లాండ్రీ షాపు యజమాని బండి మొండయ్యకు ఇచ్చి వెళ్ళాడు. అనంతరం మొండయ్య బట్టలు ఇస్త్రీ చేయడానికి ఓపెన్ చేయగా ప్యాంటు జేబులో రూ 40 వేల రూపాయలు ఉండగా తక్షణమే బట్టలు ఇచ్చిన 'షమీని' అదేవిధంగా స్థానిక బిఆర్ఎస్ నాయకుడు బూరుగు రాజు గౌడ్ ను పిలిచి షమీకి 40 వేల రూపాయలు అందజేశాడు. ఈ సందర్భంగా బూరుగు రాజు మాట్లాడుతూ ఈరోజుల్లో పది రూపాయల నోటు కనబడితే ఎవరు చూడకుంటే తీసి జేబులో వేసుకుంటారని, అలాంటిది బండి మొండయ్య నిజాయితీకి నిలువుటద్దం లాంటివారని అదేవిధంగా సెంటినరీ కాలనీలో గత మూడు దశాబ్దాలుగా ఆయన సేవలు అందిస్తున్నారని, పేదవాడైనప్పటికీ నిజాయితీగా ఉండడం గొప్పతనం అని ప్రశంసించారు. బండి మొండయ్యను నాయకులతోపాటు రామగిరి వర్తక సంఘం అధ్యక్షుడు ఆకుల నారాయణ అభినందించారు.



# పాంచజన్యం పూరించిన కవిత !

కల్వకుంట్ల కవిత..ఈ పేరు పెద్దగా పరిచయం అక్కర్లేదు. తెలంగాణలో కవిత అంటే బతుకమ్మ అన్న స్థాయిలో ప్రాచుర్యం పొందారు. తెలంగాణ సంస్కృతిని ప్రపంచవ్యాప్తంగా దివిటీ పట్టి వెలగించారు. తండ్రి కెసిఆర్ ఒడిలో రాజకీయ ఓనమాలు దిద్దుకున్న కవిత..ఇవాళ తండ్రి పార్టీని ధిక్కరించి.. తండ్రినే ఎదిరించి.. నిలదీసే స్థాయిలో..కొత్తగా పార్టీని ప్రకటించి పాంచజన్యం పూరించారు. ఒక్కరోజు తేడాలో పాత టిఆర్ఎస్ అవిర్భావ దినోత్సవం జరుగనుంది. దానికి రెండ్రోజుల ముందు కవిత తన పార్టీ కోసం ఎంచుకున్న తేదీ యాదృచ్ఛికం కాకపోయినా...ముహూర్త బలం ఉండేవుంటుంది. ఓ మహిళగా కవిత మహిళా లోకానికి బాగా తెలుసు. బతుకమ్మతో తెలంగాణ సంస్కృతిని ప్రపంచానికి చాటారు. తెలంగాణ ఉద్యమం లో మమేకం అయ్యారు. తెలంగాణ ఏర్పడితే అందరూ బాగుపడతారని నమ్మి అంతా కెసిఆర్ జెండా మోసారు. కానీ తెలంగాణ ఆగమయ్యింది. కెసిఆర్ కుటుంబం బాగుపడ్డది. అవినీతిలో ఆరితేరారు. లక్షల కోట్లు వెనకేసుకున్నారు. ఈ అవినీతి, తెలంగాణ ఆకాంక్షలను పక్కదారి పట్టించిన తీరుతోనే కెసిఆర్ పార్టీని ప్రజలు బొందపెట్టారు. టిఆర్ఎస్‌ను బిఆర్ఎస్‌గా మార్చాక ఉన్న పేగుబంధం కూడా తెగిపోయింది. బిఆర్ఎస్ అవినీతిని ఎదరించిన రేవంత్ రెడ్డి కూడా ఇప్పుడు అదే దారిలో ప్రయాణిస్తున్నారు. రెండున్న రేళ్లు కావస్తున్నా..ఒక్కటంటే ఒక్క నిర్మాణాత్మక పని చేయలేదు. రేషన్ కార్డులు ఇచ్చాం..సన్న బియ్యం ఇచ్చాం..ఇదే పల్లవి. కానీ ప్రజల బాధ మరోలా ఉంది. ధాన్యం కొనడం లేదు. గిట్టుబాటు ధరలు రావడం లేదు. ఉద్యోగాలు దక్కడం లేదు. అవినీతి పెరిగింది. పైసా ఇవ్వనిదే ఫైలు కదలడం లేదు. కిందిస్థాయి నుంచి మంత్రుల వరకు అవినీతి అంటూ ఆరోపణలు గుప్పుమంటున్నాయి. పేదల ఇళ్లను కూల్చేస్తున్నారు. వెలుగమట్ల ఘటన ఒక్కటి చాలు..పేదలను ఎంతగా రాచి రంపాన పెట్టారో అర్థం చేసుకోవచ్చు. 50శాతం ఉన్న మహిళలు. 50 శాతం ఉన్న దళిత,గిరిజన, బహుజనులకు రాజ్యాధికారంలో చోటులేదు. ఇలాంటి దుర్భర పరిస్థితుల్లో ...తెలంగాణ రాజకీయ యవనికపై కొత్త పార్టీ ఆవిర్భావం అన్నది ఒక అవసరం. ఆవశ్యకత కూడా ఉంది. ప్రజల పక్షాన పోరాడాల్సిన పార్టీ ఒకటి ఇప్పుడు తక్షణా వసరంగా ఉంది. ఎందుకంటే రాజకీయ పార్టీలన్నీ తమ సొంత ఎజెండాతో పనిచేస్తున్నాయి. సొంత వ్యవహారాల కోసం పనిచేస్తున్నాయి. అన్నింటికి మించి అవినీతి, ఆశ్రిత పక్షపాతంలో కూరుకుపోయాయి. కేంద్రంలో అధికారం లో ఉన్న బిజెపి కూడా తెలంగాణకు చేసిందేమీ లేదు. డబుల్ ఇంజిన్ సర్కార్ అంటూ ఊదరగొట్టడే తప్ప నిలబడి తెలంగాణ పురోగతికి చేసిందేమీ లేదు. నిత్యం విమర్శలు తప్ప మరో ఎజెండా దానికి లేదు. అందుకే గత ఏడాదిగా ప్రజల్లో తిరుగుతూ..వారి సమస్యలను వింటూ..సమస్యలపై పోరాడుతూ వస్తున్న కల్వకుంట్ల కవిత నూతన రాజకీయ పార్టీని ప్రకటించారు. 'తెలంగాణ రాష్ట్ర సేన'గా నామకరణం చేశారు. గతంలో ఓమారు పార్టీ పెడతామని ప్రకటించిన సమయంలో పార్టీ పేరు గురించి అడిగితే ..అప్రయత్నంగానే టిఆర్ఎస్ పేరు కూడా ఖాళీగా ఉందన్నారు. అయితే అంతా టిఆర్ఎస్ పేరును ఓన్ చేసుకుంటుందని భావించారు. కానీ తెలివిగా టిఆర్ఎస్‌నే ప్రకటించినా..తెలంగాణ రాష్ట్రసేనగా ప్రకటించి ఆశ్చర్య పరిచారు. ఇది ఓ రకంగా బిఆర్ఎస్ పార్టీకి ష్టూక్ లాంటిదే. టిఆర్ఎస్ పార్టీని పునరుద్దరించాలనుకున్న ఆ పార్టీకి ఇదో అశనిపాతం లాంటిదే .నిజానికి గత టిఆర్ఎస్‌లో ఉంటూ.. తెలంగాణ కోసం అనేక కష్టాలు పడి.. పిడికిలి బిగించి కొట్లాడామన్న కవిత మాటలు ముమ్మాటికీ నిజం. జాగృతి ద్వారా తెలంగాణ సాంస్కృతిక దీపాలను వెలిగించారు. తెలంగాణ ఉద్యమకారులకు తెలంగాణ జాగృతి వెలుగునిచ్చింది. తెలంగాణ సమాజానికి కాంతిరేఖగా మారింది. మరోసారి బతుకమ్మను ప్రపంచానికి పరిచయం చేసుకున్నామంటే అందులో కవితనే కనిపిస్తారు. నిజానికి తెలంగాణ తెచ్చుకుంటే దరిద్రం పోతుందన్న భావనలో ఉండి పోరాడిన వారంతా ఆగమయ్యారు. ఆ కలలు నిజం కాలేదు. బీఆర్ఎస్ రాష్ట్ర ప్రజల ఆర్తిని అర్థం చేసుకోలేకపోయింది. సామాజిక తెలంగాణ రథ చక్రం విరిగి ముక్కలైంది. కొత్త రాష్ట్రంలో జరగాల్సిన పనులు సరిగా జరగలేదు. తెలంగాణ వస్తే బానిస సంకెళ్లు పోతాయని భావించిన వారంతా భంగపడ్డారు. పోరాటంలో ముందున్న కోదండరామ్ లాంటి వారు బయటకు తోయబడ్డారు. ఆయనే మరో పార్టీ పెట్టాల్సి వచ్చింది. కానీ ప్రజల మద్దతుల లేకపోవడంతో ఆయన ఇప్పుడు ఉనికి కోసం పాకులాడుతున్నారు. కాంగ్రెస్ చేస్తున్న అక్రమాలను ప్రశ్నించే శక్తి కూడా లేకుండా పోయింది. తెచ్చుకున్న తెలంగాణలో రైతులకు బేడీలు పడ్డాయి.. లాఠీలు విరిగాయి. ఇసుక దందా వల్ల దళితులు దెబ్బలు తిన్నారు. ఫోన్లు ఎక్కడ వింటున్నారోనని భయం గుప్పిట్లో బతికారు. వ్యక్తిగత స్వేచ్ఛ లేదు. దారుణమైన నిఘా నీడలో తెలంగాణ అంతా బిక్కుబిక్కుమంటూ బతికింది. ఇవన్నీ కళ్లముందు కదలాడుతున్నాయి. బిఆర్ఎస్ పోయి కాంగ్రెస్ వచ్చినా మార్పు రాలేదు. మార్పు తెచ్చామని, స్వేచ్ఛను ఇచ్చామని ప్రకటించుకున్నా..అది సాకారంకాలేదు. సామాజిక తెలంగాణ అన్నది నినాదంగా మారింది. తెలంగాణలోని 3.5 కోట్ల మందికి అమ్మగా పరిణతి చెందాలనుకుంటున్న కవిత కష్టపడితే..ఆ పేరు సంపాదించుకోవచ్చు. కేవలం నినాదాల కోసం కాకుండా ప్రజలను అక్కున చేర్చుకునే అమ్మగా మారితే ప్రజలు బ్రహ్మరథం పడతారు. తెలంగాణ ప్రజలు నమ్మితే ప్రాణం ఇస్తారు. ఉద్యమకారులు పోరాడితేనే కొత్త రాష్ట్రం వచ్చింది. అది గుర్తించి కవిత అడుగుల వేయాల్సి ఉంటుంది. మాటలు చెప్పడం వేరు, అందుకు అనుగునంగా అడుగుల వేయడం వేరు. రాజకీయాల్లో చిరస్థాయిగా నిలవాలంటే నిబద్దత ముఖ్యం. నిజాయితీ అవసరం. నిలబడే ధైర్యం కావాలి. ప్రజలను ఆకట్టుకునే ప్రసంగాలే కాదు..పనులు చేసే ధైర్యం కనిపించాలి. కవిత ప్రకటించిన ఐదు సూత్రాలను ఆచరణలో పెడితే అద్భుతాలు సాధించవచ్చు. అందుకు కావాల్సిందల్లా ప్రజల పక్షాన పోరాడడం. ఎన్నికలకు మరో రెండేళ్లు గడువు ఉంది. మహిళా రిజర్వేషన్లు కూడా వస్తున్నాయి. మహిళలను, బడుగు బలహీనవర్గాలను రాజ్యాధికారంలో భాగం చేసేలా ప్రణాళికలు రచిస్తే కవిత తప్పకుండా విజయం సాధిస్తారు. రాజకీయ పార్టీగా ముందు నిలబడతారు. అవినీతి లేకుండా సాగుతారన్న నమ్మకం కూడా ముఖ్యం. అందుకు వీరిందరినీ కలుపుకుని పోవడంతో పాటు, గుంటనక్కలను ఎదుర్కొనే చాణక్యం కూడా ముఖ్యం.

# తెలంగాణ రాజకీయ యవనికపై కొత్త పార్టీ

**కవిత సారథ్యంలో తెలంగాణ రాష్ట్ర సేన ఆవిర్భావం**

**తెలంగాణ కోసం పిడికిలి బిగించి కొట్లాడినం**

**నా చెమటను చిందించి..పోరాటం చేశా**

**సామాజిక తెలంగాణ కల సాకారం కాలేదు**

**తెలంగాన కోసం పోరాడిన వారంతా మోసపోయారు**

**మునుపటి కెసిఆర్..ఇప్పుడు లేడన్నది సత్యం**

**పాలమూరు-రంగారెడ్డిని కూడా పూర్తి చేసుకోలేదు**

**అందుకే ప్రజల పక్షాన..ప్రజల కోసం టిఆర్ఎస్‌తో వచ్చా**

**పార్టీ పేరు, జెండా, ఎజెండాను ప్రకటించిన కవిత**

తెలంగాణ రాజకీయ యవనికపై కొత్త పార్టీ ఆవిర్భవించింది. కల్వకుంట్ల కవిత నూతన రాజకీయ పార్టీని ప్రకటించారు. 'తెలంగాణ రాష్ట్ర సేన'గా నామకరణం చేశారు. ఈ మేరకు మేడ్చల్ జిల్లా మునీరాబాద్‌లో ఏర్పాటు చేసిన భారీ సభలో పార్టీ పేరును కవిత ప్రకటించారు. అనంతరం కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగిస్తూ.. రాష్ట్రంలో ఉన్నమూడు పార్టీలు తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడం లేదన్నారు. బిఆర్ఎస్ పదేళ్ల అవినీతి, కాంగ్రెస్ మోసం, బిజెపిల చేతగానితనం కారణంగా తెలంగాణ రాష్ట్రస సేన ఏర్పాటు తప్పలేదన్నారు. ఈ మూడు పార్టీలకు వ్యతిరేకంగా పోరాడడమే ఎజెండగా ఐదు ప్రధాన హామీలతో పాంచజన్యం పూరించారు. ఏ కలలతో తెలంగాణ తెచ్చుకున్నామో అవి నిజం కాలేదన్నారు. తను తెలంగాణ కోసం అనేక కష్టాలు పడి.. పిడికిలి బిగించి కొట్లాడామన్నారు. జాగృతి కార్యకర్తలు తెలంగాణ సాంస్కృతిక దీపాన్ని పదిలంగా కాపాడుకున్నారని చెప్పారు. కాళరాత్రిలో కాగడా వలే తెలంగాణ ఉద్యమకారులకు తెలంగాణ జాగృతి ఉద్యమకారులకు వెలుగునిచ్చింది. తెలంగాణ సమాజానికి కాంతిరేఖగా మారింది. మరోసారి బతుకమ్మను ప్రపంచానికి పరిచయం చేసుకున్నాం. ఇవాళ నా జీవితంలో మరిచిపోలేని రోజు అవుతుంది. తెలంగాణ భవిష్యత్ రాసుకోవడానికి మనందరి భాగస్వామ్యం కావాలి. కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ ఉద్యమ రథం దారి తప్పింది. బీఆర్ఎస్ రాష్ట్ర ప్రజల ఆర్తిని అర్థం చేసుకోలేకపోయింది. సామాజిక తెలంగాణ రథ చక్రం విరిగి ముక్కలైంది. కొత్త రాష్ట్రంలో జరగాల్సిన పనులు సరిగా జరగలేదు. తెలంగాణ వస్తే బానిస సంకెళ్లు పోతాయని భావించాం. కానీ, రైతులకు బేడీలు పడ్డాయి.. ఇసుక దందా వల్ల దళితులు దెబ్బలు తిన్నారు. ఫోన్లు ఎక్కడ వింటున్నారోనని భయం.. వ్యక్తిగత స్వేచ్ఛ లేదు. దారుణమైన నిఘా నీడలో తెలంగాణ అంతా బతికింది. మనం అనుకున్న తెలంగాణ రాలేదనేది ముమ్మాటికీ వాస్తవం. ఆనాడు పరిపాలించిన కుటుంబంలో నేను కూడా ఒక భాగం. అందుకే కొన్ని విషయాల్లో సిగ్గుపడుతున్నా. తెలంగాణ ప్రజలను క్షమించాలని కోరుతున్నా అని ప్రకటించారు.



తెలంగాణ సాధించినందుకు చాలా గర్వపడుతున్నా. జన్మధన్యమైందని భావిస్తున్నా. కానీ, తప్పులో నాకూ భాగం ఉన్నందుకు క్షమాపణ చెబితే సరిపోదు. సామాజిక తెలంగాణ కోసం నడుం బిగించి కష్టపడి పని చేయాలి. పని చేయడం కోసమే తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్) ప్రజల ముందుకు వచ్చిందని అన్నారు. మా పని తీరు ఎలా ఉంటుందో ప్రజలు చూస్తారు. ప్రజలకు మంచి చేయాలంటే పోరాడితే సరిపోదు.. రాజకీయ అధికారం ఉండాలి. అది తోడైతేనే ప్రజలకు మంచి చేయగలం. ఏ పార్టీకైనా ఆత్మ, నేపథ్యం ఉండాలి. బీఆర్ఎస్ సాంకేతికంగా ఉన్నా ఆత్మను కోల్పోయింది. బీఆర్ఎస్ ఆత్మ కోల్పోయినందుకే తెలంగాణ రాష్ట్ర సేన వచ్చింది. నాటి టీఆర్ఎస్ కోసం నా రక్తం, చెమట, సమయం ధారపోశా. పార్టీ బలోపేతం కోసం పని చేశా. ఆనాటి కేసీఆర్ వేరు.. ఇప్పటి కేసీఆర్ వేరు. చేనేత కార్మికులు చనిపోతుంటే.. ఆనాటి కేసీఆర్ భిక్షాటన చేశారు. ఇవాళ్టి కేసీఆర్ మారిన మనిషి.. మర మనిషి.. మన మనిషి కాదు. ఎక్కడ చిన్న కష్టం వచ్చినా ఆ సార్ రారు.. ఎందుకంటే ఆయన మారిన మనిషి. గుంటనక్కలు, తోడేళ్ల చేతిలో కేసీఆర్ ఖైదీ అయ్యారు. పంజాబ్, గుజరాత్, బిహార్ వెళ్లి జాతీయ పార్టీ పెట్టాలని చూశారు. కేంద్రంతో గొడవ పెట్టుకోకుండా ఉండి ఉంటే పాలమూరు పూర్తయ్యేది. నేను ఎన్ని మాట్లాడినా బీఆర్ఎస్ నేతలు బయటకు వచ్చి జవాబివ్వట్లేదు. సమాధానం చెప్పకపోతే.. ప్రజలే బయటకు లాగి జవాబు చెప్పేలా చేస్తారని కూడా చిన్న హెచ్చరిక చేశారు. తెలంగాణలోని 3.5 కోట్ల మందికి అమ్మగా పరిణతి చెందాలనుకుంటున్నా. అమ్మతనంతో పాలన చేస్తేనే బిడ్డలకు కష్టం వస్తే తీరుస్తుంది. తెలంగాణలో ఏళ్ల తరబడి భూస్వామ్య వ్యవస్థ నడిచింది. ఎందరో మహనీయులు పోరాడితే కొంత సమానత్వం వచ్చింది. మలిదశ ఉద్యమంలో కేసీఆర్, ఉద్యమకారులు పోరాడితే కొత్త రాష్ట్రం వచ్చింది.

రాజకీయ శక్తితో పోరాటాలు మిళితం చేసి సామాజిక న్యాయ తెలంగాణ సాధిస్తాం. భాజపాకి రాష్ట్ర ఏర్పాటే ఇష్టం లేదు. 'తల్లిని చంపారు.. పిల్లను బతికించారని' ఒకరు అన్నారు. భారత్, పాక్ విడదీసినట్లు తెలుగు రాష్ట్రాలను విభజించారని మరో ఎంపీ చెప్పారు. అయినా, భాజపా బానిస ఎంపీలు ఒక్క మాట మాట్లాడలేదు. తెలంగాణ నుంచి 7 మండలాలు లాక్కుంటే భాజపా ఎంపీలు మాట్లాడరు. విభజన హామీలు నెరవేర్చకపోతే భాజపా ఎంపీలు మాట్లాడరు. సామాజిక న్యాయానికి బద్ధ వ్యతిరేకి భాజపా. తెలంగాణ భాజపా ఎంపీలకు సవాల్ విసురుతున్నా.. తెలంగాణ తల్లి బిడ్డలైతే ఏపీలో కలిసిన కనీసం 5 గ్రామాలను వెనక్కి వచ్చేలా చూడాలి. భద్రాచలం వద్ద ఉన్న 5 గ్రామాలు పోతే రాముడి గుడి మునుగుతుంది. గ్రామాలను వెనక్కి తీసుకురావడానికి జాగృతి తరఫున కేంద్రానికి లేఖ రాశాం. మూడు పార్టీలపై అలుపెరగని పోరాటానికి కార్యకర్తలంతా సిద్ధం కావాలని కవిత అన్నారు.

# రాష్ట్రంలో కర్కోటకుడి పాలన

**గురుకులాల్లో పిల్లలు చనిపోతున్న పట్టింపేదీ**

**సిఎం రేవంత్ పాలనపై కవిత విమర్శలు**

ఇది ప్రారంభం మాత్రమే, ఇన్‌ఫ్రంట్ డేరీజ్ క్రొకడైల్ ఫెస్టివల్ అని కొతత్గా టీఆర్ఎస్ తెలంగాణ రాష్ట్ర సేనను ప్రకటించిన పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత అన్నారు. రాష్ట్రంలో ఒక కర్కోటకుడి పాలన నడుస్తోందని.. ఒక రాజకీయ నేతను అలా అనకూడదు.. కానీ, అనాల్సి వస్తుందన్నారు. గురుకులాల్లో పిల్లలు చనిపోతున్నా.. సీఎం మాట్లాడట్లేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మండిపడ్డారు. అందుకే కర్కోటకుడని అంటున్నాం.. ఇప్పుడు మనమే ప్రధాన ప్రతిపక్షం, రెండేళ్ల తర్వాత మనదే అధికారమన్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మునీరాబాద్‌లోని అద్వయ కన్వెన్షన్‌లో కొత్త పార్టీ పేరు ప్రకటించిన ఆమె రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. పాంచజన్యం పేరుతో ఐదు హామీలు ప్రకటించారు. ప్రభుత్వ స్కూళ్లను బలోపతేం చేస్తూనే ప్రైవేట్ స్కూళ్లలో కూడా ఫ్రీగా విద్య అందిస్తాం.. ఏ రోగమైనా రానీ, ఏ ఆస్పత్రైనా సరే ఉచితంగా అందిస్తాం.. వ్యవసాయం: రైతే రాజు అన్న నినాదాన్ని నిజం చేస్తాం.. ఉపాధి: రూ.2 లక్షల-రూ.20 కోట్ల వరకు యువతకు రుణాలు..ప్రభుత్వం దా÷-వారానే అందిస్తాం. మొదటి ఏడాదిలోనే సింగిల్ నోటిఫికేషన్‌లో 4 లక్షల ఉద్యోగాలు నియమిస్తాం. ఉద్యమకారుల కు లక్ష సూపర్ న్యూమరీ ఉద్యోగాలు ఇస్తాం.. . సామాజిక న్యాయం సాధించాల్సిందే' అని ప్రకటించారు.

అనంతరం బీఆర్ఎస్, కేసీఆర్ గురించి కవిత మాట్లాడారు. 'మన కేసీఆర్ అయ్యింటే పాలమూరు ప్రాజెక్టును కట్టించేవారు. మారిన కేసీఆర్ పంజాబ్ వెళ్లారు. జాతీయ పార్టీ పెడతానని చెప్పారు. సింగరేణిలో గనిలో కార్మికుడు చనిపోతే చూసొచ్చే వ్యక్తి. కేసీఆర్ రాజకీయ పరిణితి కోల్పోయారు. కేటీఆర్ మాట్లాడారంటే అనుకోవచ్చు. ఆయనకు రాజకీయం తెలియదు. ఒక కర్కోటకుడి పాలన నడుస్తోంది. ఇళ్లను కూల్చుతుంటే ఆదుకోవాల్సిన అమ్మలాంటి కేసీఆర్ ఎక్కడున్నారు..? మారుతారేమోనని చూశా.. కానీ, నన్నే సస్పెండ్ చేశారు. ఉద్యమకారులను పార్టీ నుంచి బయటకు పంపిన రోజే తాను మాట్లాడాల్సింది. కానీ, మాట్లాడలేదు.. ఇవాళ నాకు అదే జరిగింది. ఉద్యమంలో కొట్టినవారినే తీసుకొచ్చి పట్టం కట్టారు. వాళ్ల అనుచరులు మనవాళ్లను అణగతొక్కారు. ఉద్యమకారులను నామినేటెడ్ పోస్టులు ఇచ్చినా సరిపోయేది. కండువా వేసుకొని అప్పుడు పిచ్చొల్లలాగా తిరిగాం. ఆ పార్టీలో అమ్మతనం పోయింది, మమకారం పోయింది. అందుకే కేసీఆర్ మన కేసీఆర్ కాదు. మరబొమ్మ అయ్యారు అని కవిత వ్యాఖ్యానించారు.

# ఎంతయినా ఒరిజినల్ .. ఒరిజినలే

**కవిత పార్టీపై బిఆర్ఎస్ సెటైర్లు**

**అసలు ఒరిజినలే లేదుగా అంటూ టిఆర్ఎస్ ప్రతిదాడి**

కవిత పార్టీపై బీఆర్ఎస్ వ్యంగ్యంగా స్పందించింది. కవిత తన కొత్త పార్టీ పేరును టీఆర్ఎస్ (తెలంగాణ రాష్ట్ర సేన)గా ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ అంశంపై స్పందించిన బీఆర్ఎస్.. ఎంతైనా ఒరిజినల్ ఒరిజినలే అని సెటైర్ వేసింది. కవిత పార్టీ పేరును కాపీ కొట్టిందని అర్థం వచ్చేలా ట్వీట్ చేసింది. సెటైర్‌గా ఒరిజినల్, డూప్లికేట్ కోల్గేట్, బిస్లెరీ ఫొటోలు షేర్ చేసింది బీఆర్ఎస్. ఒరిజినల్ ఎప్పటికీ ఒరిజినలే అంటూ బీఆర్ఎస్ పోస్ట్ చేసింది. అయితే టిఆర్ఎస్ అన్న ఒరిజినల్ పార్టీ కూడా ఇప్పుడు తమ వద్ద లేదన్న ఇంగితం కూడా బిఆర్ఎస్ గుర్తించలేదు. ఒరిజినల్ ఉంటే డూప్లికేట్ గుర్తించవచ్చారు. ఒరిజినల్ లేకుండానే బిఆర్ఎస్ విమర్శలు చేస్తోందని కొత్తగా ఏర్పాటైన టిఆర్ఎస్ నేతలు అప్పుడే విమర్శలకు పదను పెట్టారు. అంతేగాదు ఆయన ఫామ్‌హౌజ్నుంచి రారు అని కూడా కెసిఆర్‌పై సెటైలర్లు గుప్పించారు.

# ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసేందుకు అంగీకరించాం: మంత్రి పొన్నం ప్రభాకర్

**రెండు రోజుల సమ్మెలోనే పలుమార్లు కార్మికులతో చర్చలు జరిపామని వెల్లడి**

**కార్మిక సంఘాల ఎన్నికలు, 11 శాతం పీఆర్సీ ప్రకటనకు అంగీకరించినట్లు వెల్లడి**

**ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామన్న మంత్రి**

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం సహా పలు డిమాండ్లకు తమ ప్రభుత్వం అంగీకరించిందని తెలంగాణ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ డీసీసీ అధ్యక్షులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్‌లు , అధికార ప్రతినిధులతో ఆయన వర్చువల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రెండు రోజుల సమ్మెలోనే పలుమార్లు కార్మికులతో చర్చలు జరిపినట్లు తెలిపారు.వారి చిరకాల స్వప్నమైన ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం, కార్మిక సంఘాల ఎన్నికలు, 11 శాతం పీఆర్సీ ప్రకటన పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని తెలిపారు. ప్రభుత్వం డిమాండ్లకు అంగీకరించడంతో కార్మికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలపై మంత్రుల బృందం సుమారు 15 గంటలు చర్చించి వారి సమస్యలను పరిష్కరించి, సమ్మెను విరమింపజేశారని అన్నారు.ఆర్టీసీ కార్మికుల అంశాలపై ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నందుకు రాష్ట్రవ్యాప్తంగా పార్టీ కేడర్ సంబరాలు నిర్వహించాలని సూచించారు. ఆర్టీసీ కార్మికుల ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం అంగీకరించిందని అన్నారు. ఆర్టీసీ విలీనం, కార్మిక సంఘాల ఎన్నికల నిర్వహణ, ఉద్యోగులకు 11 శాతం పీఆర్సీ ప్రకటనతో పాటు మిగిలిన సమస్యలను కూడా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.గతంలో కార్మికులు 55 రోజుల పాటు సమ్మె చేస్తే గత ప్రభుత్వం ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని ఆరోపించారు. ఆ రోజు సమ్మె సమయంలో 30 మంది ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీ కార్మికులతో ప్రభుత్వానికి శత్రుత్వం ఉండదని, వారు కూడా కుటుంబ సభ్యులే అన్నారు. ఆత్మహత్య చేసుకున్న డ్రైవర్ శంకర్ గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు.ప్రజా రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆర్టీసీ కార్మికుల సమ్మె సమయంలో బీజేపీ, బీఆర్ఎస్ వ్యవహరించిన తీరు సరికాదని అన్నారు. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ శవరాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. ఎన్నికల సమయంలో మనం ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని మంత్రి తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఉద్యోగ నియామకాలు, కారుణ్య నియామకాలు, సర్వీసు నుంచి తొలగించిన వారిని ఉద్యోగాల్లోకి తీసుకోవడం జరిగిందని అన్నారు. రోజుకు 65 లక్షల మంది ప్రయాణికులు ఆర్టీసీలో ప్రయాణం చేస్తున్నారని తెలిపారు.

# అంతర్జాతీయ స్థిరత్వానికి ఇరాన్ నుంచి ముప్పు, అందుకే ప్రమాదకర మిషన్ చేపట్టాం: పీట్ హెగ్సెత్

అంతర్జాతీయ స్థిరత్వానికి ఇరాన్ నుంచి ముప్పు పొంచి ఉందని, ఆ ప్రమాదాన్ని తొలగించడానికే తాము సాహసోపేతమైన, ప్రమాదకర మిషన్‌ను చేపట్టామని అమెరికా రక్షణ శాఖ మంత్రి పీట్ హెగ్సెత్ అన్నారు. హర్మూజ్ జలసంధి వద్ద ఇరాన్ నౌకల రాకపోకలపై అమెరికా దిగ్బంధం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ, ఈ జలసంధిపై నియంత్రణను మరింతకాలం పొడిగిస్తామని స్పష్టం చేశారు.హర్మూజ్ జలసంధి వద్ద అమెరికా నేవీ దిగ్బంధనాన్ని ఆయన ఉక్కు కవచంతో పోల్చారు. ఇది శాశ్వత నిర్బంధంగా కొనసాగే అవకాశం ఉందని అన్నారు. ఇరాన్ తన అణ్వాయుధాల తయారీని విడనాడే వరకు ఆ దేశంపై ఒత్తిడి ఉంటుందని అన్నారు. తమ అనుమతి లేకుండా హర్మజ్ జలసంధిని ఏ రవాణా నౌక దాటదని హెచ్చరించారు. జలసంధిలో నౌకలపై దాడులు చేస్తూ టెహ్రాన్ సముద్రపు దొంగల ముఠాలా ప్రవర్తిస్తోందని ఆరోపించారు. ఇరాన్ సముద్ర భద్రతను అస్థిరపరుస్తోందని విమర్శించారు. తమ దిగ్బంధనం గల్ఫ్ దాటి విస్తరిస్తోందని తెలిపారు. అంతర్జాతీయ వాణిజ్యాన్ని కాపాడేందుకు తాము ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కొంటామని అన్నారు. ఇస్లామాబాద్ వేదికగా అమెరికా, ఇరాన్ పరోక్ష చర్చలకు సిద్ధమైన సమయంలో హెగ్సెత్ కీలక వ్యాఖ్యలు చేశారు.



# బీజేపీలో చేరిన ఆప్ ఎంపీలపై అనర్హత వేటు తప్పదా? చట్టం ఏం చెబుతోందంటే..!

ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)కి రాజ్యసభలో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. శుక్రవారం ఆ పార్టీకి చెందిన ఏడుగురు రాజ్యసభ సభ్యులు అనూహ్యంగా బీజేపీలో చేరారు. రాఘవ్ చద్దా, సందీప్ పాఠక్, స్వాతి మాలీవాల్, హర్భజన్ సింగ్, అశోక్ మిత్తల్, రాజిందర్ గుప్తా, విక్రమ్‌జీత్ సాహ్నీ వంటి కీలక నేతలు కమలం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. దీంతో 10 మంది సభ్యులున్న ఆప్‌కు పెద్దల సభలో కేవలం ముగ్గురు ఎంపీలు మాత్రమే మిగిలారు. ఈ పరిణామం ఇప్పుడు పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టంపై తీవ్రమైన చర్చకు దారితీసింది.వారిపై అనర్హత వేటు పడుతుందా లేదా అనే దానిపై ప్రస్తుతం భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. జాతీయ మీడియాలో వచ్చిన ఒక కథనం ప్రకారం, రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ (పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం) కింద, ఒక సభలోని పార్టీ సభ్యుల్లో మూడింట రెండు వంతుల మంది మరో పార్టీలో చేరితే దానిని ఫిరాయింపుగా కాకుండా 'విలీనం'గా పరిగణిస్తారు. ఈ నిబంధన ప్రకారం వారిపై అనర్హత వేటు పడకపోవచ్చని పీఆర్ఎస్ లెజిస్లేటివ్ రీసెర్చ్‌కు చెందిన చక్షు రాయ్ అభిప్రాయపడ్డారు. గతంలో టీడీపీ రాజ్యసభ సభ్యులు బీజేపీలో విలీనమైనప్పుడు అప్పటి ఛైర్మన్ వెంకయ్య నాయుడు దీనిని ఆమోదించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు.అయితే, లోక్‌సభ మాజీ సెక్రటరీ జనరల్ పీడీటీ ఆచారి దీనితో విబేధిస్తున్నారు. కేవలం రాజ్యసభలోని సభ్యులు విలీనమైతే సరిపోదని, మాతృసంస్థ అయిన ఆమ్ ఆద్మీ పార్టీ మొత్తం బీజేపీలో చేరితేనే అది 'విలీనం' అవుతుందని ఆయన వాదిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎవరైనా అనర్హత పిటిషన్ దాఖలు చేస్తే, దానిపై రాజ్యసభ ఛైర్మన్ నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. ఛైర్మన్ వారిని అనర్హులుగా ప్రకటించవచ్చు లేదా విలీనాన్ని ఆమోదించవచ్చు. ఆయన నిర్ణయాన్ని కోర్టులో సవాలు చేసే అవకాశం కూడా ఉంటుంది.1960-70 దశకంలో జరిగిన భారీ పార్టీ ఫిరాయింపులను అరికట్టడానికే 1985లో ఈ చట్టాన్ని తీసుకొచ్చారు. ప్రస్తుతానికి ఈ ఏడుగురు ఎంపీల భవిష్యత్తు రాజ్యసభ ఛైర్మన్ నిర్ణయం, ఆ తర్వాత ఎదురయ్యే న్యాయపరమైన సవాళ్లపైనే ఆధారపడి ఉంది. ఈ లోగా వారు సాంకేతికంగా ఆప్ సభ్యులుగానే ఉన్నా, ఓటింగ్‌లో బీజేపీకి మద్దతిస్తే ఎన్డీయే బలం మరింత పెరగనుంది.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com